www.prajapaksham.in
PRAJAPAKSHAM ★★★
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
సంపుటి 08, సంచిక: 334 | బుధవారం | 05-11-2025 | కరీంనగర్
Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00




బిహార్‌లో మహిళల భద్రత ఆందోళనకరం

యువత పట్ల మోదీ ఉదాసీనత

వరికి రూ.300, గోధుమలకు రూ.400 బోనస్ : తేజస్వీ హామీ

05

# మరోసారి వణికిన వరంగల్

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

- పలు చోట్ల రహదారులు జలమయం
- ఎనుమాముల మార్కెట్‌లో తడిచి ముద్దయిన పత్తి, ధాన్యం
- కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోనూ వర్షాలు
- జలదిగ్బంధంలో మహేశ్వరం మండలం రామచంద్రగూడ
- నీటమునిగిన మోడల్ స్కూల్



ప్రజాపక్షం/వరంగల్ టౌన్

వారం రోజుల క్రితం సంభవించిన 'మొంథా' తుఫాన్ నుంచి తేరుకోకముందే ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలను మరోసారి వరుణుడు వణికించాడు. మంగళవారం ఉదయం ఆయా జిల్లాల్లోని పలు చోట్ల భారీ వర్షం కురిసింది. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులతో కూడిన భారీ వాన కురిసింది. సుమారు 30 నిమిషాల పాటు కురిసిన కుండపోత వర్షానికి నగరంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల మొంథా తుఫాన్ కల్లోలానికి ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాలు పూర్తిగా తేరుకోలేదు. తాజా వర్షంతో మరోసారి ముంపు భయంతో కాలనీవాసులు వణికిపోయారు. జనగామ జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి వర్షం కురిసింది. స్టేషన్ ఘన్‌పూర్, లింగాల ఘన్‌పూర్, తరిగొప్పుల, నర్మెట, బచ్చన్నపేట మండలాల్లో వర్షం పడింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి వరంగల్ వ్యవసాయ మార్కెట్లో రైతుల పత్తి, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. వ్యవసాయ మార్కెట్‌కు జిల్లా వ్యాప్తంగా రైతులు పత్తి, మొక్కజొన్న పంటలను విక్రయించేందుకు తీసుకురాగా, ఉదయం కురిసిన భారీ వర్షానికి తడిసిపోయాయి. తడిసిన పంటను కొనేవారు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. అష్టకష్టాలు పడి సాగు చేసిన పంటలను మార్కెట్ యార్డుకు తరలిస్తే, ఒక్కసారిగా కురిసిన వర్షం తమను నట్టేట ముంచిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా తమ పంటను కొనుగోలు చేసి న్యాయం చేయాలని అన్నదాతలు వ్యాపారులను వేడుకున్నారు. వర్షానికి ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోవడంతో రైతుల ఆక్రందనలు తరువాయి 2లో

## మూడు రోజులు మోస్తరు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మూడురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి ఆనుకొని ఉన్న మధ్య బంగాళా ఖాతంలో సగటు సముద్రమట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందన్నారు. ఉత్తర తమిళనాడు తీరం, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఉందని తెలిపారు. రాష్ట్రంలో మూడురోజుల పాటువర్షాలు కురిసే తరువాయి 2లో



# హైదరాబాద్‌లో జిసిసి

- ప్రారంభించనున్నట్లు జర్మనీ బృందం ప్రకటన
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం
- రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెడితే ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం హామీ
- అమెజాన్ వెబ్ సర్వీసెస్ పెట్టుబడులు, విస్తరణకు ప్రభుత్వం సహకారం

ప్రజాపక్షం/హైదరాబాద్

డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో డ్యుయిష్ బోర్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జిసిసి)ని హైదరాబాద్‌లో ప్రారంభిస్తున్నట్లు జర్మనీ బృందం ప్రకటించింది. జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ నేతృత్వంలోని జర్మనీ బృందం తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలిసి ఈ విషయాన్ని తెలియజేసింది. జిసిసి ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు జర్మనీ బృందానికి సిఎం ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందని సిఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్ డ్యుయిష్ బోర్స్ కంపెనీ జిసిసి ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో ఐటి రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు సిఎంకు జర్మనీ బృందం వివరించింది. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని జర్మనీ బృందాన్ని సిఎం కోరారు. హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ కాన్సులేట్ జనరల్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందన్న సిఎం చెప్పారు. ఐటి, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని సిఎం జర్మనీ బృందాన్ని కోరారు. వీటితో 'టామ్ కామ్' ద్వారా వొకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించేందుకు సహకరించాలన్నారు. ఈ భేటీలో డ్యుయిష్ బోర్స్ సిఐఓ, సిఓఓ అమిత దేశాయ్, డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**అమెజాన్ వెబ్ సర్వీసెస్ పెట్టుబడులు, విస్తరణకు ప్రభుత్వం సహకారం**

తెలంగాణలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్) పెట్టుబడులు, విస్తరణ కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి తరువాయి 2లో



## అజాహరుద్దీన్‌కు మైనారిటీ సంక్షేమం

శాఖలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర కేబినెట్ లో కొత్తగా చేరిన మంత్రి మహ్మద్ అజారుద్దీన్ కు ప్రభుత్వం శాఖలను కేటాయించింది. మైనార్టీ సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థలు శాఖలను కేటాయిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ ఆమోదంతో శాఖలు కేటాయించినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం సిఎం వద్ద మున్సిపల్ అడ్మినిస్ట్రేషతో పాటు పట్టణాభివృద్ధి శాఖ, జనరల్ అడ్మినిస్ట్రేషన్, లా అండ్ ఆర్డర్ మంత్రికి తరువాయి 2లో




## రోడ్డు ప్రమాదంపై హెచ్‌ఆర్‌సి ఆగ్రహం

మీర్జాగూడ ఘటనలో సుమోటోగా కేసు నమోదు

అధికారులకు నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సి)మంగళవారం సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ ప్రమాదంలో 19 మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. దీనిపై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ స్పందించింది. రోడ్డు భద్రతా లోపాలు, అధిక వేగం, హైవే విస్తరణ ఆలస్యం, అధికారుల నిర్లక్ష్యం వంటి అంశాలపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రవాణా శాఖ, హోం శాఖ, గనులు భూగర్భశాస్త్ర శాఖ, ఎన్‌హెచ్ఐఎ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, తరువాయి 2లో



## మరో ఏడాది పొడిగింపు

'ఔట్ సోర్సింగ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల' కాలపరిమితి పెంచిన ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల కాల పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల సంఖ్య గ్రామ పంచాయతీల సంఖ్యను మించకుండా చూసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో పని చేస్తున్న (1037) పంచాయతీ కార్యదర్శుల కాలపరిమితిని 2025,ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2026, మార్చి 31 వరకు పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. కాగా కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ నియామకానికి సంబంధించిన పద్ధతులను అనుసరించాలని, వారికి ప్రతినెలా రూ.19,500 వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# నాణ్యతపై రాజీపడం

- ఎత్తిపోతల నిర్మాణాల్లో విధిగా పాటించాల్సిందే
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు, ఏజెన్సీలకు హెచ్చరిక
- హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని ఎత్తిపోతలపై సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్/సూర్యాపేట

ఎత్తిపోతల నిర్మాణాలలో విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాలపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లోపించిందని తెలిస్తే ఉపేక్షించేది లేదని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రైతాంగం కళ్ళలో వెలుగులు నింపడంతో పాటు హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలను సస్యశ్యామలం చేయడానికే ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని మొదలు పెట్టామన్నారు. అటువంటి నిర్మాణంలో నాణ్యత లోపించిందని తేలితే సహించేది లేదని అధికారులకు, ఏజెన్సీలకు అల్టిమేటం జారీ చేశారు. హుజూర్‌నగర్ నియోజక వర్గ పరిధిలోని మహాత్మాగాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకంతోపాటు జవహర్ జాన్‌పహాడ్ బ్రాంచ్ కెనాల్, బెట్టేతండ, నక్కగూడెం, రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకాల పురోగతితోపాటు హుజూర్ నగర్‌లో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖా కార్యాలయ భవన పురోగతిపై సమీక్షించారు. కోదాడ నియోజక వర్గ పరిధిలోని రెడ్లకుంట, రాజీవ్ శాంతినగర్, ఆర్9, మోతె ఎత్తిపోతల పథకాలతో పాటు కోదాడలో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖ కార్యాలయ భవన నిర్మాణం పురోగతిని తెలుసుకున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల ద్వారా నిర్ధేశిత తరువాయి 2లో

## పెన్షనర్లకు మోదీ సర్కార్ తీరని ద్రోహం

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్



12

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కమిటీ

ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో పాటు 15 మందితో నియామకం

కమిటీలో ప్రొఫెసర్లు కోదండరామ్, కంచ ఐలయ్యకు చోటు




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో మొబలైజేషన్ ఆఫ్ ఫైనాన్స్ ఫర్ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ స్కీమ్' కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి వైస్ ఛైర్మన్‌గా, సభ్యులుగా ప్రొఫెసర్ కంచఐలయ్య, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను సభ్యునిగా నియమించారు. మొత్తంగా తరువాయి 2లో

## డాక్టర్ ఇంట్లో భారీగా డ్రగ్స్

- రూ.3 లక్షల విలువైన మత్తుపదార్థాలు స్వాధీనం
- వైద్యుడి అరెస్ట్



ప్రజాపక్షం/హైదరాబాద్

పది మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు వైద్య వృత్తితో ప్రాణం పోయాల్సిన వైద్యుడే ప్రాణాంతకమైన డ్రగ్స్ కు బానిస అయ్యాడు. డ్రగ్స్ కొనాలంటే తనకు తగినంత డబ్బు లేదని ముగ్గురు స్నేహితులు చేసే డ్రగ్స్ వ్యాపారంలో పాలుపంచుకున్నాడు. ఢిల్లీ, బెంగళూరు నుంచి దిగుమతి చేసుకున్న డ్రగ్స్ తన ఇంట్లో పెట్టుకుని అమ్మకాలు సాగిస్తూ ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ బి టీం కు తరువాయి 2లో

# ప్యాసింజర్, గూడ్స్‌రైలు ఢీ

ఏడుగురు మృతి, 14 మందికి గాయాలు

ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్ స్టేషన్ సమీపంలో ఘటన



**బిలాస్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం రైలు ప్రమాదం సంభవించింది. బిలాస్‌పూర్ స్టేషన్ సమీపంలో ప్యాసింజర్ రైలు వెనుక నుండి గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మరణించగా, 14 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మేము (మెయిన్‌లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్) ప్యాసింజర్ రైలు గెవ్రా (పొరుగున ఉన్న కోర్బా జిల్లాలో) నుండి బిలాస్‌పూర్‌కు వెళుతుండగా సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. ఘటన ప్రభావం చాలా తీవ్రంగా ఉండటంతో ప్యాసింజర్ రైలు కోచ్ కార్గో రైలు వ్యాగన్ పైన పడిందని అధికారులు తెలిపారు. హౌరా–ముంబయి రైలు మార్గం విభాగంలో గటోరా, బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య గూడ్స్ రైలును ప్యాసింజర్ రైలు ఢీకొట్టిందని తరువాయి 2లో

'మక్కల కొనుగోలు'లో సహకారం లేదు

ఫిన్ టెక్ 'గ్లోబల్ కమాండ్ సెంటర్'గా హైదరాబాద్

ఫీజు బకాయిలపై ఉన్నత విద్యామండలి ముట్టడి

వైద్యశాఖలో ముగ్గురు డిప్యూటీ డైరెక్టర్లకు పదోన్నతి

03

ఒక్క ఓటరును తొలగించినా

# కేంద్ర ప్రభుత్వ పతనం ఖాయం

- పశ్చిమ బెంగాల్ సిఎం మమతా హెచ్చరిక
- సర్‌కు వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శన



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను చేపట్టడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. అర్హులైన ఒక్క ఓటరును కూడా జాబితా నుండి తొలగిస్తే కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం పతనం ఖాయమని హెచ్చరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్లను బెదిరించడానికి కాషాయ పార్టీ, ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌ను రాజకీయ అస్త్రంగా ఉపయోగిస్తున్నాయని ఆరోపించారు. కోల్‌కతాలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మంగళవారం మమతా బెనర్జీ నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నిరసన ప్రదర్శనలో తన మేనల్లుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. దాదాపు 4 కిలో మీటర్ల మేర ర్యాలీ కొనసాగింది. ర్యాలీనుద్దేశించి సిఎం మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాలను తరువాయి 12లో

బిహార్‌లో తొలివిడత

# ప్రచారానికి తెర

6న 18 జిల్లాల పరిధిలోని 121నియోజకవర్గాల్లో ఓటింగ్ : పోలింగ్‌కు రంగం సిద్ధం



**పాట్నా :** బిహార్‌లో తొలి విడత ప్రచారానికి మంగళవారం సాయంత్రం తెరపడింది. ఈనెల 6న 18 జిల్లాల పరిధిలోని 121నియోజకవర్గాల్లో ఓటింగ్ జరగనుంది. ఇందుకు రంగం సిద్ధమైంది. ఎన్‌డిఎ, మహాఘట్‌బంధన్ కూటములు హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. ఇరుకూటముల తరఫున అగ్ర నేతలు సుడిగాలి ప్రచారం నిర్వహించారు. జంగల్ రాజ్‌ను అడ్డుకోవాలంటే ఎన్‌డిఎను గెలిపించాలని బిజెపి, జెడియు నేతలు, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం కావాలంటే మహాఘట్‌బంధన్‌కు ఓటేయాలని కాంగ్రెస్, ఆర్‌జెడి నేతలు ప్రచారం నిర్వహించారు. అధికారం నిలబెట్టుకోవాలని పావులు కదుపుతున్న బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ, మళ్లీ గద్దెనెక్కాలని సర్వశక్తులు ఒడ్డుతున్న ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ మధ్య గట్టిపోటీ నెలకొంది. ఎన్‌డిఎ తరఫున ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, సిఎం నితీశ్‌కుమార్, ఎల్‌జెపి అధినేత చిరాగ్ పాశ్వాన్, మహాఘట్‌బంధన్ తరఫున రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్, అఖిలేష్ యాదవ్ తదితరులు ప్రచారం నిర్వహించారు. బిహార్‌లో 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఈనెల 6న 18జిల్లాల పరిధిలోని తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఆత్మరక్షణ వ్యూహానికే కట్టుబడ్డాం: చైనా

**బీజింగ్:** తమ దేశం అణు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందించారు. చైనా అణ్వస్త్రాలను కలిగివున్న దేశమే అయినాగానీ బాధ్యతగా వ్యవహరిస్తుందని చెప్పారు. ఆత్మరక్షణ అణు వ్యూహాన్ని సమర్థిస్తుందని అన్నారు. అణు పరీక్షలు నిలిపివేయాలనే విషయంలోనూ తమ వైఖరి మారదని తెలిపారు. రష్యా, చైనా సహా ఇతర దేశాలు అణుసామర్థ్యాలు పెంచుకుంటున్న క్రమంలో అణ్వస్త్రాల పరీక్షలు పున:ప్రారంభించేలా డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు ట్రంప్ ఆదేశాలు ఇవ్వడం విదితమే.

**మొదటి దేశం మాది కాదు– పాక్ :** అణు పరీక్షలు నిర్వహించిన మొదటి దేశం తమది కాదని పాకిస్థాన్ పేర్కొంది. అణు పరీక్షలను ముందుగా పునరుద్ధరించబోమని తెలిపింది. అణ్వస్త్రాల పరీక్షలపై ట్రంప్ వ్యాఖ్యల క్రమంలో పాకిస్థాన్ కీలక అధికారి ఈ వ్యాఖ్యలు చేశారు.

## ప్రపంచాన్ని 150 సార్లు పేల్చే శక్తి అమెరికా సొంతం

### అణ్వస్త్ర పరీక్షలపై ట్రంప్



**వాషింగ్టన్:** రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్థాన్ అణ్వస్త్రాల పరీక్షలను రహస్యంగా జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ వద్ద ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేంత శక్తిగల అణ్వాయుధాలు ఉన్నాయని చెప్పారు. 30 ఏళ్ల తర్వాత అణ్వస్త్రాల పరీక్షలకు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. తమ వద్ద ఉన్న అణ్వాస్త్రాల పనితీరును తెలుసుకోవాలంటే పరీక్షలు నిర్వహించాల్సిందేనని చెప్పారు. అణు పరీక్షల కోసం తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఈ జాబితాలో రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్థాన్ కూడా ఉన్నాయని, అవి వాటి గురించి మాట్లాడటం లేదని ఆయన చెప్పుకొచ్చారు. ఏ దేశం వద్ద లేనంత అణుశక్తి అమెరికా దగ్గర ఉందని వక్కాణించారు. మరో ఐదేళ్లలో చైనా తమ దేశానికి సమానంగా శక్తిని పెంచుకోగలదని అన్నారు. మిగతా దేశాలు అణ్వస్త్రాలను పరీక్షించుకుంటుంటే అమెరికా ఎందుకు వెనుకుండాలి? మేము కూడా అణ్వస్త్రాలను పరీక్షిస్తాం. ఇందుకోసం ఉత్తర్వులు జారీచేశాను. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం అవుతుంది' అని ట్రంప్ అన్నారు. అమెరికా చివరిసారి 1992లో అణ్వాయుధాన్ని పరీక్షించింది. ఒకవేళ మళ్లీ పరీక్షలు నిర్వహించాలంటే, వందల మిలియన్ల డాలర్లు ఖర్చు అవుతుందని సంబంధిత అధికారులు భావిస్తున్నారు.

## ఇరాక్ దురాక్రమణ సూత్రధారి అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు డిక్ షెనీ మృతి



**వాషింగ్టన్ :** అమెరికా దేశ మాజీ ఉపాధ్యక్షుడు డిక్ షెనీ (84) మంగళవారం నాడు మరణించారు. ఆయనకు న్యుమోనియా, హృద్రోగ వ్యాధులు తీవ్రమవడంతో మరణించినట్లు కుటుంబసభ్యులు తెలియజేశారు. డిక్ షెనీ జార్జ్‌బుష్ జూనియర్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 2003లో ఇరాక్‌పై అమెరికా దురాక్రమణ వెనుక ఆయనే ప్రధాన కారణమని చెబుతుంటారు. అమెరికా చరిత్రలోనే అత్యంత శక్తివంతమైన ఉపాధ్యక్షుడు ఆయన అని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తుంటారు. రిపబ్లిక్ పార్టీకి చెందిన ఆయన వ్యోమింగ్ నుంచి కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. అలాగే అమెరికా రక్షణ మంత్రిగా కూడా వ్యవహరించారు. 2000 సంవత్సరంలో బుష్ అధ్యక్ష పదవికి పోటీ పడినప్పుడు డిక్ షెనీని ఆయన రన్నింగ్ మేట్‌గా ఎంపిక చేసుకున్నారు. 2001 నుంచి 2009 వరకు షెనీ అమెరికా ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో అమెరికా అధ్యక్ష స్థానం అధికారాన్ని విస్తరించేందుకు, ఉపాధ్యక్ష పదవిని శక్తివంతం చేసేందుకు ఆయన పని చేశారు. అనేకమంది వద్దని హెచ్చరించినప్పటికీ షెనీ మాట విని 2003లో ఇరాక్‌పై దురాక్రమణకు బుష్ ఆమోదం తెలిపారు. ఆయన కుమార్తె లిజ్ షెనీ రిపబ్లిక్ పార్టీ తరుపున ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. ట్రంప్‌ను వ్యతిరేకించడంతో ఆమె పదవిని కోల్పోయారు. అమెరికా 248 సంవత్సరాల చరిత్రలో దేశ గణతంత్రానికి ట్రంప్ లాగా పెనుముప్పు కలిగించే వ్యక్తి మరొకరు లేరని డిక్ షనీ వ్యాఖ్యానించారు. ఆయనకు తొలిసారిగా 37వ ఏట గుండెపోటు వచ్చిన తరువాత అనేక మార్లు గుండె పోటు వచ్చింది. 2012లో హృదయమార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. 1941లో నెబ్రెస్కాలోని లింకన్‌లో జన్మించిన షెనీ తల్లి వెయిట్రస్‌గా, తండ్రి నేల సంరక్షణ సేవలో ఫెడరల్ వర్కర్‌గా పని చేశారు.

## జోరుగా న్యూయార్క్ మేయర్ ఎన్నిక

### ఫలితాల కోసం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి



**వాషింగ్టన్ :** ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేకెత్తిస్తున్న అమెరికా ఆర్థిక రాజధాని, పెట్టుబడుల స్వర్గదామమైన న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఓటర్లు ఉత్సహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. మొదటి దశలోనే 7.35 లక్షల మందికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో ఇదే సమయానికి పోలైన వాటికంటే ఇది నాలుగింతలు ఎక్కువ. డెమొక్రాటిక్ పార్టీ తరుపున న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యుడు, సోషలిస్టు 34 ఏళ్ళ జోహ్రాన్ మమ్దానీ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన నెగ్గితే న్యూయార్క్ నగరానికి తొలి ముస్లిం మేయర్ అవుతారు. డెమొక్రాటిక్ పార్టీ ప్రైమరీలో మమ్దానీ చేతిలో ఓడిపోయిన మాజీ గవర్నర్ ఆండ్రూ క్యోమో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. మమ్దానీ సోషలిస్టు ఎజెండా న్యూయార్క్ నగరాన్ని వెనిజువెలా లాగా మారుస్తుందని ఆయన ఓటర్లను హెచ్చరించారు. అధికార రిపబ్లికన్ పార్టీ తరుపున కర్టిస్ సిల్వా పోలిసింగ్, ప్రజా భద్రతపైనే తన ఎన్నికల ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళారు. అయితే, న్యూయార్క్‌లోనే జన్మించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మాత్రం మమ్దానీని బలంగా వ్యతిరేకించారు. ఆయనను కమ్యూనిస్టు పిచ్చివాడిగా పేర్కొన్నారు. అలాంటి సోషలిస్టు అభ్యర్థి ఎన్నికైతే ఫెడరల్ ఫండింగ్‌ను నిలిపివేస్తానని కూడా ట్రంప్ హెచ్చరించారు. ఒపీనియన్ పోల్స్ అన్నీ జోహ్రాన్ మమ్దానీ వైపే మొగ్గు చూపుతున్నాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన పోలింగ్, రాత్రి 9 గంటలకు వరకు కొనసాగుతుంది. న్యూయార్క్‌తో పాటు న్యూజెర్సీ, వర్జినియా, కాలిఫోర్నియా నగరాల మేయర్ పదవులకు కూడా మంగళవారమే ఓటింగ్ జరుగుతోంది. ఫలితాలు భారతకాలమానం ప్రకారం బుధవారం ఉదయం వెలువడమే అవకాశం ఉంది.

## ఔను... అవినీతికి పాల్పడ్డారు

### డిఎస్‌పి లంచం కేసులో ఏడుగురి వాంగ్మూలం
### ఎసిబి డైరెక్టర్‌కు చేరిన నివేదిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అవినీతిని అరికట్టే శాఖలోనే రూ. కోటి రూపాయల లంచాల పర్వం వెలుగుచూడటం సంచలనం రేపింది. ఓ కేసులో బినామీలంటూ కోటి రూపాయలు డిమాండ్ చేసి తొలివిడత రూ.20 లక్షలు వసూళ్లకు పాల్పడిన అంశంపై గత నెల 24న బాధితులు నేరుగా ఎసిబి డైరెక్టర్ చారుసిన్హాకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో నిజాయతీ పరులైన అధికారులతో విచారణ జరిపిస్తే వరంగల్ రేంజ్‌లో ఎసిబి అధికారుల అవినీతి, అక్రమాలు, లంచగొండి తనం అన్నీ వెలుగుచూస్తాయని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదుపై రహస్యంగా విచారణ చేపట్టాలని కోరుకుంటున్నామని, ఈ విషయం సదరు అవినీతి అధికారికి తెలిస్తే బాధితులపై మరింత వేధింపులకు గురిచేసే అవకాశం ఉందని ఎసిబి డైరెక్టర్‌కు విన్నవించారు. బాధితుల ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఏసీబీ డైరెక్టర్ జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని కోరారు. ఈక్రమంలో నాలుగు రోజుల పాటు ఆరుగురు బాధితుల వాంగ్మూలం సేకరించిన ఏసీబీ అధికారులు విచారణ పూర్తి చేసి పూర్తి స్థాయి నివేదికను ఎసిబి డిజి చారుసిన్హాకు అందజేసినట్లు తెలియవచ్చింది. కాగా రూ.కోటి లంచం మొత్తాలలో రూ.20 లక్షలు చేతులు మారినట్లు చోటుచేసుకున్న ఆరోపణలపై సదరు అధికారులు పక్కా ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. బాధితుల వాంగ్మూలంలో పేర్కొన్న అంశాలతో పాటు అవినీతి అధికారులు సాక్షాలను తారుమారు చేసిన వైనంపై దర్యాప్తు సాగించారు. ఇందులో భాగంగా ఈ వ్యవహారంలో నగదు తరలింపులో కీలక పాత్ర వహించిన మరో డిఎస్‌పి పాత్రపై పక్క ఆధారాలు సేకరించారు. అదేవిధంగా బాధితుల వద్ద ఆడియో రికార్డులను పరిశీలించడంతో పాటు వాటికి సంబంధించిన సీసీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. అయితే వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్‌పి లంచావతారం వ్యవహారంలో విచారణ ముగిసిందని, ఇక చర్యలే మిగిలాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.




**ఎసిబి కార్యాలయంలో విచారణ..**

వరంగల్ ఎసిబి డిఎస్‌పి లంచాల పర్వంపై హైదరాబాద్‌లోని ఎసిబి కేంద్ర కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారులు ఈ కేసులో బాధితులను పలుమార్లు ప్రశ్నించి వారి వాంగ్మూలం సేకరించారు. మాజీ ఎంఆర్‌ఓ ఆదాయానికి మించి ఆస్తుల కేసుకు సంబంధించిన మొత్తం ఎంత మందిని వరంగల్ ఎసిబి డిఎస్‌పి సాంబయ్య విచారించారు, అందులో ఎవరెవరికి నోటీసులు ఇచ్చారన్న సమాచారం సైతం సేకరించారు. దీంతో అప్రమత్తమైన విచారణాధికారులు హైదరాబాద్‌కు చెందిన డీఎస్‌పీ మరో ముగ్గురు కలిసి పిస్తా హౌస్‌లో భోజనం చేసిన సమయంలో సిసి ఫుటేజీ, కాల్‌డేటా సేకరించడంతో పాటు ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వెరసి సెప్టెంబరు 11 రాత్రి హైదరాబాద్‌కు చెందిన డీఎస్‌పీ, బాధితులు కలిసి రూ. 20 లక్షల లంచం ఎవరికి చేరిందన్న వ్యవహారంపై పూర్తి స్థాయి నివేదిక ఏసీబీకి డైరెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.

## వీసాలపై కెనడా కఠిన ఆంక్షలు


### 74 శాతం భారతీయుల దరఖాస్తుల తిరస్కృతి




**ఒట్టావా:** భారతీయులకు వీసాలకు సంబంధించిన ఆంక్షలను కెనడా మరింతగా కఠినతరం చేసింది. వీసా కోసం వచ్చే దరఖాస్తులో అధిక శాతాన్ని తిరస్కరిస్తోంది. ఈ ఏడాది ఆగస్టులో 74 శాతం అర్జీలను తిరస్కరించింది. అంటే ప్రతి నాలుగు దరఖాస్తులలో మూడు కచ్చితంగా తిరస్కరిస్తున్నది. 2023 ఆగస్టులో 32 శాతం దరఖాస్తులు తిరస్కరించగా, ఈ ఏడాది ఆగస్టులో 74 శాతం తిరస్కరించింది. చైనా విద్యార్థులు పెట్టుకున్న 24 శాతం వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యారు. ఇతర దేశల విద్యార్థుల అర్జీలు 40 శాతం మేర తిరస్కరించబడ్డాయి. దీంతో కెనడాపై విదేశీ విద్యార్థులకు ముఖ్యంగా భారతీయులకు ఆసక్తి తగ్గుతోందన్న సంకేతాలున్నాయి. 2023 ఆగస్టులో 20,900 మంది కెనడా వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది ఆగస్టు నాటికి ఆ సంఖ్య బాగా తగ్గిపోయింది. కేవలం 4,515 మంది దరఖాస్తు చేసుకున్నారు. మోసపూరిత విధానాలతో తమ దేశంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న క్రమంలో వీసా ఆంక్షలను కెనడా కఠినతరం చేసుకున్నది.

## హిందూజా గ్రూప్ చైర్మన్ కన్నుమూత

**న్యూఢిల్లీ:** ప్రముఖ వ్యాపార వేత్త, హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ పి హిందూజా (85) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన లండన్‌లో తుదిశ్వాస విడిచారు. వ్యాపార వర్గాల్లో జీపీగా పేరుగాంచిన గోపీచంద్ హిందూజా బ్రిటన్‌లోని అత్యంత ధనవంతులైన వ్యాపారవేత్తలలో ఒకరు. ఆయనకు భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్, కుమార్తె రీటా ఉన్నారు. 1950లో కుటుంబ వ్యాపారంలోకి ప్రవేశించి కంపెనీని ఇండోమిడిల్ ఈస్ట్ ట్రేడింగ్ ఆపరేషన్ నుండి ఒక అంతర్జాతీయ కంపెనీగా మార్చడంలో ఘనత పొందారు. ప్రభావవంతమైన వ్యాపార కుటుంబంలోని రెండవ తరానికి ప్రాతినిధ్యం వహించిన గోపీచంద్ పి హిందూజా... తన అన్నయ్య శ్రీచంద్ పి హిందూజా మరణం తర్వాత... మే 2023లో బహుళజాతి సంస్థ హిందూజా గ్రూప్ బాధ్యతలు స్వీకరించారు. భారత దేశ స్వాతంత్ర్యానికి ముందు సంప్రదాయ వ్యాపార కుటుంబంలో జన్మించిన గోపీచంద్ హిందూజా 1959లో తన వత్తిపరమైన ప్రయాణాన్ని ప్రారంభించి, ముంబైలోని కుటుంబ సంస్థలో చేరారు. దశాబ్దాలుగా, ఒకప్పుడు ఇండోమిడిల్ ఈస్ట్ వాణిజ్య వ్యాపారాన్ని 30 కంటే ఎక్కువ దేశాలలో ఉనికితో ప్రపంచ పారిశ్రామిక సమ్మేళనంగా మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో, గ్రూప్ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎనర్జీ, ఆటోమోటివ్, మీడియా, మౌలిక సదుపాయాలు సహా అనేక రంగాలలోకి విస్తరించింది. హిందూజా గ్రూప్‌ను 1919లో పరమానంద్ దీప్‌చంద్ హిందూజా స్థాపించారు,



అతను సింధ్ (అప్పుడు అవిభక్త భారతదేశంలో, ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉంది) నుండి ఇరాన్‌కు వెళ్లారు. ఆ తరువాత 1979లో తన స్థావరాన్ని ఇరాన్ నుండి లండన్‌కు మార్చింది. అప్పటినుంచి కంపెనీ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం ముంబై ప్రధాన కార్యాలయం కలిగిన గ్రూప్ ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ వ్యాపార సామ్రాజ్యంతో పాటు హిందూజా గ్రూపు రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియోకు కూడా ప్రసిద్ధి చెందింది. దాని అత్యంత విలువైన ఆస్తులలో వైట్‌హాల్‌లోని ఓల్డ్ వార్ ఆఫీస్ భవనం. ఇది లండన్‌లోని చారిత్రాత్మక ల్యాండ్‌మార్క్.ఈ భవనాన్ని సెప్టెంబర్ 2023లో ప్రారంభించిన రాఫెల్స్ లండన్ హోటల్‌గా తిరిగి అభివద్ధి చేశారు.

## వణికిన వరంగల్
**(మొదటి పేజీ తరువాయి)**

కలచి వేస్తున్నాయి.

**కరీంనగర్ – వరంగల్ జాతీయ రహదారిపై వర్షపు నీరు**

కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌లో మంగళవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా పలు కాలనీలు జలమయమయ్యాయి. మామిండ్లవాడ, గ్యాస్ గోదాం ఏరియా, బుడిగ జంగాల కాలనీ, గాంధీనగర్, ఇందిరానగర్ కాలనీలలోకి భారీగా వర్షపు నీరు చేరింది. డిపో అడ్డదారి వద్ద కరీంనగర్ వరంగల్ జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్ద చెరు వు అలుగుపోయడంతో వరద నీరు ఇళ్లలోకి చేరింది. వినాయకనగర్‌లో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా రు. చౌటుప్పల్‌లోని ఎంపిడిఒ కార్యాలయం, పాలకేం ద్రం, టిటిడి కల్యాణ మండపాలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ఎంపిడిఒ కార్యాలయంలో సామగ్రి తడిచింది.

## హైదరాబాద్‌లో జిసిసి
**(మొదటి పేజీ తరువాయి)**

సహకారం అందిస్తుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుస్) ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి, ప్రస్తుతం కొనసాగుతున్న డేటా సెంటర్ ప్రాజెక్టులు, తెలంగాణలో ఎడబ్ల్యుఎస్ విస్తరణ ప్రణాళికలపై చర్చలు జరిపింది. ఈ ప్రతినిధి బృందంలో ఎడబ్ల్యుఎస్ గ్లోబల్ ఆపరేషన్స్ అండ్ డేటా సెంటర్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, ఎడబ్ల్యుఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, ఎడబ్ల్యుఎస్ డైరెక్టర్ అనురాగ్ ఖిల్నాని తదితర సీనియర్ అధికారులు ఉన్నారు.

## ప్యాసింజర్, గూడ్స్ రైలు ఢీ
**(మొదటి పేజీ తరువాయి)**

వారు తెలిపారు. ప్రమాదంలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారించారు. మరో ఇద్దరు ఇంకా శిథిలాల లోపల చిక్కుకున్నారని, వారిని బయటకు తీసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని బిలాస్‌పూర్ కలెక్టర్ సంజయ్ అగర్వాల్ పిటిఐకి తెలిపారు. గూడ్స్ రైలు కూడా ప్యాసింజర్ రైలు వెళ్ళే దిశలోనే కదులుతోందని ఆయన అన్నారు. గాయపడిన ప్రయాణికులను బిలాస్పూర్‌లోని అపోలో హాస్పిటల్, ఛత్తీస్‌గఢ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిఐఎంఎస్) ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని ఆయన తెలిపారు. రైల్వే అధికారులు ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వ్యక్తుల చికిత్స కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని అధికారులు తెలిపారు. కాగా, మృతుల బంధువులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షలు పరిహారం ప్రకటించగా, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష సహాయం అందుతుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై రైల్వే భద్రతా కమిషనర్ (సిఆర్ఎస్) స్థాయిలో వివరణాత్మక విచారణ నిర్వహించి, కారణాన్ని నిర్ధారించి, అవసరమైన దిద్దుబాటు చర్యలను సిఫార్సు చేస్తామన్నారు. రైల్వే యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయ, రక్షణ చర్యలను ప్రారంభించింది. పరిస్థితిని పర్యవేక్షించడానికి సీనియర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. బాధిత ప్రయాణికులకు రైల్వే అధికారులు సాధ్యమైనంత అందించారు. ప్రయాణికులు, వారి కుటుంబాల సౌలభ్యం కోసం హెల్ప్‌లైన్ నంబర్లను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు పూర్తి సంఘీభావంగా ఉందని చెప్పారు.

## జలదిగ్బంధంలో రామచంద్రగూడ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మంగళవారం కురిసిన భారీ వర్షంతో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రామచంద్ర గూడలోని కోటిరెడ్డి చెరువు అలుగు పారుతోంది. దీంతో గ్రామంలోకి భారీగా వరదనీరు చేరింది. ఇళ్లలోకి వరదనీరు రావడంతో రామచంద్రగూడ గ్రామస్థులు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. పలు ఇళ్లలోని నిత్యావసర వస్తువులు పూర్తిగా నీట మునిగాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రామచంద్రగూడలోని మోడల్ స్కూల్ ప్రహరీ గోడ కూలి వరద నీరు భారీగా చేరుకోవడంతో విద్యార్థులు స్కూల్ పైకి ఎక్కారు. విషయం తెలుసుకున్న స్థానిక మహేశ్వరం సిఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకుని విద్యార్థులను మహేశ్వరంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిల్డింగులకు ఆశ్రయం కల్పించడం తోపాటు. విద్యార్థులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయించారు.



అదేవిధంగా మహేశ్వరం పట్టణంలోని కాలనీలు, జలదిగ్బంధంలో కూరుకుపోయాయి. రాకపోకలు స్తంభించి తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. మహేశ్వరం పట్టణంతోపాటు మండలంలోని పలు చెరువులు నిండిపోయాయి. దీంతో తమ చెరువులకు ఏ క్షణానైనా గండి పడచ్చని భయంతో ఆయా గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

## డాక్టర్ ఇంట్లో భారీగా డ్రగ్స్
**(మొదటి పేజీ తరువాయి)**

పిజి మెడిసిన్ చదువుతున్న ఓ డాక్టర్ పట్టుబడ్డాడు. జాన్‌పాల్ అనే వ్యక్తి ఎంబిబిఎస్ పూర్తి చేసుకుని హైదరాబాద్‌లో మెడిసిన్‌లో పిజి చదువుతూ.. ముషీరాబాద్‌లో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఏడాది నుంచి జాన్‌పాల్ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. డ్రగ్స్ ఖరీదు చేసేందుకు తన వద్ద డబ్బులు లేకపోవడంతో డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయానికి వచ్చాడు. ఈ క్రమంలోనే హైదరాబాద్ కు చెందిన తన స్నేహితులు ప్రమోద్, సందీప్, శరత్‌లను ఆశ్రయిస్తాడు. ఈ ముగ్గురు బెంగుళూరు ఢిల్లీ నుంచి డ్రగ్స్‌ను తెప్పిస్తారు. ఈ క్రమంలోనే డాక్టర్ కూడా డ్రగ్స్ తెప్పించుకుని తన ఇంట్లో నిల్వ పెట్టుకునేవాడు. తన ముగ్గురు స్నేహితులు చెప్పిన వారికి జాన్‌పాల్ డ్రగ్స్ అమ్మేవాడు. ఈ డ్రగ్స్ అమ్మకాలు జరిపినందుకు తన వద్ద ఉన్న డ్రగ్స్‌ను తాను ఉచితంగా వాడుకుంటూ కాలం గడుపుతున్నాడు. ఈ మేరకు ఎస్‌టిఎఫ్ టీం లీడర్ ప్రదీప్ రావుకు సమాచారం అందింది. దీంతో మంగళవారం ముషీరాబాద్‌లోని డాక్టర్ జాన్‌పాల్ ఇంటిపై ఎస్‌టిఎఫ్ ఎస్ఐ బాలరాజు, కానిస్టేబుల్ విజయ్ కృష్ణలు సోదాలు నిర్వహించారు. డాక్టర్ జాన్ పాల్ ఇంట్లో 26.95 గ్రాముల ఓజి కుష్, 6.21 గ్రాముల ఎండిఎంఎ, 15 ఎల్ఎస్‌డి బాస్ట్స్, 1.32 గ్రాముల కొకైన్, 5.80 గ్రాముల గుమ్మస్, 0.008 గ్రాముల హాసిస్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న ఈ డ్రగ్స్ విలువ రూ.మూడు లక్షలు విలువ ఉంటుందని ఎస్ఐ బాలరాజు తెలిపాడు. ఒక డాక్టర్ వద్ద ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుకోవడం పట్ల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అభినందించారు.

**రూ. కోటి విలువ చేసే డ్రగ్స్ కాల్చివేత..**

హైదరాబాద్ ఎక్సైజ్ డివిజన్‌లోని అమీర్‌పేట్, ధూళిపేట్, కాచిగూడ, ముషిరాబాద్, నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 104 కేసుల్లో పట్టుకున్న గంజాయి, డ్రగ్స్‌ను మంగళవారం కాల్చివేశారు. షాద్‌నగర్‌లో ఉన్న జిజె మల్టీకావ్ ప్రైవేట్ లిమిటేడ్ కంపెనీలో కాల్చివేశారు. డ్రగ్స్‌ను, గంజాయిని కాల్చి వేయాలని హైదరాబాద్ డిప్యూటి కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి ఇచ్చిన అదేశాల మేరకు ఎఇఎస్ శ్రీనివాసరావు కాల్చివేయించారు.295 కెజిల గంజాయి, 7.65 గ్రాములు ఎండిఎంఏ, 1.25 కేజీల స్ట్రా పప్పీ, కొద్దిపాటిగా కోకైన్, హశీష్ అయిల్ పెంనల్ ఇంజక్షన్లు , 35 ఎంఎల్ హైక్లోరిడ్‌ను కాల్చివేసిన వాటిలో ఉన్నాయి. కాల్చేస్తున్న డ్రగ్స్ విలువ సుమారు కోటి మీద ఉంటుందని అంచనా వేశారు.

## నాణ్యతపై రాజీపడం
**(మొదటి పేజీ తరువాయి)**

ఆయకట్టుకు అనుకొని ఉన్న భూములు సేద్యంలోకి వస్తాయని భావిస్తే ఎత్తిపోతల పథకాల సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని అధికారులకు సూచించారు. మైనర్ మార్పులతో అదనపు ఆయకట్టు సేద్యంలోకి వచ్చేందుకు అయ్యే అదనపు నిధులను సమకూరుస్తానని వెల్లడించారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణాల నిమిత్తం ప్రభుత్వం భూసేకరణ నిర్వహించి రైతులకు నగదు చెల్లింపులు జరిపిన భూములను సత్వరమే అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. పంటకు పంటకు మధ్యలో ఉండే సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణాలపై ఆయకట్టు రైతాంగం పెంచుకున్న ఆశలు అమలులోకి రావాలంటే నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజసనందలాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, ఇఎస్‌సిలు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబు, హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖాధికారులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కమిటీ
**(మొదటి పేజీ తరువాయి)**

15 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అలాగే ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ పరిశీలించనుంది. మూడు నెలల్లో ఈ కమిటీ తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఉన్నత విద్యను మరింత మెరుగుపర్చేందుకు కూడా కమిటీ సూచనలు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యా సంస్థల సూచనలను కూడా కమిటీ అధ్యయనం చేయనుంది.

**కమిటీ :** ఛైర్మన్ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వైస్‌ఛైర్మన్ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, సభ్యులుగా విద్య, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖలకు చెందిన కార్యదర్శులు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తో పాటు ఎఫ్‌ఎటిఎస్ఐ నుంచి ముగ్గురు సభ్యులు. ఎస్‌సి సంక్షేమ శాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కాగా మరో సభ్యున్ని ఛైర్మన్ నియమించుకునేందుకు అవకాశం కల్పించారు.

## మోస్తరు వర్షాలు
**(మొదటి పేజీ తరువాయి)**

అవకాశాలున్నాయన్నారు. మంగళవారం నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. బుధ, గురువారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

## మైనారిటీ సంక్షేమం
**(మొదటి పేజీ తరువాయి)**

కేటాయించని ఇతర విభాగాలు ఉన్నాయి. వాటిలో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను అజారుద్దీన్ కు కేటాయించారు. ఇక గత జూన్‌లో మంత్రివర్గంలో చేరిన అడ్లూరి లక్ష్మణ్ కు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖలను ప్రభుత్వం అప్పగించింది. తాజాగా ఆయన వద్దనున్న మైనార్టీ శాఖను అజారుద్దీన్‌కు అప్పగించింది. కాగా గత శుక్రవారం అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలను ప్రభుత్వం కేటాయించింది.

## హెచ్‌ఆర్‌సి ఆగ్రహం
**(మొదటి పేజీ తరువాయి)**

అలాగే టీజీఎస్ ఆర్టీసీ అధికారుల నుండి ప్రమాదంపై సమగ్ర నివేదికలను డిసెంబర్ 15, 2025 ఉదయం 11 గంటల లోపు సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. ఈ ఘటనపై మరింత విచారణ జరిపి బాధ్యత వహించాల్సిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఒక ప్రకటన విడుదల చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## భూసార పరీక్షల ద్వారా ఎరువుల మోతాదు



ప్రజాపక్షం/హైదరాబాద్: రైతులు భూసార పరీక్షలు చేయించడం ద్వారా భూములలో ఉన్న పోషకాలు తెలుస్తాయని, తద్వారా పంటల సాగుకు అనుకూలంగా ఎరువుల మోతాదును గుర్తించే అవకాశాలు ఉంటాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. సాటిలైట్ టెక్నాలజీతో మట్టి పరీక్షలు చేసే కంపెనీలతో ప్రభుత్వం జరుపుతున్న చర్చలు ఇంకా ప్రయోగ దశలోనే ఉన్నాయని, ఈ టెక్నాలజీ అందుబాటులోకి రాగానే, రాష్ట్రమంతా ఒకేసారి మట్టి పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. వరి, పత్తి పంటలకు బదులుగా ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టాలని, ఎక్కువ ఆదాయం పొందవచ్చని, ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

## 'మక్కల కొనుగోలు'లో సహకారం లేదు

### కేంద్రమంత్రులు కిషన్, బండి చొరవ తీసుకోవాలి: తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం అందకపోయినప్పటికీ రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వమే మార్కెట్ ధరకు మక్కలను కొనుగోలు చేసేందుకు సిద్ధమైందని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. రూ. 2500 కోట్లతో మక్కలను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి తుమ్మల లేఖ రాశారు. జిన్నింగ్ మిల్లర్ల అంశంపైన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. కాగా జిన్నింగ్ మిల్లర్ల సమస్యల విషయమై సిసిఐ సిఎండి లలిత్ కుమార్ గుప్తాతో మంత్రి తుమ్మల మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. ఎకరాకు 7 క్వింట వరకు మాత్రమే కొనుగోలు చేయాలనే కేంద్రం విధించిన పరిమితి అభ్యంతరకరమని,ఈ నిబంధనను ఎత్తివేయడం అత్యవసరమని, ఈ నిబంధనను సవరించేలా చూడాలని సిసిఐ సిఎండిని కోరారు. సిసిఐ అవలంబిస్తున్న ఎల్1, ఎల్2, ఎల్3 అలాట్‌మెంట్ విధానంతో కొన్ని జిన్నింగ్ మిల్లులలో మాత్రమే కొనుగోల్లు జరుగుతున్నాయని, అనేక జిన్నింగ్ మిల్లులు మూతపడే పరిస్థితులు నెలకొనే పరిస్థితులు ఉన్నాయని మంత్రి తుమ్మల వివరించారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లలో




ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందుల కారణంగా రైతులు, మిల్లుదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఈనెల 6వ తేదీ నుంచి కొనుగోళ్లు నిరవధికంగా నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ నిర్ణయం తీసుకున్న విషయాన్ని మంత్రి తుమ్మల వివరించారు.

## ఫిన్ టెక్ 'గ్లోబల్ కమాండ్ సెంటర్'గా హైదరాబాద్

### 'డాయిష్ బోర్స్ గ్రూప్' జిసిసి ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ ను గ్లోబల్ ఫైనాన్షియల్ టెక్నాలజీ(ఫిన్ టెక్)కి అత్యంత కీలకమైన గ్లోబల్ కమాండ్ సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాయదుర్గంలో అంతర్జాతీయ దిగ్గజ ఫైనాన్షియల్ మార్కెట్ సంస్థ 'డాయిష్ బోర్స్ గ్రూప్' గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్(జిసిసి)ను ఆయన మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు.



ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడు తూ.... ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పిల్లర్‌గా ఉన్న డాయిష్ బోర్స్ గ్రూప్ హైదరాబాద్‌ను ఎంచుకోవడం రాష్ట్ర ప్రభుత్వ పటిష్ఠమైన పాలసీలు, స్థిరత్వం, ఇక్కడి టాలెంట్ పూల్‌పై గ్లోబల్ కంపెనీలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రపంచంలోని టాప్ టెన్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలలో ఏడు ఇక్కడ నిర్వహిస్తుండటం మనకు గర్వకారణమన్నారు. డాయిష్ బోర్స్ రాకతో హైదరాబాద్ గ్లోబల్ క్యాపిటల్, సంపదకు శక్తినిచ్చే కేంద్రంగా అంతర్జాతీయ యవనికపై మరోసారి నిరూపించుకుందన్నారు. నగరాన్ని కేవలం ఇంక్యుబేషన్ హబ్‌గా మాత్రమే కాకుండా 'గ్లోబల్ ఆవిష్కరణ పవర్‌హౌస్'గా మార్చేలా ఒక ప్రత్యేక గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించబోతున్నట్లుగా వెల్లడించారు. ఈ హబ్ రీసెర్చ్, బ్రేక్‌త్రూ ఐడియాల కు ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం పెట్టుబడులను ఆకర్షించడంపైనే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చే వాల్యూను సృష్టించేందుకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ జీసీసీ షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి ప్రధాన ఎక్స్ఛేంజీలతో సహా 24 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆస్తులను నిర్వహించే గ్లోబల్ మార్కెట్లకు అత్యున్నత సేవలు అందిస్తుందన్నారు. తొలిదశలో ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ ఇంజనీరింగ్ వంటి డీప్ టెక్నాలజీ రంగాల్లో 1,000మందికి హై స్కిల్డ్ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య రెండింతలు అవుతుందన్నారు. కార్యక్రమంలో జర్మనీ అంటూ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, డ్యుయిష్ బోర్స్ సిఇఒ,సిఒఒ డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, డైరెక్టర్ డాక్టర్ లుడ్విగ్ హీన్సెల్‌మన్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీనే గెలిపిద్దాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించి, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిపించాలని సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.ఎస్.బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బిసిలకు సామాజిక న్యాయ సాధికారత కోసం తీసుకువచ్చిన విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 రిజర్వేషన్లు అమలు కాకుండా కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ అడ్డుకుంటుందని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పదేళ్లు పరిపాలించిన బిఆర్ఎస్ ఏ ఒక్కనాడు కూడా సామాజిక న్యాయం సాధికారత వైపు ఆలోచించకపోవడమే కాకుండా బిసిలను రాజకీయంగా అణచివేసి, కపట ప్రేమను చూపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని జిమ్మిక్కులు చేసిన బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బిసిలకు దేశవ్యాప్తంగా ఐఐటి, ఐఐఎం లాంటి కేంద్ర విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని బోస్ గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లు బిఆర్ఎస్, బిజెపి పార్టీల బంధాన్ని గుర్తించాలని కోరారు. ఆ పార్టీలు చేసే ప్రజా వ్యతిరేక కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిపించాలని ఓటర్లకు బోస్ విజ్ఞప్తి చేశారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని సంజయ్ నగర్, మోతి నగర్, న్యూ సుల్తాన్ నగర్, కళ్యాణ్ నగర్ ప్రాంతాలలో సిపిఐ కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కె. ఏసురత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్, నేర్లకంటి శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, పాలబిందెల శ్రీనివాస్, కృష్ణ, దస్తగిరి, చెట్టుకింద శ్రీను, మహమూద్, కొమురెల్లి బాబు, సైఫ్, చైతన్య, గౌస్, లెనిన్, మనోచారి, తలహా, నూర్, అనిల్, సుశాంత్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సిఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మక అడుగులు

### కార్మిక, సంక్షేమ సంఘాల నేతలను స్వయంగా కలుస్తున్న సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎన్నికలపై ముఖ్యమంత్రి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నా రు. నియోజకవర్గంలోని వివిధ వర్గాలు, కార్మిక సంఘా లు, సీనియర్ నేతలను కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా సమీకరిస్తున్నారు. వారితో నేరుగా చర్చించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు కూడగడుతున్నారు. అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బి.ఎన్. రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర తమిళ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ధర్మలు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో తమిళ సంక్షేమ సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలుసుకుని, నవీన్ యాదవ్ విజయం కోసం తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సంఘం నాయకులు మాట్లాడుతూ, తమిళ సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు. ఫిలిం ఫెడరేషన్, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.



**కాంగ్రెస్‌లో చేరిన నారాయణ స్వామి**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణా మం చోటుచేసుకుంది. ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేసిన బిఆర్ఎస్ సీనియర్ రాజకీయ నేత, నారాయణస్వామి, ఆయన కుమారుడు రామచందర్‌లు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్సీ అరకల నర్సా రెడ్డి, బి.ఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నారాయణస్వామి, రామచందర్‌లు కాంగ్రెస్‌లో చేరికతో పార్టీ బలోపేతం అవుతుందని నాయకులు తెలిపారు. రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఇది కాంగ్రెస్‌కు శుభపరిణామమని ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన కాంగ్రెస్ సీనియర్ నేత బి.ఎన్.రెడ్డి తెలిపారు.

**కాంగ్రెస్‌కు తెలంగాణ 24 ఫ్రేమ్స్ ఫిలిం ఫెడరేషన్ యూనియన్ మద్దతు**

తెలంగాణ 24 ఫ్రేమ్స్ ఫిలిం ఫెడరేషన్ యూనియన్ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మూర్తిలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశా రు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ప్రకటించారు. అనంతరం సినీ రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్సీ అరకాల నర్సరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత బి.ఎన్. రెడ్డి పాల్గొన్నారు. ఫిలిం ఫెడరేషన్ కార్యకలాపాలు, సినీ పరిశ్రమ అభివృద్ధి, కళాకారుల సంక్షేమం వంటి అంశాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తామని సిఎం వారికి హామీనిచ్చినట్లు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన బి.ఎన్.రెడ్డి తెలిపారు. తెలంగాణ 24 ఫ్రేమ్స్ ఫిలిం ఫెడరేషన్ యూనియన్ మద్దతు ఇవ్వడం తమ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి దోహదపడుతుందని బి.ఎన్.రెడ్డి చెప్పారు.





## చట్టంపై పట్టు సాధించండి

### ఎఇఎస్, ఎస్ఐల శిక్షణాకార్యక్రమంలో మంత్రి జూపల్లి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉన్నత చదువులు చదివి, కష్టపడి గ్రూప్1, గ్రూప్2 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మీరు, ఇప్పుడు ఎక్సైజ్ శిక్షణలోనూ రాటుదేలాలి.. ఎక్సైజ్ చట్టంపై పట్టు సాధించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఎక్సైజ్ అకాడమీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గ్రూప్1 ద్వారా ఎంపికైన ఎఇఎస్‌లు, గ్రూప్2 ద్వారా ఎంపికైన 84 మంది ఎస్ఐలకు శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ప్యూరియస్ లిక్కర్ వంటి వాటిని అరికట్టడంలో ఎక్సైజ్ సిబ్బంది కీలక పాత్ర పోషించాలి. గత బ్యాచ్‌లకు లభించని ప్రత్యేక అవకాశంగా, ఈసారి మీకు వెపన్ ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు శిక్షణలో ప్రతిభ కనబరచిన వారిని గుర్తించి యాక్సలరీ ప్రమోషన్లు అందజేస్తామని వెల్లడించారు. తల్లి దండ్రుల కలలను వమ్ము చేయకుండా నిజాయితీగా పనిచేయండి అని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు మాట్లాడుతూ, ఎక్సైజ్ శాఖను కేవలం ఆదాయాన్ని సమకూర్చే విభాగంగా కాకుండా, చట్టం అమలులో నైపుణ్యం(స్కిల్)పై దృష్టి పెట్టాలి అన్నారు. ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా నడుచుకుంటూ డ్రగ్స్, ప్యూరియస్ లిక్కర్‌ను అరికట్టడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలి. శిక్షణకు అవసరమైన అన్ని సౌకర్యాలు, స్పోర్ట్స్ సదుపాయాలు కల్పిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎఇఎస్‌లు కృష్ణప్రియ, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాఖలో ముగ్గురు డిప్యూటీ డైరక్టర్లకు పదోన్నతి

ప్రజాపక్షం/హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖలో ముగ్గురు డిప్యూటీ డైరక్టర్లకు జాయింట్ డైరక్టర్లుగా రాష్ట్రప్రభుత్వం పదోన్నతి కల్పించినట్లు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ డైరక్టర్లుగా పనిచేస్తున్న ఎన్.కృష్ణవేణిని హైదరాబాద్‌లోని డిఎంఇ (అడ్మినిస్ట్రేషన్) జాయింట్ డైరక్టర్‌గా, శ్వేత మొంగను ఎంహెచ్ఎస్ఆర్‌బి (అడ్మినిస్ట్రేషన్) జాయింట్ డైరక్టర్‌గా, బి.మంజునాథ్ నాయక్‌ను ఎన్‌హెచ్ఎం సిఇఒగా నియమించింది.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
Short NIT No. 40/SE(M)/Sec-bad Zone/GHMC/2025-26 తేది: 04.11.2025
క్ర.సం. 1, NIT No. 40/SE(M)/Sec-bad Zone/GHMC/2025-26 తేది: 04.11.2025, పనుల సంఖ్య: 01 పని, అంచనా విలువ: రూ.54.50లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం: 06.11.2025న మ.1.00గం.ల నుండి, బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం: 12.11.2025న మ.1.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: ఎస్ఇ, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9963550657. మరిన్ని వివరాలకు https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10209-PP/CL/ADVT/1/2025-26, Date: 04-11-2025

**తెలంగాణ ప్రభుత్వం**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం,
మిషన్ భగీరథ ఇన్‌ట్రా, డివిజన్ :: ఖమ్మం
(ఎస్.సి. బాయ్స్ హాస్టల్ ప్రక్కన, రామాలయం వీధి, ఎన్.ఎస్.పి. క్యాంప్, ఖమ్మం)
Short Tender Notice No.01/2025-26, తేది: 03.11.2025
వివిధ పనుల కోసం అర్హత కలిగిన సివిల్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో బిడ్లు ఆహ్వానించడమైనది. "1) ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలం దరీదులోని పడమటితండాలో PWS పథకం విస్తరణ, అంచనా వ్యయం రూ.9.50 లక్షలు". 2) రఘునాథ పాలెం (ఎం) చెరువు కొమ్ముతండాలో పంపింగ్ మెయిన్ నీటి సరఫరాను అందించడం. షెడ్యూళ్ళు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో 10.11.2025 నుండి 17.11.2025 వరకు మధ్యాహ్నం 3:00 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. బిడ్లు 18.11.2025న సాయంత్రం 4.00 గంటలకు తెరవబడును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎంపి ఇన్‌ట్రా, డివిజన్, ఖమ్మం.
DIPR R.O. No. : 10194-PP/CL/ADVT/1/2025-26, Date: 04-11-2025

## ఫీజు బకాయిలపై ఉన్నత విద్యామండలి ముట్టడి

ప్రజాపక్షం/హైదరాబాద్:పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలపై బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని విద్యా మండలి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులకు నిర్వాహకులకు తీవ్ర వాగ్వివాదం కావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ట్రాఫిక్ స్థంభించింది.ఈ సందర్భంగా బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణలు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫీజుల బకాయిలు విడుదలలో నిర్లక్ష్యం వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు.

ప్రభుత్వం రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతుందని వారన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు గాలిలో దీపంగా మారిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి మారకుంటే లక్షల మంది విద్యార్థులతో విద్యార్థి మార్చ్ త్వరలో నిర్వహిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి దగ్గర ఉన్న శాఖకే నిధులు కేటాయించకపోతే వేరే శాఖ పరిస్థితి ఏంటి? అని వారు ప్రశ్నించారు. 14 లక్షల 75 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు గాలిలో దీపంగా మారిందన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు 9 వేల కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు, ఫీజులు కట్టలేక ఉన్నత విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంద గోపాల్, రక్షక దళం ఉదయ్, శివమ్మ, విద్యార్థి నాయకుడు రాం బాబు, సాయి వెంకట్, రాహుల్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.





సిపిఐ సీనియర్ నాయకులు ఎఆర్ దేవరాజు కుమారుడు ఎఆర్ రామరాజు చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, చెన్నకేశవరావు, వందన, వారి కుటుంబ సభ్యులు

## 'దాశరథి జీవిత చరిత్ర' పుస్తకావిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణను నిజాం నుంచి విముక్తి చేయడానికి తన ప్రాణాన్ని లెక్క చేయక ఉద్యమంలో పాల్గొంటూ తన రచనలతో, ప్రసంగాలతో జనచైతన్యం కోసం కృషి చేసిన ప్రజాకవి దాశరథి జీవితాన్ని, రచనలను ఇప్పటికీ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఎనుగు నరసింహా రెడ్డి అన్నారు. రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 'పిల్లల కోసం దాశరథి జీవిత చరిత్ర'ను రాపోలు సుదర్శన్ రాసిన పుస్తకాన్ని డాక్టర్ ఎనుగు నరసింహా రెడ్డి ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ నామోజి బాలాచారి తెలంగాణ సాహిత్య అకాడమీలో దాశరథిపై జరుగుతున్న కృషిని వివరించారు.శ్రీకృష్ణదేవరాయ, తెలుగు భాషానిలయం కార్యదర్శి టి.ఉదయవర్లు, మాట్లాడుతూ దాశరథి చముకులు వినిపించారు. బాల సాహితీవేత్త డాక్టర్ అమరవాది నీరజ పుస్తకం వైశిష్ట్యాన్ని తెలియజేశారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-14, జిహెచ్ఎంసి**
NIT No. 51/E.E.14/GHMC/2025-26 తేది: 03.11.2025
పని పేరు: జిహెచ్ఎంసి, కెజెడ్, డివిజన్-14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు, అంచనా విలువ: రూ.69.65లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 04.11.2025న ఉ.11.00గం.లకు మరియు బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 07.11.2025న ఉ.11.00గం.ల వరకు (క్ర.సం.1 నుండి), బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 04.11.2025న ఉ.11.00గం.లకు మరియు బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 11.11.2025న ఉ.11.00గం.ల వరకు (క్ర.సం.02 నుండి 14 వరకు). అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10171-PP/CL/ADVT/1/2025-26, Date: 04-11-2025

**తెలంగాణ ప్రభుత్వం**
పురపాలక సంఘం : భైంసా, జిల్లా: నిర్మల్.
నోటిఫికేషన్ నెం. MCB/E1/Quotation/01/2025-26 తేది: 04.11.2025
కొటేషన్ నోటీసు
భైంసా మున్సిపాలిటీలో స్వచ్ఛ్ భారత్ మిషన్‌లో భాగముగా కంపోస్ట్ సౌకర్యాలు మరియు DRCC ల సమర్థవంతమైన నిర్వహణ పనులు చేపట్టుట కొరకు మున్సిపాలిటీలో రోజుకు 20-30 టన్నుల వ్యర్థాల నిర్వహణ కొరకు ఈ క్రింది యంత్రాల యొక్క ప్రైస్ కొటేషన్లు తేది: 07.11.2025 సా.5.00 గంటలు లేదా ఆలోపు కమిషనర్, భైంసా మున్సిపాలిటీ వారిచే కోరబడుచిన్నవి.

| క్ర.సం. | యంత్రం యొక్క పేరు | కెపాసిటీ |
| --- | --- | --- |
| 1 | Trommel (16-40mm, 4-6mm) | 20-30 Tonnes Per Day Capacity |
| 2 | sorting conveyor belt (Required length as per site condition) | |
| 3 | Baling machine (2No's) | |
| 4 | Garden Shredder | |
| 5 | Shredder | |
| 6 | Windrow turner | |
| 7 | Air Blower(3 No's). | |

సంప్రదించవలసిన వివరాలు:
మున్సిపల్ కమిషనర్ (9515121070), మున్సిపల్ ఇంజనీర్ (6305001071)
దీని ప్రతి నోటీసు బోర్డు పై తగు సమాచారం నిమిత్తం.
సం/- కమిషనర్ పురపాలక సంఘం, నిర్మల్
DIPR R.O. No. : 10249-PP/CL/ADVT/1/2025-26, Date: 04-11-2025

## ఎఐటిఇలో పాల్గొనే వలంటీర్లకు ఆహ్వానం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అఖిల భారత పులుల లెక్కింపు (ఎఐటిఇ)2026 కార్యక్రమంలో ఆసక్తి కలిగిన వాలంటీర్లు పాల్గొనాలని వన్య ప్రాణుల సంరక్షణ అధికారి ఈలు సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద వన్యప్రాణి మానిటరింగ్ ప్రోగ్రామ్‌గా పేరు గాంచిన ఈ లెక్కింపును వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), డెహ్రాడూన్ మరియు నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ (ఎన్‌టిసిఎ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 2022లో జరిగిన పులుల లెక్కింపులో దేశవ్యాప్తంగా పులుల సంఖ్య 3,967 గా నమోదైంది. ఇది 2018లో 2,967, 2014లో 2,226, 2006లో 1,411 నుండి నిరంతరంగా పెరుగుతున్న సానుకూల ధోరణిని సూచిస్తోంది. ఈ లెక్కింపులో తెలంగాణ రాష్ట్రంలో కూడా పులుల సంఖ్య పెరుగుతూ వస్తోంది..అమ్రాబాద్, కావల్ టైగర్ రిజర్వుల్లో పులుల సంఖ్యతో పాటు ఇతర వన్యప్రాణుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఎఐటిఇ 2026లో దేశంలోని 8.27 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 65,000కు పైగా అటవీ బీట్లను కవర్ చేయనుంది. తెలంగాణ రాష్ట్రం సుమారు 26,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల 3,000కు పైగా బీట్ల నుండి డేటా సేకరించనుంది. ఇది డెక్కన్ ప్రాంతంలో అత్యధికంగా పాల్గొనే రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఆధునిక వన్యప్రాణి సంరక్షణ పారదర్శకమైన, శాస్త్రీయమైన డేటాపై ఆధారపడుతుంది. 2022 లెక్కింపులో పౌర శాస్త్రవేత్తలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామీణ సమూహాలు పాల్గొనడం వల్ల సర్వే నాణ్యత పెరిగింది. 2026లో వీరి పాత్రకీలకమని అధికారులు పేర్కొన్నారు.

**స్వచ్ఛంద సేవకు పిలుపు :** ఈ లెక్కింపులో పౌరులు, విద్యార్థులు, వన్యప్రాణి అభిమానులు పాల్గొనవచ్చు. ప్రతి వాలంటీర్ అట వీ సిబ్బందితో కలిసి 7 రోజులపాటు ట్రాన్స్‌క్ట్ వాక్స్ నిర్వహిస్తారు. రోజు కు 10–15 కిలోమీటర్ల దూరం నడుస్తూ అడవుల్లో పులుల జాడలు, అడుగుల ముద్రలు, మలచిహ్నాలు, నివాస నాణ్యత వంటి వివరాలను సేకరిస్తారు. స్వచ్ఛంద సేవా అవకాశాలు నవంబర్3, 2025 నుంచి ప్రారంభమవుతున్నాయి. మరిన్ని వివరాలకు తెలంగాణ అటవీ శాఖ అధికారిక వెబ్‌సైట్ లేదా హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. వయసు: 18–60 సం.లు, ఫిట్నెస్..రోజుకు 10–12 కిమీ అడవుల్లో నడిచే సామర్థ్యం అనుకూలత..తక్కువ సౌకర్యాలతో దూరప్రాంత క్యాంపుల్లో ఉండగల సామర్థ్యం కలిగి ఉండాలని సూచించారు.

## నాణ్యమైన సేవలే లక్ష్యం : డిఇ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** విద్యుత్ వినియోగదారులందరికి నాణ్యమైన సేవలందించడమే తమ లక్ష్యం అని విద్యుత్ డిఇ విద్యాసాగర్ అన్నారు. మంగళవారం ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యుత్ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఉన్నటువంటి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించడంతో వాటి చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేయించారు. ప్రతి వారంలో మంగళ, గురు, శనివారం మూడు రోజుల పాటు విధిగా ఉదయం ఒక గంట సిబ్బందితో కలిసి ఈ ప్రజా బాటను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగ దారులకు ఏమైన సమస్యలు ఏర్పడినట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఆయన వెంట సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ మణిపాల్, సబ్ ఇంజనీర్ మల్లేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ చందు, ఏఎల్ఎంలు రవి, నవీన్, శంకర్, హాతీరారం, ఆర్టిజన్లు తదితరులు ఉన్నారు.

## పాల బిల్లులు చెల్లించాలని రైతుల ధర్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** పాల బిల్లులు ఇవ్వాలని రైతులు ధర్నా చేసిన సంఘటన మంగళవారం జిల్లా కేంద్రం శాంతినగర్ మదర్ డెయిరీలో చోటుచేసుకుంది. ఆత్మకూర్(ఎస్) మండల తుమ్మలపెన్‌పహాడ్‌కు చెందిన పది మంది రైతులు గత నాలుగు నెలలుగా పాల బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. పదిహేను రోజులకు ఒకసారి ఇవ్వాల్సిన బిల్లులు నాలుగు నెలలైనా ఇవ్వడంలేదన్నారు. గ్రామంలో 42 మంది రైతులు గత ఇరవై సంవత్సరాలుగా పాలు పోస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పాల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ చైర్మన్ పడిమర్తి గంగయ్య, డైరెక్టర్లు సూరయ్య, బజారు, మాధవరెడ్డి, అంజయ్య, తిరుమలయ్య, చినరాములు, ఉప్పలయ్య, శ్రీను, ఉపేందర్ పాల్గొన్నారు.



## నిబంధనలను పాటించని స్కూల్ బస్సు డ్రైవర్లపై చర్యలు : డిఎస్‌పి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రోడ్డు భద్రత నియమాలను పాటించని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లపై, యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రాజశేఖరరాజు హెచ్చరించారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ విద్యార్థుల ప్రాణాల మీదకు తెచ్చేలా బస్సులను నడిపితే సహించబోమన్నారు. స్కూల్ బస్సుల ఫిట్నెస్ లేకపోతే యాజమాన్యాలపై చర్యలు ఉంటాయన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపినా, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు నర్సయ్య, నాగభూషణరావు, పీఎస్ఐ.ప్రసాద్, ఎస్ఐ రాంబాబు, పోలీస్ సిబ్బంది, స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

## బకాయిలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం :ఏఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/దేవరకొండ:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ కళాశాలలు చేస్తున్న బంద్‌కు మద్దతుగా, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ సమితి ఆధ్వర్యంలో దేవరకొండ కళాశాల తరగతులు బహిష్కరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి పట్టేపు శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 8వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తూ మంత్రులను, ఎంఎల్‌ఏలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ నాయకులు సతీష్, భాను, రాంచరణ్, శివ, స్టాలిన్, మధు, నగేష్, సన్నీ, మాధవి, అనూష, అంజలి, ప్రభావతి, లక్ష్మీ, గాయత్రి, వినయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిల రాజ్యాధికారమే టిఆర్‌పి లక్ష్యం

### ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాజ్యాధికారి పార్టీ కిందిస్థాయిలో ఉన్న ప్రజలకు రాజ్యాధికారం కల్పించడమే తమ లక్ష్యమని ఆ పార్టీ అధినేత మల్లన్న వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని బోయవాడలో గల ఎస్‌బిఆర్ గార్డెన్స్‌లో ఓపెన్ టాక్ విత్ మల్లన్న ప్రశ్న మీది సమాధానం మాది అనే కార్యక్రమానికి తీన్మార్ మల్లన్న ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటలెక్చువల్ ఫోరం మేధావి వర్గం వేసిన పలు ప్రశ్నలకు మల్లన్న తమదైన శైలిలో సమాధానాలు చెప్పారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందరికి సామాజిక న్యాయం టిఆర్‌పి పార్టీతోనే సాధ్యమని చెప్పారు. అలాగే ప్రభుత్వం ఏర్పటు చేసిన వెంటనే ప్రతి సంవత్సరం విద్య, వైద్యం కోసం బడ్జెట్లో 20 కేటాయిస్తాం అని ప్రతి సామజిక వర్గం వారిని అసెంబ్లీకి తీసుకువెళ్లి అసలైన బహుజన రాజ్యాధికారం తెచ్చి చూపిస్తాం అని తెలిపారు.అలాగే కాంగ్రెస్,భారస, బీజేపీ పార్టీలవి బీసీ లపై కపట ప్రేమని నటిస్తూ ఇంకా మనల్ని మోసం చేసి రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రలు చేస్తూన్నారు అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి వట్టే జానయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాగాని హరి శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సంగెం సూర్యారావు,జర్నలిస్ట్ దేగల జనార్ధన్,శివర్చక విజయ్ కుమార్,రిటైర్డ్ ఐఏఎస్ చోళ్ళేటి ప్రభాకర్ పాల్గొన్నారు.

## సిసిఐ నిబంధనలు సడలించాలని పత్తి రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని ఎర్రగండ్లపల్లి గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి అగ్రో పత్తి మిల్లు వద్ద మంగళవారం పత్తి రైతులు ఆందోళన నిర్వహించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మిల్లు సందర్శించి బయ్యర్లతో,యజమానులతో మాట్లాడిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సూచించిన సిసిఐ నిబంధనలు సడలించి పత్తినీ కొనుగోలు చేయాలని రైతులు కోరుతూ రోడ్డుపై బైఠాయించారు.ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకొని ధర్నాలు విరమింప చేసి రైతులతో మిల్లు లోపల చర్చలు జరిపారు. ఘట నా స్థలానికి చేరుకున్న తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌తో మాట్లాడారు. మిల్లు వద్దకు వచ్చిన పత్తి లోడుల వాహనాలను ఖాళీ చేయించాలని అధికారులను రైతులు కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెందు మోహన్ రెడ్డి , బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తోటకూరి శంకర్, పిఎసిఎస్ మాజీ చైర్మెన్ పందుల యాదయ్య గౌడ్, బిజెపి మండల నాయకులు నారోజు కుమారస్వామి,పంగ యాదయ్య రైతులు పాల్గొన్నారు.



# 4నెలలుగా వేతనాల్లేక విధులు నిర్వహిస్తున్నాం

### హాస్పిటల్ కార్మికుల పెండింగ్ జీతాలు ఇప్పించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సత్యంకు మెమోరండం

### కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడిన నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్,సెక్యూరిటీ గార్డ్‌కార్మికులకు గత నాలుగు నెలల నుంచి వేతనాలు రావడంలేదని పెండింగ్ జీతాలు ఇప్పించాలని కోరుతూ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను ఎఐటియుసి ఆధ్వర్యంలోనల్లగొండలో మెమోరాండం అందజేశారు. వెంటనే స్పందించిన ఎంఎల్‌సి సత్యం కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వెంటనే జీతాలు ఇచ్చే ఏర్పాటు చేయమని కోరారు. హాస్పిటల్‌లో పనిచేసే వాళ్ళంతా నిరుపేద కుటుంబాల చెందిన పేద కార్మికులనీ నాలుగు నెలలుగా వేతనాలు రాకపోతే వాళ్ళ కుటుంబం ఏ విధంగా గడుస్తుందని వారు అన్నారు. అధికారులు వెంటనే కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరారు.నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మంగళవారం కార్మికుల విధులు బహిష్కరించి హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు నెలలుగా కార్మికుల వేతనాలు లేకున్నా విధులు నిర్వహిస్తున్నారని ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని కాంట్రాక్టర్ జీతాలు ఆపడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.గత ఆరు నెలలుగా కార్మికులకు కాంట్రాక్టర్ పిఎఫ్ కూడా కట్టడం లేదని నేటికీ అకౌంట్ నెంబర్లు కూడా కార్మికులకు ఇవ్వలేదని ఆరోపించారు. శుక్రవారం వరకు జీతాలు చెల్లించకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కాంటాక్ట్ వర్కర్స్ రవివర్మ, నాగబాబు, శివ,ప్రకాశ్,అనిత, ధనమ్మ, వంశీ, స్వాతి, రేణుక,రవళి,శశికల,అజీమా,శోభ,అరుణ,శైలజ,శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సిపిఐ శతజయంతోత్సవాలు జయప్రదం చేయండి




### జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతజయంతోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో మంగళవారం మండల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ నేను జాంగిర్ వచ్చేనెల డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న శతజయంతోత్సవాల సందర్భంగా సీపీఐ నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. 1925 డిసెంబర్ 26న కన్పూర్‌లో ఆవిర్భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని స్వాతంత్ర ఉద్యమంలో అగ్ర భాగాన నిలబడి నిస్వార్ధంగా ప్రజల కోసం పోరాడిందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు. 4 వేల మంది కమ్యూనిస్టుల బలిదానంతో 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర కూడా ఉందన్నారు. వందేళ్ల శతజయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు జిల్లా నుండి పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, కొల్లూరు రాజయ్య, ఎండి ఇమ్రాన్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, గోరేటి రాములు, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి ఆరే పుష్ప, గీత, గుండు వెంకటేష్, మద్దూరు భాగ్యమ్మ, నాదగానికి కిష్టమ్మ, నేరట లక్ష్మి , గడ్డం యాదమ్మ, బోదాస్ స్వామి, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అకాడమిక్ విద్యతో పాటు సృజనాత్మకత

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజా పక్షం/నల్లగొండ:** విద్యార్థులు జీవితంలో మంచి స్థానాన్ని పొందేందుకు పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు అకాడమిక్ విద్యతో పాటు, ఒకేషనల్ కోర్సులు, సృజనాత్మకత అవసరమని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలు ,9 ,10 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులలో శిక్షణ ఇవ్వడంలో భాగంగా ముందుగా వాటిపై అవగాహన కల్పించి అనంతరం సెట్విన్ ఆధ్వర్యంలో స్వల్పకాలిక వృత్తులపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం ఆమె జిల్లా కేంద్రం సమీపంలోని రాంనగర్‌లో ఉన్న అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఒకేషనల్ ట్రైనింగ్ పై విద్యార్థినిలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇన్చార్జి డిఆర్ఓ వై.అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్,జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్, డీఈఓ బిక్షపతి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి దశ్రునాయక్ ఉన్నారు.

**పునరావాస కాలనీల పనులను వేగవంతం**

వివిధ ప్రాజెక్టుల కింద మిగిలిపోయిన భూసేకరణ పనులు, పునరావాస కాలనీల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంజనీరింగ్ ,రెవిన్యూ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆమె తన చాంబర్లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, ఎత్తిపోత పథకాల కింద భూసేకరణ, పునరావస పనులపై సమీక్ష నిర్వహించారు.ఎత్తిపోతల పథకాల కింద భూసేకరణ, అవార్డుల జారీ, అటవీ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం, చెల్లింపులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, దేవరకొండ ఆర్‌డిఓ రమణారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు.

## జాతీయ రహదారికి మరమ్మతులు



**ప్రజాపక్షం/హాలియా:** జాతీయ రహదారులా... మజాకా.. అనే కథనానికి స్పందించిన జాతీయ రహదారుల అధికారులు భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు. గత నెల 28న 'ప్రజాపక్షం' దినపత్రికలో "జాతీయ రహదారులా.. మజాకా" అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జాతీయ రహదారులకు మరమ్మతులు చేపట్టే అధికారులు ఎట్టకేలకు స్పందించారు. నిత్యం వందల వాహనాలు జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. వాహనాల రాపిడికి పలు ప్రాంతాలలో జాతీయ రహదారులు దెబ్బతిన్నాయి. ఇందులో నిడమనూరు మండలం బొక్కమంతలపాడు, నిడమనూరు,అలీనగర్, హాలియా తదితర ప్రాంతాలలో ప్రధాన రహదారి దెబ్బతిన్నది. వీటిపై ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు అనే విషయాన్ని 'ప్రజాపక్షం' దినపత్రికలో కళ్ళకు కట్టినట్లుగా వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. దెబ్బతిన్న ఈ ప్రాంతాలలో ముమ్మరంగా మరమతులు చేపడుతున్నారు. దీంతో ప్రయాణికులు హమ్మయ్య ఈ దారికి మరమ్మతులు చేస్తున్నారంటూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : లక్ష్మణ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేస్తున్న న్యాయవాది జక్కల లక్ష్మ ణ్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడ బార్ అసోసియేషన్‌లో ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల హెల్త్‌కార్డు లిమిట్ రూ.10లక్షలకు పెంచాలని, 41ఏ సీఆర్‌పీసీ 35 బీఎన్‌ఎస్‌పై కేంద్ర ప్రభుత్వం సవరించాలని, అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే కల్పించాలని,అడ్వకేట్ యాక్ట్1961 సవరించి ప్రతి జిల్లా నుంచి ఒక బార్ కౌన్సిల్ మెంబర్ ప్రాతినిధ్యం ఉండాలన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి బార్ కౌన్సిల్ అభ్యర్థిగా గెలిపించినట్లయితే సమస్యలపై పోరాడి సాధిస్తానని అన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ అలుగుబెల్లి భూపతిరెడ్డి, న్యాయవాదులు సుండి శ్రీనివాస్, గౌడ్డాటి సాయికుమార్‌యాదవ్, చిరుమర్రి రఘురామారావు, తాజుద్దిన్, ధూపాటి మట్టయ్య, ఎల్లన్న, రాయారపు భాస్కర్‌నాయుడు, మేక కుమార్‌రెడ్డి, చిలిమెల పద్మయ్య, కందిబండ శ్రీనివాస్, ఎండి.ఇబ్రహీం, రెడ్డిపల్లి సైదులు, పరమేష్, మోదాల మల్లేష్, పగిడి ఆంజనేయులు, మంద సైదులు, బాలు పాల్గొన్నారు.



## మెడ్‌ఎక్స్ ద్వారా విద్యార్థులకు వైద్యవిద్యపై శ్రద్ధ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మెడ్‌ఎక్స్ 2025 ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థులకు వైద్యవిద్యపై ఆసక్తి, ఆరోగ్యంపై శ్రద్ధ పెంచిందని సూర్యాపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ జయలత అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గత రెండు రోజులు జరిగిన ఎగ్జిబిషన్‌కు పట్టణంలోని వివిధ పాఠశాలలు, ఫార్మసి, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు సుమారు 6వేల మంది సందర్శించినట్లు ఆమె తెలిపారు. ఎగ్జిబిషన్ ముగింపు సందర్భంగా మంగళవారం వివిధ రకాల మెడికల్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించి ఆమె మాట్లాడారు. ప్రదర్శనలో వైద్యరంగంపట్ల, ఆరోగ్యంపట్ల చెప్పాల్సిన అన్ని విషయాలను సోదారణంగా, ప్రయోగాత్మకంగా వివరించినట్లు వెల్లడించారు. డ్రగ్స్‌కు బానిసలు కావడం వల్ల ఎటువంటి నష్టం జరుగుతుంది, మన శరీరం మీద డ్రగ్స్ ప్రభావం ఏమిటి అనే విషయాలను విద్యార్థులకు వివరించామని చెప్పారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

### ఎస్‌పి కె నరసింహ

**ప్రజాపక్షం/అర్వపల్లి :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం సూర్యాపేట జనగామ 365బి పై తుంగతుర్తి నియోజక వర్గంలోని అర్వపల్లి, నాగారం, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదల స్థలాలు, బ్లాక్ స్పాట్లను డిఎస్‌పి ప్రసన్నకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావుతో కలిసి ఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత కమిటిలకు పలు సూచనలు, సలహాలు అందించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కమిటిలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలు పోకుండా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని అందు కోసం ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ముఖ్యమైన కూడళ్ళు, రోడ్డు క్రాసింగ్‌లు, గ్రామాల వద్ద, మూల మలుపుల వద్ద ఎక్కువ మొత్తంలో లైటింగ్ పెంచాలని, స్పీడ్ నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నిత్యం ప్రమాదాలకు గల కారణాలను నివృత్తి చేసుకొని లోపాలను సవరించడం, చెట్ల పొదలు తొలగించడం, లైటింగ్స్, బారికెట్స్ ఏర్పాటు, డైవర్షన్ గుర్తులు, రోడ్డు నిబంధనల సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఆ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం లాంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణ సమయంలో వాహనదారులు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తప్పుడు మార్గంలో వాహనాలను నడపవద్దని కోరారు. అజాగ్రత్త అధిక వేగం కారణంగానే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు తక్కువ వేగంతో వాహనాలు నడుపాలని కోరారు. వ్యవసాయ సంబంధ పనులకు వెళ్ళే రైతులు తప్పుడు మార్గంలో వెళ్ళవద్దని సూచించారు. ప్రయాణ సమయంలో మనం తీసుకున్న జాగ్రత్తలు ప్రాణాలు కాపాడుతాయని అశ్రద్ధగా ఉంటే రోడ్డు ప్రమాదాల బారినపడతారన్నారు.




## అంతర్రాష్ట్ర దొంగను పట్టించిన సిసిటివి కెమెరా

### సుమారు రూ. 12లక్షల విలువ గల 6 తులాల బంగారం...35 తులాల వెండి.. ఒక బైక్ స్వాధీనం

### నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యం తో జిల్లా ఎస్‌పిశరత్ చంద్ర పవార్ నేను సైతం కమ్యూనిటీ సిసిటివి కార్యక్రమాల ద్వారా ప్రతి గ్రామంలో, వార్డ్ లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన్ టౌన్ పరిధిలో వారం క్రితం జరిగిన మూడు వేరు వేరు కేసులలో సిసిఎస్ టీమ్,సిబ్బంది కలిసి అంతరాష్ట్ర దొంగ ను పట్టుబడి,అరెస్టు చేసి రిమాండ్ కీ పంపించడం జరిగిందని తెలిపారు.గత నెల 25 న శాంతి నగర్‌లో నివాసం ఉండే జెర్రిపోతుల రవి ఇంట్లో వస్తారు రాత్రి. 7 గంటలకు ఇంటికి తాళం వేసి, ఊరికి వెళ్లి తిరిగి ఉదయం వచ్చేసరికి తాళం పగలగొట్టి, బీరువా ఓపెన్ చేసి దానిలో ఉన్న బంగారు,వెండి ఆభరణాలు కొంత నగదు దోచుకెళిన కరుడు గట్టిన అంతరాష్ట్ర దొంగ పాత నేరస్తుడు అయిన రుద్రాక్షి శ్రీనును మంగళవారం ఉదయం మునుగోడు రోడ్ లో వెహికల్ చెకింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా బైక్ పై పారిపోతుడంగా రుద్రాక్ష శీను గా గుర్తించి అదుపులోకి తిసుకున్నారు. గతంలో తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్ లోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 40 వరకు దొంగతనాలు చేసి ఇటీవల తిరుపతి జైలుకు వెళ్లి, తన ప్రవృత్తి మార్చుకోకుండా తిరిగి పదిహేను రోజుల క్రితం బయటకు వ చ్చి శాంతి నగర్ లోని ఒక ఇంటి లో దొంగతనం,పక్కనే ఇంటి ముందు పార్క్ చేసిన ఒక బైక్ దొంగతనం దేవరకొండ రోడ్ లోనీ కనక దుర్గా కాలనీలో మరొక ఇంట్లో దొంగతనం చేసిన నేరాలు (3) ఒప్పుకొని, దొంగిలించిన సొత్తు, బైక్‌ను చూపించగా వాటిని స్వాధీనం చేసుకుని నేరస్తుడుశ్రీనును జ్యుడీషియల్ కస్టడీ నిమిత్తం రిమాండ్ కి తరలించి అతని వద్ద నుండి సుమారు 6 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి ఆభరణాలు ఒక యునికార్న్ బైక్‌ని స్వాధీనం పరుచుకోవడం జరిగిందని తెలిపారు. అంతరాష్ట్ర దొంగను పట్టుబడి చేసి చాకచక్యంగా కేసులలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ సిఐ జితేందర్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, ఎస్ఐ విజయ్,హెడ్ కానిస్టేబుల్ విష్ణు,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదులు, గోపాలరావు, వెంకట నారాయణ, షకీల్, రబ్బాని, ఫింగర్ ప్రింట్స్ ఎస్ఐ శివ, సిసిఎస్ సిబ్బంది సాయి, మహేష్, వహీద్, దస్తగిరి జునైద్ తదితరులను జిల్లా ఎస్‌పి అభినందించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసిన భద్రతా దళాలు



**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోని దట్టమైన అడవిలో ఉన్న మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతా దళాలు ధ్వంసం చేసి, ఉత్పత్తిలో ఉపయోగించే భారీ పరికరాలతో పాటు 17 తుపాకీలను స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం ఒక పోలీసు అధికారి తెలిపారు. గోమ్‌గూడ అటవీ ప్రాంతంలోని తాత్కాలిక కర్మాగారాన్ని ఛేదించిన తర్వాత జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) బృందం సోమవారం ఒక బ్యారెల్ గ్రెనేడ్ రాకెట్ లాంచర్, ఆరు బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు (బిజిఎల్‌లు), ఆరు 12బోర్ రైఫిల్స్, మూడు సింగిల్‌షాట్ రైఫిల్స్, ఒక కంట్రీమేడ్ పిస్టల్‌తో సహా 17 ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. వాటిలో రెండు 12బోర్ రైఫిల్ బ్యారెల్స్, 2 సింగిల్‌షాట్ రైఫిల్ బ్యారెల్స్, ఒక పెద్ద హ్యాండ్‌డ్రిల్ మెషిన్, 17 బెంచ్ వీసెస్, మూడు బిజిఎల్ బ్యారెల్స్, రెండు బిజిఎల్ బాడీ కవర్లు, విద్యుత్ వైర్, ఇనుపపైపులు,తుపాకీలతయారీలో ఉపయోగించే పదార్థాలు ఉన్నాయి.

## బిహార్‌లో మహిళల భద్రత ఆందోళనకరం


సాధికారత, ఆర్థిక అభ్యున్నతికి కట్టుబడి ఉంది: ఖర్గే



**న్యూఢిల్లీ :** బిహార్‌లో మహిళల భద్రతపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై బిజెపి–జెడి(యు)ను తీవ్రంగా విమర్శించారు. మహాఘట్‌బంధన్ మహిళల సాధికారత, ఆర్థిక అభ్యున్నతికి పూర్తిగా కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ఎన్నికల సమయంలో లేదా వాటికి ముందు ఓట్లు సంపాదించడం కోసం మాత్రమే కాంగ్రెస్ వాగ్దానాలు చేయదని, చెప్పినవన్నీ నెరవేరుస్తుందని ఖర్గే అన్నారు. బిహార్‌లో బిజెపి–జెడియు ప్రభుత్వం 20 సంవత్సరాలుగా అధికారంలో ఉందని, నేటికీ, కోడళ్లు, కుమార్తెలు సురక్షితంగా లేరని, ఇదీ ఈ 20 ఏళ్లలో ఎన్‌డిఎ సాధించిన ఘనత అని ఎద్దేవా చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకుంటున్న మోదీ బిహార్‌ను సురక్షితంగా మార్చలేదని ఖర్గే ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. స్త్రీలు, పిల్లల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 70 శాతం మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారని, 40 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఖర్గే పేర్కొన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) డేటాను ఉటంకిస్తూ శిశువులలో 11 శాతం మందికి మాత్రమే తగినంత పోషకాహారం లభిస్తుందని ఆయన అన్నారు. జనాభాలో సగం మంది సాధికారత, ఆర్థిక అభ్యున్నతికి మహాఘట్‌బంధన్ పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన మహిళలను ప్రస్తావిస్తూ అన్నారు. మహాఘట్‌బంధన్ మహిళలకు చేసిన వాగ్దానాలను గుర్తుచేస్తూ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే వారికి నెలకు రూ. 2,500 సహాయం అందిస్తామని ఖర్గే అన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నెలకు రూ. 1,500–రూ.3,000 పెన్షన్ ఇస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు. జీవిక దీదీలకు అధికారిక హోదా ఇస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు చెప్పారు. 'మా వాగ్దానాలు ఎన్నికల సమయంలో లేదా వారి ముందు ఓట్లు సంపాదించడం మాత్రమే కాదు, అవి నెరవేర్చే వాగ్దానాలు. మేము ఇప్పటికే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వాటిని నెరవేర్చాము' అని ఆయన అన్నారు.

## యువత పట్ల మోదీ ఉదాసీనత

సోషల్ మీడియా రీల్స్ తయారు చేయడంలో బిజీగా ఉండాలని చూస్తున్నారు : రాహుల్‌గాంధీ



**ఔరంగాబాద్ :** దేశ యువత పట్ల ప్రధాని నరేంద్ర మోదీ చూపుతున్న ఉదాసీనతపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. యువత సోషల్ మీడియా రీల్స్ తయారు చేయడంలో బిజీగా ఉండాలని మోదీ కోరుకుంటున్నారని, తద్వారా వారు విద్య, ఆరోగ్యం, ఉపాధి సమస్యల నుండి దృష్టి మరల్చకుండా ఉండాలని చూస్తున్నారని ఆరోపించారు. బిహార్‌లోని ఔరంగాబాద్, గయాజీలలో మంగళవారం వరుసగా నిర్వహించిన ఎన్నికల ర్యాలీల్లో పాల్గొని మాట్లాడారు. మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. దేశ యువతను సోషల్ మీడియాకు వ్యసనంగా మారేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. 'మోదీ మిమ్మల్ని రీల్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తయారీకి బానిసలుగా మార్చాలనుకుంటున్నారు... ఇది 21వ శతాబ్దపు కొత్త ఎత్తు ('నాషా'). యువత దృష్టి మరల్చకుండా ఉండేలా, విద్య, ఆరోగ్యం, ఉపాధికి సంబంధించిన సమస్యల పట్ల తన ప్రభుత్వాన్ని జవాబుదారీగా కాకుండా ఉండేలా చూసుకుంటున్నారని ఆరోపించారు. మోదీ, హోంమంత్రి అమిత్ షా బిహార్‌లో 'ఓటు చోరీ' (ఓటు దొంగతనం)లో పాల్గొంటున్నారని, ఎందుకంటే ఎన్‌డిఎ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవదని వారికి తెలుసునని రాహుల్ పేర్కొన్నారు. ఆర్‌జెడితో పొత్తు పెట్టుకుని, తమ పార్టీ అధికారంలోకి వస్తే జంగల్ రాజ్‌ను తిరిగి తీసుకువస్తుందని బిజెపి, ఇతర ఎన్‌డిఎ నాయకులు పదే పదే చేస్తున్న వాదనలను కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తిప్పికొట్టారు. ఓట్ల దొంగతనానికి వీలు కల్పించే మోదీ, జంగల్ రాజ్ గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు.

ఓట్ల దొంగతనానికి వీలు కల్పించే మోదీ ఢిల్లీలో 'జంగల్ రాజ్'ను తీసుకువచ్చారన్నారు. మహారాష్ట్ర, హర్యానాలో కూడా ఆయన అలాగే చేశారని, ఇప్పుడు బిహార్‌లోనూ అదే చేయాలనుకుంటున్నారని ఆరోపించారు. కానీ, బిహార్ ప్రజలు ఆయన కుట్రలను ఓడిస్తారని తనకు కచ్చితంగా తెలుసునన్నారు. బిహార్‌లో అధికారంలోకి వస్తే ఇండియా కూటమి అత్యంత వెనుకబడిన, సామాజికంగా అణగారిన, దళితుల ప్రభుత్వం అవుతుందన్నారు. రాష్ట్రాన్ని తయారీ కేంద్రంగా మారుస్తామని, బట్టలు, మొబైల్ ఫోన్‌లపై 'మేడ్ ఇన్ బిహార్' లేబుల్‌లను నిర్ధారిస్తామని, చైనా కూడా లేచి కూర్చుని గమనించేలా చేస్తామని ఆయన అన్నారు. ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే నలందలో అత్యాధునిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బిహార్ ప్రాచీన వైభవాన్ని పునరుజ్జీవింపజేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బిహార్ యువతను కార్మికులుగా మార్చి, వారికి ఉన్న అన్ని ఉపాధి అవకాశాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. న్యూఢిల్లీలో కూర్చున్న వారి ఆదేశాల మేరకు పనిచేసే నితీష్ కుమార్, నరేంద్ర మోదీ బిహార్ యువతకు నిరుద్యోగాన్ని బహుమతిగా ఇచ్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు కూడా బిహార్‌లో ఒక సాధారణ వ్యవహారం, ఆర్థికంగా ధనవంతులైన విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తాయన్నారు.

## వరికి రూ.300, గోధుమలకు రూ.400 బోనస్: తేజస్వీ హామీ

అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తాం



**పాట్నా :** బిహార్‌లో ఇండియా కూటమి ముఖ్యమంత్రిఅభ్యర్థి, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ రైతులకు వరాలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కనీస మద్దతు ధర కంటే క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 బోనస్‌గా ఇస్తామనిప్రకటించారు. మంగళవారం ఆయన పాట్నాలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష కూటమి అధికారాన్ని దక్కించుకుంటే రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు (పిఎసిఎస్), ప్రాథమిక మార్కెటింగ్ సహకార సంఘాల (వ్యాపర్ మండలాలు) అధిపతులకు కూడా ప్రజాప్రతినిధుల హోదా కల్పిస్తామని వాగ్దానం చేశారు. రాష్ట్రంలో 8,400 కంటే ఎక్కువ పిఎసిఎస్‌లు ఉన్నాయని చెప్పారు. అదే విధంగా రైతులకు నీటిపారుదల ప్రయోజనాల కోసం ఉచిత విద్యుత్ అందిస్తామని, ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ కార్యకలాపాలలో ఉపయోగించే విద్యుత్ కోసం రైతుల నుండి యూనిట్‌కు 55 పైసలు వసూలు చేస్తుందని తేజస్వీ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార సేకరణకు పిఎసిఎస్‌లు, వ్యాపార్ మండలాలు ఏజెన్సీలుగా పనిచేస్తాయి. వివిధ వ్యవసాయ, వ్యవసాయ కార్యకలాపాల కోసం రైతులకు స్వల్పకాలిక, మధ్యకాలిక వ్యవసాయ రుణాలను అందించే గ్రౌండ్‌లెవల్ కోఆపరేటివ్ క్రెడిట్ సంస్థలు పిఎసిఎస్‌లు. కాగా, తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, రాష్ట్రంలో నమోదైన 8,400 వ్యాపార్ మండలాలు, పిఎసిఎస్‌ల నిర్వాహకులకు గౌరవ వేతనం ఇవ్వాలని కూడా యోచిస్తున్నామని తేజస్వీ చెప్పారు. ''మై–బహెన్' పథకం కింద ప్రతి నెలా మహిళల బ్యాంకు ఖాతాల్లోకి ఒక్కొక్కరికి రూ. 2,500 జమ చేస్తామని తాము ఇప్పటికే హామీ ఇచ్చామని, ఇప్పుడు వచ్చే ఏడాది జనవరి 14న 'మక్కర్ సంక్రాంతి' సందర్భంగా 'మై–బహెన్ పథకం' కింద రాష్ట్రంలోని అన్ని మహిళల ఖాతాలకు రూ. 30,000 ముందుగానే (మొత్తం సంవత్సరం) జమ చేయాలని నిర్ణయించామని ఆర్‌జెడి నేత చెప్పారు.

## గ్యాంగ్‌రేప్ నిందితులపై పోలీస్ కాల్పులు


ముగ్గురు అరెస్ట్



**తమిళనాడు:** కోయంబత్తూరు గ్యాం గ్ రేప్ కేసులో నిందితులు అరెస్ట్ అయ్యారు. విమానాశ్రయం సమీపంలో ఆదివారం మహిళా కళాశాల విద్యార్థినిని కిడ్నాప్ చేసి లైంగికంగా దాడి చేసినందుకు ఈ ము గ్గురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారుజామున నిందితుల జాడ కనిపెట్టిన పోలీసులు.. వారిని పట్టుకునేందుకు వెళ్లారు. పోలీసులు వస్తున్నట్లు తెలుసుకున్న నిందితులు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పారిపోతున్న నిం దితుల కాళ్ల మీద పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. అనంతరం తవాసి, కార్తీక్, కాళీశ్వరన్‌లను అదుపులోకి తీసుకుని, అనంతరం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, కోయంబత్తూరులోని ఒక ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న బాధిత విద్యార్థిని ఎయిర్ పోర్ట్ ప్రాంతంలో తన బాయ్ ఫ్రెండతో కలిసి కారులో కూర్చుని ఉంది. అది చూసిన ముగ్గురు నిందితులు వారితో ఘర్షణకు దిగారు. బాధితురాలి స్నేహితుడ్ని తీవ్రంగా కొట్టి.. అనంతరం ఆమెను కిడ్నాప్ చేసి బలవంతంగా వేరే ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికంగా వేధించారు. కొంచెం సేపటికి తేరుకున్న బాధితురాలి బాయ్ ఫ్రెండ్ పోలీసులకు ఫోన్ చేశాడు. పోలీసులు రంగంలోకి దిగి నిందితుల్ని పట్టుకున్నారు. నిందితులను వెతకడానికి ఏడు ప్రత్యేక బృందాలు గాలింపు జరిపి రెండు రోజుల్లో వారిని కటకటాలవెనక్కి నెట్టాయి.


## బిహార్‌లో కేంద్రమంత్రిపై ఎఫ్‌ఐఆర్

ప్రతిపక్షనేతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు కేసు నమోదు



**పాట్నా :** కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ 'లాలన్'పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు పాట్నా జిల్లా యంత్రాంగం తెలిపింది. బిహార్‌లోని మోకామాలో అరెస్టయిన జెడి(యు) అభ్యర్థి అనంత్ సింగ్ తరపున ప్రచారం చేస్తున్న సమయంలో ప్రతిపక్ష నాయకులపై వివాదాస్పద ప్రకటన చేసినందుకు అధికారులు ఆయనపై చర్యలకు ఉపక్రమించారు. పోలింగ్ రోజున ప్రత్యర్థులను బెదిరించమని ఎన్‌డిఎ మద్దతుదారులను మంత్రి కోరుతున్నట్లు ఓ వీడియో బయటకు రావడంతో మంత్రి కొత్త వివాదంలో చిక్కుకున్నారు. వీడియో ఫుటేజ్‌ను పాట్నా జిల్లా యంత్రాంగం పరిశీలించిందని, దర్యాప్తు తర్వాత, బిఎన్‌ఎస్‌ఎస్, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ల కింద లాలన్ సింగ్ అలియాస్ రాజీవ్ రంజన్ సింగ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు పాట్నా జిల్లా అధికారులు ఎక్స్‌లో పోస్టు చేశారు. 'పోలింగ్ రోజున బయటకు వెళ్లడానికి మీరు అనుమతించకూడని కొంతమంది వ్యక్తులు ఉన్నారు. వారిని ఇళ్లలోనే బంధించండి. వారు మిమ్మల్ని బెదిరిస్తే, వారితో పాటు పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటు వేసిన తర్వాత ఇంటికి వెళ్లేలా చూసుకోండి' అని లాలన్ పేర్కొనట్లు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మోకామా సీటును మరోసారి దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్న వివాదాస్పద హిహార్ మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్, అతని ఇద్దరు సహచరులు మణికాంత్ ఠాకూర్, రంజీత్ రామ్‌లను జన్ సూరాజ్ పార్టీ మద్దతుదారు దులార్ చంద్ యాదవ్ హత్య కేసులో శనివారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. గత వారం మోకామా ప్రాంతంలో జన్ సూరాజ్ పార్టీ అభ్యర్థి పియూష్ ప్రియదర్శి తరపున ప్రచారం చేస్తున్నప్పుడు యాదవ్ మృతి చెందాడు. మోకామాలో జరిగిన ఒక సభలో లాలన్ సింగ్ మాట్లాడుతూ 'అనంత్ సింగ్ అరెస్టు తర్వాత, ప్రతి ఒక్కరూ అనంత్ సింగ్‌గానే ఎన్నికల్లో పోటీ చేయాలి. అనంత్ బాబు బయట ఉన్నప్పుడు, నా బాధ్యత తగ్గిందని, కానీ ఇప్పుడు అతను జైలులో ఉన్నందున, బాధ్యత మరింత పెరిగిందని అన్నారు.

## కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలో భూ ప్రకంపనలు



**విజయపురి/అమరావతి:** కర్నాటక,ఆంధ ప్రదేశ్‌లలో మంగళవారం స్వల్పంగా భూమి కంపించింది. కర్నాటకలో 2.9గా, ఎపిలో 3.7గా తీవ్రత నమోదైంది. మంగళవారం ఉదయం కర్నాటకలోని విజయపుర జిల్లాలో ఉదయం 7.49 గంటలకు తేలికపాటి భూకంపం వచ్చినట్లు రాష్ట్ర ప్రకృతి వైపరీత్య పర్యవేక్షణ కేంద్రం (కెఎస్‌ఎన్‌డిఎంసి) తెలిపింది. స్వల్పంగా ప్రకంపనలు రావడంతో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. విజయపుర తాలూకాలోని భుట్నాల్ తండాకు వాయువ్యంగా 3.6 కిలోమీటర్ల దూరంలో 16.91 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 75.75 డిగ్రీల తూర్పు రేఖాంశం, ఐదు కిలోమీటర్ల లోతులో భూకంపం నెలకొని ఉన్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయపుర జిల్లాలోని కెఎస్‌ఎన్‌డిఎంసి నెట్‌వర్క్ ద్వారా 2.9 తీవ్రతతో భూకంప కేంద్రం నమోదైందన్నారు. అదే విధంగా ఎపిలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3.7 తీవ్రతతో స్వల్ప భూకంపం సంభవించింది. పొరుగున ఉన్న విశాఖపట్నం జిల్లాలో కూడా ప్రకంపనలు వచ్చాయి. అయితే, ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ ప్రకారం ఉదయం 4:19 గంటలకు 10 కి.మీ లోతులో భూకంపం నమోదైందని, భూకంపం కేంద్రం 18.02 ఒఎన్ అక్షాంశం, 82.58 ఒఇ రేఖాంశం వద్ద ఉందని తెలిపారు. భూకంపం స్వల్పకాలికమని, ముందు జాగ్రత్త చర్యగా స్థానిక జిల్లా విపత్తు నిర్వహణ బృందాలను అప్రమత్తం చేసినట్లు అధికారి తెలిపారు.

## అమెరికా హైర్ బిల్లుపై కాంగ్రెస్ ఆందోళన



**న్యూఢిల్లీ:** అవుట్‌సోర్సింగ్ చెల్లింపు చేస్తున్న ఏ అమెరికా వ్యక్తిపైన అయినా 25 శాతం విధించాలని ప్రతిపాదిస్తూ అమెరికా సెనేట్ ఒక బిల్లు(హైర్)ను ప్రవేశపెట్టడం వాస్తవమయితే... అది 'భారత ఆర్థిక వ్యవస్థకు ముప్పు'గా మారుతుందని కాంగ్రెస్ మం గళవారం ఆందోళన వ్యక్తం చేసింది. 'ఇది ఆలస్యమవుతుంది. ఒక విషయం స్పష్టంగా ఉంది. బ్లూకాలర్ ఉద్యోగాలు చైనాకు కోల్పోయినప్పటికీ, వైట్‌కాలర్ ఉద్యోగాలను భారతదేశానికి కోల్పోకూడదనే అమెరికాలో పెరుగుతున్న మనస్తత్వాన్ని ఈ బిల్లు ప్రతిబింబిస్తుంది' అని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. అక్టోబరు 6న ఒహియోకు చెందిన సెనేటర్ బెర్నీ మోరెనో ప్రవేశపెట్టిన హాల్టింగ్ ఇంటర్నేషనల్ రిలొకేషన్ ఆఫ్ ఎం ప్లాయ్‌మెంట్ యాక్ట్ లేదా హైర్ యాక్ట్ బిల్లును ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్‌వ్యవహారాలఇంఛార్జ్) జైరాం రమేశ్ ఈ వ్యా ఖ్యలు చేశారు. సెనేట్ కమిటీ ఆన్ ఫైనాన్స్‌కు సూ చించినట్లు ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ బిల్లు అవుట్‌సోర్సింగ్ చెల్లింపు చేసే ఏ అమెరికా వ్యక్తి పైన అయినా 25 శాతం పన్నును ప్రతిపాదిస్తుంది. దీనిని అమెరికాలోని వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చేది. పని చేసే విదేశీ వ్యక్తికి అమెరికా కంపెనీ లేదా పన్ను చెల్లింపుదారు చెల్లించే ఏదైనా డబ్బుగా నిర్వచించారు. ఈ బిల్లు భారతదేశ ఐటీ సేవలు, బీపీవో, కన్సల్టింగ్, జీసీసీల (గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు) పై ప్ర త్యక్ష, లోతయిన ప్రభావాన్ని చూపుతుందని ఆయన పేర్కొన్నా రు. ఐర్లాండ్, ఇ జ్రాయిల్, ఫిలిప్పీన్స్ వంటి ఇతర దేశాలు కూ డా ప్రభావితమవుతాయి. అయితే గరిష్ట ప్రభా వం గత పావు శతాబ్దం లో గణనీయమైన విజ యం సాధించిన భారతదేశ సేవల ఎగుమతులపై ఉంటుందన్నారు. ప్రస్తుత రూపంలో బిల్లు ఆమోదించబడవచ్చు లేదా ఆమోదించబడకపోవచ్చు, సవరించబడవచ్చని జైరాం రమేశ్ తెలిపారు. భారత్, అమెరికా ఆర్థిక సంబంధం చాలా దెబ్బలు తింటుందని ఒక సంవత్సరం క్రితం ఎవరూ ఊహించలేదని, వీటిలో హైర్ బిల్లు మరొక ప్రతిబింబం ఆయన పేర్కొన్నారు. 'ఎప్పుడయినా హైర్ బిల్లు వాస్తవమైతే అది భారత ఆర్థిక వ్యవస్థలో మంటను రేకెత్తిస్తుంది. ఇది అమెరికాకు సంబంధించి కొత్త సాధారణ స్థితిని ఎదుర్కోవలసి ఉంటుంది' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. సెనేటర్ బెర్నీ మోరెనో ప్రవేశపెట్టిన ప్రతిపాదిత 'హైర్' చట్టం ఆమోదం పొందితే, అవుట్‌సోర్సింగ్‌ను అరికట్టి, అమెరికన్ కంపెనీలు తమ దేశ వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చే సేవల కోసం విదేశీ కార్మికులకు చేసే చెల్లింపులపై 25 శాతం పన్ను విధించడం ద్వారా దేశీయ ఉపాధిని ప్రోత్సహిస్తుంది.

## కారును ఢీకొన్న ట్రక్కు: ఆరుగురు మృతి

బారాబంకి: ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బారాబంకిలోని దేవా ఫతేపూర్ రహదారిపై ట్రక్కు కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బారాబంకి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అర్పిత్ విజయవర్గియ తెలిపిన వివరాల ప్రకారం... ఎనిమిది మందితో వెళుతున్న కారును దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ట్రక్కు బలంగా ఢీకొంది. దీంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఆరుగురు మతి చెందారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరిని ఆసుపత్రికి తరలించాము. కారు, ట్రక్కు రెండు వాహనాలు వ్యతిరేక దిశలో వస్తున్నాయి. అందువల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన అన్నారు.

### ఆన్‌లైన్ గేమింగ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై...

## సమగ్ర సమాధానం దాఖలుచేయాలని కేంద్రాన్ని కోరిన 'సుప్రీం'

నవంబరు 26కు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ :** 'ఆన్‌లైన్ మనీ గేమ్స్'ను నిషేధించే, బ్యాంకింగ్ సేవలు, వాటికి సంబంధించిన ప్రకటనలను నిషేధించే ఆన్‌లైన్ గేమింగ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమగ్ర సమాధానం దాఖలు చేయాలని మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. పిటిషన్లలో చేసిన మధ్యంతర ప్రార్థనలపై కేంద్రంతన సమాధానం దాఖలు చేసిందనిన్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్థీవాలా, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు సమాచారం అందింది. 'కేంద్ర ప్రభుత్వం తరపున హాజరయ్యే అదనపు సొలిసిటర్ జనరల్ తరపున మేం సమాధానం కోరుకుంటున్నాం' అని ధర్మాసనం చెప్పింది. పిటిషనర్ల తరపున హాజరయ్యే న్యాయవాదికి ముందుగానే సమాధానం కాపీలు అందజేయాలని, ఒకవేళ వారు ఏదైనా రిజాయిండర్ దాఖలు చేయాలని అనుకుంటే వీలైనంత త్వరగా అందజేయాలని తెలియజేసింది. కాగా, దీనికి సంబంధించిన విచారణను ధర్మాసనం నవంబరు 26కు వాయిదా వేసింది. ఆన్‌లైన్ గేమింగ్, ప్రమోషన్ మరియు రెగ్యులేషన్ యాక్ట్ 2025 అనేది రియల్‌మనీ ఆన్‌లైన్ గేమ్‌ను నిషేధించే మొదటి కేంద్ర చట్టం. ఇందులో ఫాంటసీ స్పోర్ట్స్ సహా పందెం కోసం ఆడే ఇస్పోర్ట్స్ ఉన్నాయి. ఢిల్లీ, కర్ణాటక, మధ్యప్రదేశ్ హైకోర్టుల ముందు సవాళ్లను ఎదుర్కొన్నాయి. ఈ కేసులో హాజరైన సీనియర్ న్యాయవాది సి.ఎ.సుందరం మాట్లాడుతూ ఒక నెలకు పైగా వ్యాపారం పూర్తిగా మూతపడిందని ధర్మాసనానికి చెప్పారు. 'నేను (పిటిషనర్) ఒక చెస్ ఆటగాడిని. అది ఉత్సాహానికి మూలం. 'నేను కూడా ఒక యాప్‌ను ప్రారంభించబోతున్నాను' అని న్యాయవాది చెప్పారు. 'భారతదేశం ఒక వింత దేశం. మీరు ఒక ఆటగాడు. మీరు ఆట ఆడాలనుకుంటున్నారు. అది మీకు ఏకైక ఆదాయ మార్గం కాబట్టి, మీరు విచారణలో పాల్గొనాలని కోరుకుంటున్నారు' అని జస్టిస్ పార్థీవాలా చెప్పారు. కంపెనీలు నిర్వహించే ఆన్‌లైన్ టోర్నమెంట్లలో పిటిషనర్ పాల్గొంటారని, ఆయన అందులో పాల్గొనేందుకు ఫీజును కూడా చెల్లిస్తున్నారని న్యాయవాది తెలిపారు. పిటిషన్‌ను పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లతో కూడా జతచేయాలని ధర్మాసనం చెప్పింది. ఆన్‌లైన్ గేమింగ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన బదిలీ పిటిషన్ల బ్యాచ్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. సోషల్, ఇస్పోర్ట్స్ గేమ్‌ల ముసుగులో పనిచేస్తున్నాయని ఆరోపించబడిన ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లను నిషేధించాలని ప్రభుత్వానికి సూచించాలని కోరుతూ దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌ను నవంబరు 26న విచారించనున్నట్లు ధర్మాసనం తెలిపింది.సెంటర్ ఫర్ అకౌంటబిలిటీ సిస్టమిక్ ఛేంజ్ (సిఎఎస్‌ఇ), శౌర్య తివారీ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం అత్యున్నత న్యాయస్థానం కేంద్రం స్పందన కోరింది. న్యాయపరంగా గుర్తింపుపొందిన నైపుణ్య ఆధారిత ఆటలపై ఈ చట్టం పూర్తిగా నిషేధం విధిస్తుందని, చట్టబద్ధమైన వాణిజ్యంలో ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కును హామీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (జి) ని ఉల్లంఘిస్తుందని పిటిషనర్లు వాదిస్తున్నారు. దీనికి సంబంధించి మరొక సంబంధిత పిటిషన్‌లో కర్ణాటక హైకోర్టు ఇటీవలే ఒక నోటీస్ జారీ చేసింది. ప్రమోషన్ మరియు రెగ్యులేషన్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను మూడు హైకోర్టుల నుండి సుప్రీంకోర్టుకు విరుద్ధమైన తీర్పులకు బదిలీ చేయాలనే అభ్యర్థనను సెప్టెంబరు 8న అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. ఢిల్లీ, కర్ణాటక, మధ్యప్రదేశ్ హైకోర్టుల ముందు పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేసింది. కోర్టుల నుండి మూడు పెండింగ్ కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఇఐటి వై) పిటిషన్ దాఖలు చేసింది. ఈ చట్టం రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత బహుళ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ హైకోర్టులలో చట్టం యొక్క ప్రశ్న శిక్షించడిన చర్య యొక్క లక్షణాలను సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ చట్ట ం రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత, ఆ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ హైకోర్టులలో బహుళ పిటిషన్లు దాఖలు చేయబడ్డాయని అది పేర్కొంది. ఈ బిల్లును ఆగస్టు 20న లోక్‌సభలో ప్రవేశపెట్టబడింది.

## 'పోక్సో'నిబంధనలపై...మరింత అవగాహన కల్పించాలి

నొక్కిచెప్పిన 'సుప్రీం'

డిసెంబరు 2కు 'పిల్' విచారణ వాయిదా




**న్యూఢిల్లీ :** వివాహ విభేదాలు, కౌమార దశలో ఉన్న వారిమధ్య ఏకాభిప్రాయ సంబంధాల కేసుల్లో పోక్సో యాక్ట్ (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫెన్సెస్ చట్టం) దుర్వినియోగం అవుతోందని, దాని చట్టపరమైన నిబంధనల గురించి బాలురు మరియు పురుషులలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని మంగళవారం అత్యున్నత న్యాయస్థానం నొక్కిచెప్పింది. అత్యాచారానికి సంబంధించిన శిక్షా నిబంధనల ప్రజలను చైతన్యవంతం చేయడం, లైంగిక వేధింపుల నుండి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం ద్వారా దేశాన్ని బాలికలు, మహిళలకు మెరుగైన ప్రదేశంగా మార్చాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్)ను న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, ఆర్.మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. దీనిపై స్పందించిన ధర్మాసనం 'ఒక విషయం, మేం గమనించాలని అనుకుంటున్నాం. వివాహ విభేదాలు, కౌమారదశలో ఉన్న వారి మధ్య సంబంధాల విషయంలో పోక్సో చట్టం దుర్వినియోగం చేయబడుతోంది. చట్టపరమైన నిబంధనల గురించి పురుషులలో అవగాహన పెంచాలి' అని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. అత్యున్నత న్యాయస్థానం ఈ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని డిసెంబరు 2కు వాయిదా వేసింది. ధర్మాసనం ఈ విషయమై మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ స్పందనను దాఖలు చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనిపై సీనియర్ న్యాయవాది ఆబాద్ హర్షద్ పోండా దాఖలు చేసిన పిటిషన్‌పై ఇంతకుముందు అత్యున్నత న్యాయస్థానం కేంద్రానికి, కేంద్ర విద్య, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి)లకు నోటీసులు జారీ చేసింది. నిర్భయ కేసు అనంతరం అత్యాచారానికి సంబంధించిన చట్టాలు, వాటిలో వచ్చిన మార్పుల గురించి ప్రజలకు తెలియాల్సిన ఆవశ్యకతను పోండా నొక్కిచెప్పారు.14 సంవత్సరాలకంటే తక్కువ వయసున్న పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలని అన్ని విద్యాసంస్థలను అడగాలని మహిళలు, పిల్లలపై జరిగే నేరాలకు సంబంధించిన శిక్షానిబంధనలను వారి విద్యలో చేర్చాలని విద్యా మంత్రికి ఆదేశాలు జారీచేసేలా పలు చర్యలను చేపట్టాలని పిటిషనర్లు ధర్మాసనాన్ని కోరారు. లైంగిక సమానత్వం గురించి అవగాహన కల్పించడంలో భాగంగా నైతిక శిక్షణ అంశాన్ని కూడా చేర్చాలని, లైంగిక సమానత్వం మహిళలు, బాలికల హక్కుల గురించి అవగాహన, గౌరవంగా జీవించే స్వేచ్ఛ అని అది చెబుతోంది.'ముఖ్యంగా ఈ దేశంలో అబ్బాయిల మనస్తత్వాలలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు పాఠశాల స్థాయి నుంచే తప్పని సరిగా కసరత్తు చేయాలని అది పేర్కొంది.

ప్రజాపక్షం
బుధవారం, 05 నవంబరు

# మహిళా క్రికెట్‌కు మంచి రోజులు

మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ఎట్టకేలకు మన నట్టింటికొచ్చింది. 50 ఏళ్ల ప్రయాణంలో తొలిసారి సొంతగడ్డపై, దేశవ్యాప్తంగా కోట్లాది క్రీడాభిమానుల కేరింతల మధ్య, కిక్కిరిసిన నవీ ముంబయిలోని డివై పాటిల్ స్టేడియం ఆదివారం అర్ధరాత్రి కొత్త కాంతులీనింది. ఎంతో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టును 52 పరుగుల తేడాతో ఓడించి ఈ ఘనతను సాధించిన హర్మన్ ప్రీత్ కౌర్ జట్టుకు జేజేలు. ఫైనల్స్‌కు భారత జట్టు ప్రయాణమే ఒడిదొడుకులతో, ఆశ–నిరాశలతో సాగింది. క్రీడాభిమానులు కూడా అంతే భావోద్వేగాలతో లైవ్ టెలికాస్ట్‌లను వీక్షించారు. ఏమైనా సరే, ఈసారి కప్ గెలవాలన్న పట్టుదల, పోరాటపటిమ జట్టులో కలిసికట్టుగా ఎలా ప్రదర్శితమైందో అభిమానుల్లోనూ అంతే ఉద్విగ్నం. గువహతిలో ప్రారంభమై ఇండోర్, విశాఖపట్నం, కొలంబో మీదుగా నవీ ముంబయికి సాగిన ప్రయాణం– మధ్యలో మ్యాచ్‌ల వర్షార్పణాలు మూడు మ్యాచ్‌ల వరుస ఓటములతో ఎక్కడైనా ఆగిపోయి ఉండవచ్చు. కానీ మన క్రీడామణులు చావో–రేవో అని సంకల్పం పూని ఉంటారు. చివరి రెండు మ్యాచ్‌లు అద్భుతం. బంగ్లాదేశ్‌తో ఆఖరి లీగ్ మ్యాచ్ వర్షం అడ్డుపడినా రన్ రేట్‌తో భారత్ సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. అయితే ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ నెగ్గటం కొండను ఢీకొనడమే! ఆస్ట్రేలియా 7సార్లు ఛాంపియన్, 1 టోర్నీ ఫేవరెట్. సమయం రానే వచ్చింది. ఆస్ట్రేలియా 338 పరుగులు చేసింది. మహా కష్టసాధ్యమైన చేజింగ్. జెమీమా, స్మృతి మంధన భాగస్వామ్యం ప్రాణం పోసింది. భారత్ ఆస్ట్రేలియాకు పెద్ద షాక్ ఇచ్చింది. రెండో సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి దక్షిణాఫ్రికా భారత్‌తో పోటీ ఖాయం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ చేజారుతుందేమోనని సంకోశం తలెత్తిన సమయంలో మ్యాచ్‌ను షఫాలీ వర్మ, దీప్తి శర్మ బ్యాట్, బంతి రెండింటితో రాణించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. టోర్నీ ప్రారంభంలో 20 లక్షల అభిమానులతో ప్రారంభమైన భారత్ మ్యాచ్‌ల వీక్షణం ఫైనల్‌కు 30 కోట్లు మించింది. అంటే పురుషుల క్రికెట్ మ్యాచ్‌కు ఏమాత్రం తీసిపోని ఆదరణ ఇది. పురుష క్రికెట్ స్టార్లను దేవుళ్ళుగా ఆరాధించే దేశంలో ఇప్పుడు కొందరు మహిళా క్రికెటర్లు కూడా స్టార్ట్ స్టేటస్ పొందారు. ఇది మహిళ క్రికెట్‌కు మహర్దశ. 2005, 2017లలో మిథాలీరాజ్ టీం గట్టిగా పోరాడినా గమ్యం చేరలేకపోయింది.

1983లో 'కపిల్ డెవిల్స్' అనూహ్యంగా వెస్టిండీస్ హ్యాట్రిక్ కలను కల్లలు చేసి తొలి ప్రపంచకప్‌ను సాధించిన తదుపరి పురుషుల క్రికెట్ సంస్థాగతంగా, క్రీడాపరంగా, అభిమానులపరంగా ఎంతో ప్రోత్సాహం పొందింది. ఆర్థికంగా క్రీడాకారులకు ప్రోత్సాహం పెరగడంతో పాటు రెండు దశాబ్దాలుగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ అతిపెద్ద వినోద క్రీడగా అభివృద్ధి చెందింది. మహిళా క్రికెట్ నిరాదరణకు లోనై క్రీడాకారిణుల ఆసక్తితోనే బ్రతుకుతూ వచ్చింది. బిసిసిఐ చాలా ఆలస్యంగానైనా మేల్కొని కొద్ది సంవత్సరాల క్రితం మహిళ క్రికెటర్ల పారితోషకాన్ని పురుషులతో సమానంగా పెంచింది. మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభించింది. పురుషుల పోటీల వలె వయస్సు పరిమితి పోటీలు, రంజీ, దిలీప్ ట్రోఫీ లాంటి పోటీలు ప్రారంభిస్తే మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తారు. ప్రస్తుత వరల్డ్ కప్ టీంలో మన కడప అమ్మాయి శ్రీచరణి స్పిన్ బౌలర్‌గా పరిపక్వత ప్రదర్శించారు. 1983 అనంతరం వలే ఇప్పుడు మహిళ క్రికెట్‌లో ఎన్నో మార్పులు ఆశిస్తున్నామని, బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పడం స్వాగతించదగింది.

అయితే మహిళా క్రికెటర్లు రాణించేందుకు పురుష క్రికెటర్ల అనుభవం, సహకారం అవసరమే. కానీ అన్ని రాష్ట్ర క్రికెట్ కమిటీల్లో విధిగా మహిళ క్రికెటర్లు ఉండడం తప్పనిసరి అవసరం. నిబంధనావళి సవరించి రిజర్వేషన్ పద్ధతినైనా ప్రవేశపెట్టాలి. మహిళల సమస్యలను మహిళా అడ్మినిస్ట్రేటర్లే అర్థం చేసుకోగలుగుతారు. వివిధ స్థాయి టోర్నమెంట్‌లకు ప్రైజ్‌మనీ కూడా పురుష ఈవెంట్‌లతో సమం చేసినప్పుడే వివక్ష అంతమవుతుంది. బాలికలు కూడా విరివిగా క్రికెట్ క్రీడ వైపు ఆకర్షితులవుతారు. అయితే క్రీడాభిమానులు, స్పాన్సర్లు, అడ్వర్టైజర్లు పురుష క్రీడపైనే డబ్బు కుమ్మరిస్తున్నందున, ధనరాశులతో మూలుగుతున్న బిసిసిఐ తమ ఆదాయంలో కనీసం 20శాతం ఇతర క్రీడలపై విధిగా వెచ్చించేటట్లు ప్రభుత్వం నిబంధనపూర్వకంగా ఏర్పాటు చేస్తే అన్ని రకాల క్రీడల్లో – అంతర్జాతీయంగా త్రివర్ణ పతాకం రెపరెపలాడే అవకాశం కలుగుతుంది.

# వేతనాలు–కనీస వేతనాలు–ఒక పరిశీలన



వి.యస్.బోస్
ఎఐటియుసి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి
9391356527

భారతదేశంలోని కార్మికులు అనేక పోరాటాలు ద్వారా సాధించుకున్న అనేక చట్టాలలో కనీస వేతనాల చట్టం 1948 ఒకటి. కార్మికునికి ఉత్తమ జీవన ప్రమాణాలు కల్పించదగిన "ఉపాధి" ఇవ్వటం రాజ్యాంగం నిర్దేశించింది. కార్మికులకు శ్రమతో పాటు విరామం, వినోదం, సామాజిక జీవనం కల్పించటం కూడా ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం. శ్రమజీవులను సంపన్నులైన పారిశ్రామిక వర్గాలు తమ ఆర్థిక ప్రయోజనాల కొరకు అన్యాయం చేయకుండా నిరోధించటం ఈ చట్టం యొక్క ముఖ్య అంశం. షెడ్యూల్‌లో చేర్చిన పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించి అమలు చేయవల్సిన బాధ్యత ప్రభుత్వాలది. షెడ్యూల్ పరిశ్రమలంటే ప్రభుత్వాలు గుర్తించిన పరిశ్రమలు. కానీ కొత్తగా వచ్చిన ఐ.టి, సర్వీస్ రంగంలోని అనేక పరిశ్రమలు షెడ్యూల్ పరిశ్రమలను నేటి వరకు ప్రకటించలేదు. చట్ట ప్రకారం గతంలో ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి తర్వాత కాలంలో ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాలు సవరించి అమలు చేయటం ఆనవాయితీగా ఉన్నది. కానీ నేడు అనేక రాష్ట్రాలలో 15 సంవత్సరాలు దాటిపోయిన కనీస వేతనాలు సవరణ జరగలేదు. దీనితో కనీస వేతనాల రంగంలో పనిచేసే కార్మికులంతా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. కనీస వేతనాలు అమలు చేసే షెడ్యూల్ పరిశ్రమలలో కొన్నింటిలో డి.ఏ (కరువు భత్యం) అమలు చేయటం మిగిలిన వాటిలో డి.ఏ అమలు చేయకపోవటంతో కార్మికులు వివక్షకు, జీతాల వ్యత్యాసాలకు గురవుతున్నారు. అంటే డి.ఏ అమల్లోలేని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు గత 15 సంవత్సరాల నుంచి ఒకేరకమైన జీతాలు పొందుతున్నారన్నది వాస్తవిక సత్యం. ఈ 15 సంవత్సరాలలో మార్కెట్‌లో పెరిగిన ధరలకు కార్మికులు పొందుతున్న జీతాలకు ఎలాంటి పొందిక లేక కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అనేక సంస్థలలో, పరిశ్రమలలో కార్మికులను కాంట్రాక్ట్ విధానంలో, ఔట్‌సోర్సింగ్ విధానంలో, తదితర విధానాలతో పనిలోకి తీసుకుంటున్నారు. వీరు పొందే జీతాలకు ఒక విధానం లేకుండా యాజమాన్యాల లేక దళారుల (కాంట్రాక్టర్లు) దయా దాక్షిణ్యాలపై వీరి ఉపాధి, జీతాలు ఆధారపడటం శోచనీయమైన పరిస్థితి. ఇలాంటి పరిస్థితిని నియంత్రించి న్యాయం చేసే వ్యవస్థ లేదు. వీరందరు సమక్యమై యూనియన్ పెట్టుకునే హక్కును కార్మిక చట్టాల మార్పు ద్వారా ప్రస్తుతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరించి వేయటం జరిగింది. కాంట్రాక్ట్ కార్మికులు, ఏజెన్సీ కార్మికులు, డైలీ వేజ్ కార్మికులు అనే వివిధ రకాల పేర్లతో వారిని సంఘటితం కాకుండా చేయటమే పారిశ్రామికవేత్తల ఉద్దేశం. పారిశ్రామిక వేత్తల ఉద్దేశానికి ప్రభుత్వం వంతపాడుతూ చట్టాలను వారికి అనుకూలంగా మార్చటం నేటి పరిస్థితి.

దేశంలోని ఒకే ప్రాంతంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు పొందే వేతనంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చెల్లించే వేతనంలో వ్యత్యాసం ఉండటం న్యాయసమ్మతం కాదు. ఈ విధానం దేశంలోని అన్యాయమైన పరిస్థితులకు అద్దం పడుతుంది. ఈ పరిస్థితులు చూస్తే ఒకే దేశం ఒకే విధానం అని పదే పదే వల్లించే మోదీ ప్రభుత్వానికి నీతి లేదనేది అర్థమవుతుంది. మన



రాజ్యాంగంలో నిర్వచించినట్లు మన సమాజాన్ని సంక్షేమ రాజ్యంగా నడిపించాలి. కానీ దానికి విరుద్ధంగా కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేయటం మోదీ ప్రభుత్వం కార్యక్రమంగా ఉన్నది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేరు వేరుగా తమ ఉద్యోగుల వేతనాలు సవరించటానికి వేతన కమిషన్లు ఏర్పాటు చేస్తున్నాయి. వారి సిఫారసుల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఉద్యోగుల జీతభత్యాలను సవరించి అమలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వేతన కమీషన్ల సిఫార్సులను పరిశీలిస్తే ఇద్దరి సిఫార్సుల్లో వ్యత్యాసం ఉన్నట్లు అర్థమవుతుంది. ఒకే ప్రాంతంలో నివసించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవనవ్యయం ఆ ప్రాంత ధరలు, ఇతర అంశాలు ఒకేరకంగా ఉంటాయన్నది అందరికి తెలిసిన విషయమే. అలాంటప్పుడు ఒకే కమిషన్ అది కూడా కేంద్ర వేతన కమీషన్ సిఫార్సులను తీసుకొని దేశమంతా అమలు చేయటమే సరైన విధానం. ఇదే క్రమంలో సంస్థలలో, పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు/ఉద్యోగస్తులకు కేంద్ర వేతన కమిషన్ సిఫార్సు చేసిన వేతనాలనే అమలు చేస్తే సరిపోతుంది. ఇదే సూత్రాన్ని కాంట్రాక్ట్, ఇతర కార్మికులకు కూడా వర్తింపచేయాలి. దీని మూలంగా అనేక కమిషన్లు, కాలయాపన, వ్యత్యాసాలు, అన్యాయాలను తొలగించటానికి అవకాశం ఏర్పడుతుంది.

కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల నుండి ఎన్నికైన ఎంపీలకు, రాజ్యసభ సభ్యులకు, ఇతరులకు ఒకేరకమైన జీతాలు చెల్లిస్తున్నప్పుడు ఒకే కమిషన్ సిఫార్సులను కేంద్ర/రాష్ట్ర ఉద్యోగస్తులకు అమలు చేయటంలో భిన్నాభిప్రాయం ఉండవల్సిన అవసరం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా నాయకులకు ఎలాంటి వేతన కమిషన్ లేకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల స్థితిగతులను పరిగణలోకి తీసుకోకుండా వారి జీతాలను వారే పెంచుకోవటం ప్రజాస్వామ్యం విరుద్ధమైన చర్యే గదా?

కార్మికులకు/ఉద్యోగస్తులకు జీతాలు పెంచమని అడిగితే మీనమేషాలు లెక్కపెడుతూ కాలయాపన కొరకు కమీషన్లు ఏర్పాటు చేసే ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలకు ట్యాక్సులు తగ్గించాలన్న, బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలన్నా ఆగమేఘాల మీద నిర్ణయాలు చేయటం మూలంగా మన ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రభుత్వాలుగా గుర్తింపు పొందుతున్నాయి. వేతనాల పెంపులో సమాజానికి జరిగే లాభాన్ని ప్రభుత్వాలు గుర్తించకపోవటం లేక గుర్తించినా కావాలని మరుగునపర్చటం నేటి రాజకీయ నాటకంలో భాగంగా ఉన్నది. కార్పొరేట్/పారిశ్రామికవేత్తల ఆదాయం పెరిగితే అది సమాజంలో నల్లధనం సృష్టికి మార్గంగా ఉంటుంది. అదే కార్మికులు/ఉద్యోగస్తుల జీతాలు పెరిగితే మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరిగి మార్కెట్ వ్యవస్థ గట్టిపడుతుంది. వీరు నల్లధనాన్ని సృష్టించే అవకాశం లేకపోగా కొత్త మార్కెట్లను సృష్టిస్తారు. అదీకాక తమ ఇళ్ళను తామే నిర్మించుకొని, తమ పిల్లలను తామే చదువించుకొని ప్రభుత్వాలపై ఉన్న సామాజిక భాధ్యతను కొంతవరకు వారు కూడా పంచుకుంటారు. ప్రతిసారి నల్లధనానికి వ్యతిరేకంగా ప్రగల్భాలు పలికే మోదీ ప్రభుత్వం నల్లధనం సృష్టికర్తలకు సహాయపడటం ఎలాంటి నీతి అనేది మనం అర్థం చేసుకోవాలి. ఒకేదేశం ఒకే విధానం అని నినదించే మోదీకి నిజాయితీ ఉంటే దేశంలోని ఉద్యోగస్తులకు/కార్మికులకు ఒకే వేతనం అమలు చేస్తేనే ఆ నినాదంలో వాస్తవం ఉంటుంది. లేకపోతే ఆ నినాదం మోసపూరితమవుతుంది.

ఒకేరకమైన పరిశ్రమలో పనిచేస్తున్న ప్రభుత్వరంగ కార్మికులకు, ప్రైవేటురంగ కార్మికులకు ఒకేరకమైన వేతనం చెల్లించకపోవటం సరైన విధానం కాదు. అంటే ఉదా॥ డిఫెన్స్ రంగ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రైవేటురంగ కార్మికులకు అదే రకమైన డిఫెన్స్ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రభుత్వ రంగ కార్మికులకన్నా అతి తక్కువ వేతనం చెల్లించటం దుర్మార్గం. దీని మూలంగా తక్కువ ధరలతో ఉత్పత్తులు చేసి ప్రభుత్వరంగ సంస్థలకు సవాలుగా నిలబడి ఆ సంస్థలు ఖాయిలాపడటానికి కారణం అవుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థగానీ ప్రైవేటు రంగ సంస్థగానీ ఆర్డర్లు పొందేది ప్రభుత్వాల నుండే వాటి కోసం డబ్బులు చెల్లించేది ప్రభుత్వాలే. వాటిని ఉపయోగించేది కూడా ప్రభుత్వాలే అయినప్పుడు ప్రైవేటు, ప్రభుత్వరంగ కార్మికులు, వేతనాల్లో వ్యత్యాసాలను ప్రభుత్వం ఎందుకు తొలగించటం లేదు. అలాంటి వ్యత్యాసాలను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

కేంద్ర ప్రభుత్వంపై కార్పొరేట్ శక్తుల ప్రభావం లేనప్పుడు వారి జీతాలపై నియంత్రణ చేస్తూ చట్టాలు ఉండేవి. క్రమంగా కార్పొరేట్ శక్తుల ప్రభావం ప్రభుత్వాలపై పెరిగటంతో వారికి అనుకూలంగా చట్టాలు మార్చటంతో వారి జీతాలపై నియంత్రణ తొలగి కోట్లలో జీతాలు పొందటం జరుగుతుంది. దేశంలోని ప్రథమ పౌరుడైన అధ్యక్షుల వారికన్న ఈ కార్పొరేట్ అధికారులు జీతాలు అనేకరేట్లు ఎక్కువ పొందటంతో మన దేశంలో అధ్యక్షులకు ఇస్తున్న గౌరవ స్థానం ఏమిటో ప్రభుత్వానికే తెలియాలి. అలాగే ఒకప్పుడు మంత్రుల జీతాలు కూడా ఐఎఎస్/ఐపిఎస్ ఆఫీసర్లకన్నా తక్కువ ఉండేది. మంత్రులు ఈ పరిస్థితిని అవమానంగా భావించి వారి జీతాలను ఐఎఎస్ ఆఫీసర్ల కన్నా ఎక్కువగా తమంత తామే పెంచుకున్నారు. ఇది మనదేశంలోని ప్రజాస్వామ్యం. ఎంపిలు, ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావటానికి ఎలాంటి విద్యార్హతలు లేవు. కానీ ఐఎఎస్/ఐపిఎస్ లాంటి ఉద్యోగాలు పొందాలంటే అత్యుత్తమైన విద్యార్హతలు అవసరం. అయినా మంత్రుల జీతాలు ఎక్కువగా తీసుకోవటానికే మొగ్గుచూపారు. అదే విధంగా ప్రజాప్రతినిధులు ప్రమాణం చేసిన తర్వాత ఒక్కరోజు ఆ పదవిలో ఉన్నా జీవితకాలం వారి జీతంలో సగం పెన్షన్‌గా పొందుతున్నారు. ఇలాంటి సౌకర్యం మన దేశంలో ఉద్యోగస్తులకు గానీ, కార్మికులకు గానీ లేకపోవటం రాజకీయ నాయకుల స్వార్థాన్ని బహిర్గతం చేస్తున్నది.

ఒకేరకమైన పనికి ఒకేరకమైన జీతాలు చెల్లించాలని మన దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు పదేపదే చెపుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదు. 1970 కాంట్రాక్ట్ చట్టంలో, న్యాయస్థానాల తీర్పులో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పినప్పటికీ అమలు చేయకపోవటం కార్మికులపై ప్రభుత్వం చూపుతున్న సవతి తల్లి ప్రేమ అర్థమవుతుంది. మన దేశంలో నడుస్తున్నది ప్రజాస్వామ్య ప్రభుత్వమా! లేక కార్పొరేట్ స్వామ్య ప్రభుత్వమా! శ్రమజీవులు అర్థం చేసుకోవాలి. కార్మికుల అనుకూలమైనటువంటి తీర్పులను చట్టాలను అమలు చేయకుండా, కార్పొరేట్ / పారిశ్రామిక వేత్తలు కోరుకున్న విధంగా కార్మిక చట్టాలను, విధానాలను మార్చి అమలు చేస్తున్న ప్రభుత్వాలను అర్థం చేసుకోవటానికి ఎలాంటి పరిశోధనలు అవసరం లేదు. ప్రజాస్వామ్య హక్కులను హరించటం నియంతృత్వానికి తొలిమెట్టు. అలాంటి నియంతృత్వాన్ని ఆదిలోనే తొలగించటం సమాజానికి శ్రేయస్కరం. నియంతృత్వాన్ని తొలగించాల్సిన అవసరాన్ని శ్రమజీవులు అర్థం చేసుకొని సమైఖ్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

# 'ధన్ ధాన్య కృషి యోజన'తో వికసిత్ భారత్ సాధ్యమా?



వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో దేశంలో వెనుకబడిన 100 జిల్లాల్లో పంటల ఉత్పత్తిని పెంచడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సాహించడం, సాగునీరు సదుపాయం, పంటల నిల్వ సామర్థ్యం మెరుగుపరచడం, రైతులకు రుణాలు ఇవ్వడం ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన (పిఎండిడికెవై), తృణధాన్యాల మిషన్‌కి శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబర్ 11 భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ఐ) పూస క్యాంపస్‌లో ప్రారంభించారు. అన్నదాతలకు అభయం అంటూ దిగుమతులు తగ్గించుకోవాలి. ఎగుమతులు పెంచుకోవాలి అంటూ వికసిత్ భారత సాధనలో రైతన్నలదే కీలక పాత్ర, ప్రజలకు ప్రోటీన్ భద్రత కోసం తృణ ధాన్యాల సాగు పెంచాలి అని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 35440 కోట్ల రూపాయలు 100 జిల్లాల్లో ఖర్చు చేస్తామని కోట్లాదిమంది రైతులకు లబ్ధి చేకూరుతుందని వారి జీవితాల్లో మార్పులు వస్తాయని 2014 నుంచి తన నాయకత్వంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం విత్తనం నుంచి మార్కెట్ వరకు అనేక సంస్కరణలు తెచ్చింది అని అన్నారు.

ఈ సంస్కరణలు రైతులకు ఏ మేరకు లబ్ధి చేకూర్చాయి అనేది ప్రశ్న. ఈ రెండు పథకాలను రాబోయే రబీ సీజన్ నుంచి 2030–31 దాకా ఆరు సంవత్సరాలు అమలు చేస్తారు. ధన్ ధాన్య కృషి యోజన (పిఎండిడికెవై) కేంద్ర బడ్జెట్‌లోనే ప్రస్తావించినా కార్యరూపంలోకి ఇప్పుడు తెచ్చారు. ఇది కొత్త సీసాలో పాత సారా పోసి ఊరించేది లా ఉంది, కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖ పరిధిలోని 36 పథకాలను సమ్మిళితం చేసి పీఎండీడీకేవైని అమలు చేస్తున్నారు. ప్రధాన మంత్రి కృషి సించాయా యోజన (pmksy), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రాఫ్తార్ (rkvy), సాయిల్ హెల్త్ కార్డ్ పథకం 2015, జాతీయ సుస్థిర వ్యవసాయ మిషన్ ప్రధానమంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన (pmkmy) లాంటి వివిధ పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసే నిధులు సమ్మిళితం చేసి పిఎండిడికెవై క్రింద 100 జిల్లాల్లో వినియోగిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, జనగాం నాలుగు జిల్లాలకి చోటు కల్పించారు. ఈ జిల్లాల్లో 8.75లక్షల మంది రైతులు, 17.73 లక్షల ఎకరాల సాగు భూములు ఉన్నాయి.

కేంద్ర పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అనుసంధానం చేసి ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంలో నిర్వహిస్తారు. పిఎండిడికెవై పర్యవేక్షణకు కేంద్రం ఎంపిక చేసిన జిల్లాలకు ఐఏఎస్ ఆఫీసర్లను నోడల్ అధికారులుగా నియమించింది. జిల్లా, రాష్ట్ర, కేంద్రస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో ముఖ్యకార్యదర్శి పథకం అమలు పర్యవేక్షిస్తారు.

నేల నీటి సంరక్షణ సహజ సేంద్రియ సాగు విస్తీర్ణతో పాటు మొత్తంగా వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో స్వయం సమృద్ధికి తగిన చర్యలు చేపడుతారు, పండ్ల తోటలు, మత్స్య సం పద, తేనెటీగల పెంపకం, పశుపోషణంతో పాటు వాటి మార్కెట్‌పై దృష్టి సాధించటం పథకం ఉద్దేశం. వీటితోపాటు సాగుకు మౌలిక వసతులు, తక్కువ ఉత్పాదకత, నీటి కొరత విచ్ఛిన్నమైన భూమి కమతాలు, పంట కోత తర్వాత నష్టాలు మరియు మార్కెట్ అసమర్థతలు, కౌలు రైతులు వంటి నిర్మాణాత్మక సవాళ్లను పరిష్కరించటంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. అలాకాకుండా ప్రైవేటు సెక్టార్ వందల కోట్ల రూపాయల సబ్సిడీ పొంది వ్యవసాయ ఉత్పత్తుల నిల్వలపై ఆధిపత్యం సాధించి లాభాలు పొందుతున్నారు. దేశీయ అవసరాలు, ఎగుమతుల అవకాశాలు అనుగుణంగా పంటల ప్రణాళికలను శాస్త్రీయంగా రూపొందించాలి. రైతులను ఆదిశగా నడిపించే వ్యవస్థ లేకుండా చేటు చేస్తుంది. 2023–24లో దేశవ్యాప్తంగా 3323 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయితే నూనె గింజల దిగుబడులు 397 లక్షల టన్నులు, ఇక అపరాలైతే 242.46 లక్షల టన్నులకి పరిమితం. ఈ నేపథ్యంలో దేశీ అవసరాల కోసం 2024–25లో రూ.48 వేలకోట్ల విలువైన 73 లక్షల టన్నుల పప్పు ధాన్యాలను భారత్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే దిగుమతులు 54% అధికమయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలో పప్పు ధాన్యాల సాగు గత సంవత్సరం 8,25,237 ఎకరాలు ఈ సీజన్‌లో 5,83,736 ఎకరాలు గతం కంటే 27.5 శాతం తక్కువ. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి. తెగుళ్ళు వైరస్‌లు సాగు కష్టాలు, ధరలు తగ్గుదల, నిల్వ వసతులు లేకపోవడం, మద్దతు ధరలు పొందలేకపోవటం, కోతులు సమస్య, పంట కోత సమయంలో వర్షాలు మూలంగా కంది, పెసలు, మినుములు, ఉలవలు, అలసందలు లాంటి పంటల సాగు తగ్గింది. 2030 నాటికి దేశంలో 35 లక్షల హెక్టార్లలో తృణధాన్యాలు సాగు లక్ష్యంతో తృణధాన్యాలు మిషన్ ప్రకటించారు. ఈ లక్ష్యం చేరాలంటే మద్దతు ధరలను రైతు పొందే లాగా ప్రభుత్వం భాధ్యత వహించాలి. ఉదాహరణకు: కందికి క్వింటాల్‌కు రూ.8000, పెసలు క్వింటాల్‌కు రూ.8768, మినుములు క్వింటాల్‌కు రూ. 7400 మద్దతు ధరలను కేంద్రం ప్రకటించిన దాదాపు 80 శాతం మందికి దక్కడం లేదు. కొన్ని సందర్భాల్లో మద్దతు ధరలో సగం ధర కూడా రైతులు పొందలేకపోతున్నారు. వరి, గోధుమ, పత్తి సాగు విస్తీర్ణం పెరిగిన వాతావరణ మార్పులు, బీటీ విత్తనాలు మూలంగా ఉత్పాదకత గణనీయంగా తగ్గుతుంది. ప్రపంచ సగటు ఎకరాకు 360 కిలోలతో పోలిస్తే ఇండియాలో అపరాల ఉత్పాదకత ఎకరాకు 264 కిలోలు హెక్టర్‌కు 600 కిలోలు దీనిని 1130 కిలోలు ఉత్పాదక సామర్థ్యం పెంపుదలకు తృణధాన్యాలు మిషన్ లక్ష్యం. అన్ని పంటల్లో దాదాపు ఇదే పరిస్థితి. దేశంలో పత్తి సాగు విస్తీర్ణం పెరిగిన ఉత్పత్తి 390 మిలియన్ బేల్ (బేల్ అంటే 175కిలోలు) నుంచి 290 మిలియన్ బేల్‌కు తగ్గింది. అమెరికా నుంచి 40 లక్షల బేల్ పత్తి దిగుమతి సుంకం లేకుండా చేస్తుంది. అమెరికా తర్వాత అత్యధికంగా 40 కోట్ల ఎకరాల సాగు యోగ్య భూములకు నెలవు భారతావని. మనతో పోలిస్తే తక్కువ విస్తీర్ణంలో పంట నేలలు ఉన్న చైనా తన ఆహార అవసరాల్లో 95 శాతాన్ని సొంతంగానే తీర్చుకుంటుంది. దీనికి భిన్నంగా వంట నూనెలు, పప్పుధాన్యాల దిగుమతులు కోసమే ఇండియా నిరుడు రెండు లక్షల కోట్ల రూపాయలకుపైగా వెచ్చించింది. అంతర్జాతీయ మార్కెట్లు తలుపులు తట్టాలని విదేశాల్లోని డిమాండ్‌ను తీర్చే పంటలు పండిస్తే మనకు లాభదాయకమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశీ అవసరాలను ప్రథమ ప్రాధాన్యత ఇవ్వకుండా లాభాల పేరుతో అంతర్జాతీయ మార్కెట్ ఎండమావులు వెంట రైతులు పరిగెడితే ఆహార భద్రత సమస్యలతోపాటు ఆత్మహత్యలు పెరుగుతాయి. వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నాయి. ఇవి దేశ జనాభాలో 52 శాతం మందికి జీవనోపాధికి ప్రాథమిక వనరుగా పనిచేస్తున్నాయి. మరియు అధిక జిడిపికి దోహదం చేస్తున్నాయి. ఆహార భద్రతను అందించడంలో ఉపాధి కల్పించడంలో మరియు గ్రామీణ అభివృద్ధిని పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా భారతదేశ వ్యవసాయ సమాజంలో ఎక్కువమంది ఉన్న చిన్న సేద్య రంగంలో, సన్నకారు రైతులలో ఈ రంగం యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తించి భారత ప్రభుత్వం వ్యవసాయ పద్ధతులను ఆధునికరించటం ఉత్పాదన మెరుగుపరచడం స్థిరత్వాన్ని నిర్ధారించటం, రైతు ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా ప్రణాళికలు అమలు ఉండాలి. వ్యవసాయ రంగంలో క్షీణత వ్యవసాయానికి సంబంధించింది కాదు. ఇది పెద్ద సామాజిక, ఆర్థిక సంక్షోభాన్ని ప్రతిబింబిస్తుంది. ఒకప్పుడు గౌరవానికి, స్వావలంబనకు ప్రతీకగా నిలిచిన రైతు ఇప్పుడు మనగడ కోసం కష్టపడుతున్నాడు. భారతీయ వ్యవసాయాన్ని కార్పొరేట్ ఐజాక్ చేయడం వల్ల వ్యవసాయ సంక్షోభం తలెత్తింది. పెద్ద సంస్థలు వ్యవసాయ వనరులు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. చిన్న రైతులను శక్తి లేకుండా చేశాయి. ఇది అసమానతలకు దారి తీసింది. ఈ సంక్షోభం కేవలం ఆర్థికపరమైనది కాదు అది మానవజాతికి తీరని నష్టం. రైతు ఆత్మహత్యల సంక్షోభం కాదు అత్యంత దారుణంగా వ్యవస్థల విఫలమైతే ఎదురైన ఫలితం.

సేద్య రంగంలో నిజమైన ఆత్మ నిర్భరత సాధించాలంటే అధిక దిగుబడి నిచ్చే వంగడాలు ,ఆధునిక సేద్య పద్ధతులపై పరిశోధనలకు ప్రభుత్వాలు తగినంత ప్రోత్సాహం అందించాలి. చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ధరకు యాంత్రీకరణ అందుబాటులో ఉంచాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించాలి. 100 జిల్లాలతోపాటు దేశంలో ఉన్న 806 జిల్లాల్లో వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలకు ప్రణాళికలు అమలు చేయాలి. కేంద్ర ప్రభు త్వం ప్రకటిస్తున్న 22 రకాల వ్యవసాయ ఉత్పత్తులకే కాకుండా అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు నిర్ణయం చేయాలి. అది కూడా వాస్తవ సాగు ఖర్చులు మొత్తం పరిగణనలోకి తీసుకొని స్వామినాథన్ కమిషన్ నివేదిక చెప్పినట్లు సమగ్ర ఉత్పత్తి ఖర్చుకి అదనంగా 50% శాతం కలిపి మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించినప్పుడు సాగు రంగంలో వికసిత్ భారత్ సాధ్యం.

– బొంతు రాంబాబు
9490098205

# సునామీ విపత్తులు– మానవ భద్రత



సునామీ అనేది సముద్రంలో జరిగే అత్యంత శక్తివంతమైన సహజ విపత్తు. ఇది సాధారణ అలలతో పోలిస్తే వేరు. దీని మూలం సముద్రం కింద జరిగే భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటాలు. సునామీ అనే పదం జపనీస్ భాషలో త్సు (తీరప్రాంతం), నామి (అల) అనే పదాల కలయిక. ఒక సముద్ర భూ ఖండం మరొక భూ ఖండం కిందకి జారినప్పుడు నీటి నిలువు భాగం కదిలి, సముద్ర జలాన్ని అకస్మాత్తుగా ఎత్తి లేపుతుంది. ఆ కదలికే సునామీకి కారణమవుతుంది. ఈ ప్రక్రియలో విడుదలయ్యే శక్తి అణుబాంబులకు సమానంగా ఉంటుంది. 2004లో ఇండియన్ ఓషన్లో సంభవించిన సునామీ శక్తి యొక్క ఘోర రూపంలో 14 దేశాల్లో 2 లక్షల ప్రాణనష్టం, వేల కోట్ల ఆస్తినష్టం జరిగింది.

## విధ్వంస తీవ్రత

సునామీ అలల తీవ్రత వాటి వేగం, అలల ద్హైర్ఘ్యం , నీటి పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. సముద్ర మధ్యలో అలల ఎత్తు కేవలం ఒక మీటర్ వరకు ఉండవచ్చు, కానీ అవి గంటకు 800–900 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. నీటి లోతు తగ్గే కొద్దీ అల వేగం తగ్గి, ఎత్తు పెరుగుతుంది. ఈ ప్రక్రియను షోలింగ్ అంటారు. తీరానికి చేరుకునే సమయానికి అలల ఎత్తు 10 నుండి 30 మీటర్ల వరకు పెరిగి విపరీత విధ్వంసం సృష్టిస్తుంది. సునామీ సమయంలో మొదట సముద్రం వెనక్కి లాగబడినట్లు కనిపించడం అత్యంత ప్రమాద సంకేతం. ఈ శాస్త్రీయ సాంకేతికత మనకు చెప్పే ఒక ముఖ్యమైన పాఠం ఏమిటంటే సముద్రం ప్రశాంతంగా ఉన్నప్పటికీ, దాని గర్భంలో విపరీతమైన శక్తి దాగి ఉంటుంది.

## మానవ -పర్యావరణంపై ప్రభావం

సునామీ ప్రభావం కేవలం నీటి ప్రవాహం కాదు, అది జీవనశైలిని మారుస్తుంది. తీరప్రాంత గ్రామాలు పూర్తిగా మునిగిపోవడం, మౌలిక సదుపాయాల ధ్వంసం, తాగునీటి వనరుల కలుషితం, పర్యావరణ విధ్వంసం వంటి పరిణామాలు సంభవిస్తాయి. 2011లో జపాన్‌లో సంభవించిన టోహోకు సునామీ అణు ప్లాంట్ ప్రమాదానికి దారితీసింది. ఈ ఘటనలు మనకు ప్రకృతి పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తాయి. మ్యాంగ్రోవ్ అడవులు, పల్లపు ప్రాంతాలు, ఇసుక గుట్టలు సహజ రక్షణగా పనిచేస్తాయి. పర్యావరణ పరిరక్షణ, ప్రజల అవగాహన కలిస్తేనే సునామీ వంటి విపత్తులను బలంగా ఎదుర్కొనగలుగుతాము.

## హెచ్చరిక వ్యవస్థలు

సునామీ ముందు హెచ్చరిక వ్యవస్థలు ప్రపంచ వ్యాప్తంగా మానవ భద్రతలో విప్లవాత్మక మార్పు తెచ్చాయి. జపాన్‌లోని JAlert వ్యవస్థ భూకంపం సంభవించిన సెకన్లలోనే ప్రజల మొబైల్ ఫోన్లకు మరియు టెలివిజన్లకు హెచ్చరికలు పంపుతుంది. అమెరికాలోని పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ (PTWC) పసిఫిక్, ఇండియన్, అట్లాంటిక్ మహా సముద్రాలను పర్యవేక్షిస్తుంది. ఇండోనేషియాలోని INATEWS వైర్‌లెస్ సిగ్నల్ ఆధారంగా గ్రామాల వరకూ అలారంలు పంపుతుంది. భారత దేశంలోని INCOIS (హైదరాబాద్) ఇండియన్ ఓషన్ దేశాలన్నింటికి రియల్ టైమ్ హెచ్చరికలు అందిస్తుంది. ఈ వ్యవస్థల్లో ఉపగ్రహ డేటా, సీస్మిక్ సెన్సర్లు సమన్వయంగా పనిచేస్తూ, అలలు తీరానికి చేరుకునే ముందే హెచ్చరికలు పంపిస్తాయి. విజ్ఞానం, సాంకేతికత, అంతర్జాతీయ సహకారం కలిసి మానవ ప్రాణాలను రక్షిస్తున్నాయి.

## భవిష్యత్ ప్రణాళికలు

పాఠశాల స్థాయి నుండే సునామీ అవగాహన కార్యక్రమాలు, తీరప్రాంత డ్రిల్స్, మరియు ప్రజల్లో ముందస్తు చర్యల శిక్షణ చాలా అవసరం. ప్రభుత్వాలు కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేస్తున్నప్పటికి, ప్రజలు సహకరించకపోతే అవి ఫలించవు. భారతదేశం ప్రస్తుతం సముద్రంలో స్మార్ట్ అండర్వాటర్ కేబుల్ సెన్సర్లు ఏర్పాటు చేస్తున్నది. ఇవి సునామీని గుర్తించి 30 సెకన్లలో అలారం పంపగలవు. ప్రపంచ సునామీ దినోత్సవం మనకు ఇచ్చే స్పష్టమైన సందేశం. ప్రకృతిని గౌరవించండి, విజ్ఞానాన్ని ఉపయోగించండి. సముద్రం యొక్క శక్తి పట్ల మనం అవగాహన, అప్రమత్తతతోనే ఆస్తి, ప్రాణ, పర్యావరణ నష్టాన్ని నివారించి మానవ జాతి భద్రతను బలోపేతం చేసుకోగలము.

– వెంకటరమణ

## ఇండ్ల కేటాయింపు పట్ల హర్షం


**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయింపు పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో గతంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించినప్పుడు లబ్ధిదారులను ఎంపిక చేశారు కానీ ఇండ్ల కేటాయింపు చేయలేదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించాలని సూచించడంతో మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు అదనపు కలెక్టర్ సమక్షంలో ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా డబుల్‌బెడ్ రూం ఇంటి నెంబర్లను కేటాయించారు.
ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనబోయిన పాపయ్య, తూము సత్యనారాయణ, నరేష్, చింతల రమేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## వైరా బస్టాండ్‌లో రూ.50వేలు నగదు అపహరణ

### వరుసగా జరుగుతున్న దొంగతనాలు



**ప్రజాపక్షం/వైరా :** వైరా బస్టాండ్‌లో వరుస దొంగతనాలు కొనసాగుతూనే ఉన్నాయి. బస్టాండ్ సిసి కెమెరాలు పర్యవేక్షణ లేకపోవడం కూడా వరుస దొంగతనాలకు కారణం అవుతున్నాయి. మంగళవారం వైరా బస్టాండ్‌లో తాటిపూడి గ్రామానికి చెందిన మహిళ పర్సులో నుంచి రూ.50వేలు నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అదేవిధంగా గత వారం రోజులు క్రితం ఐదు సెల్‌ఫోన్‌లు కూడా వైరా బస్టాండ్‌లో దొంగతనానికి గురయ్యాయి. ఇలా వరుస దొంగతనాలు పదేపదే బస్టాండ్‌లో జరగడంతో పలువురిని కలవరపెడుతున్నాయి. బస్టాండ్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచితే దొంగతనాలకు, ఆకతాయిలకు అడ్డుకట్ట వేయవచ్చు అని పలువురు తెలుపుతున్నారు.



## ఫీజు బకాయిల విడుదలకు కృషి చేయండి

### విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

### ఎమ్మెల్యే డా.తెల్లంకు ఎఐఎస్ఎఫ్ వినతి పత్రం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.8500 కోట్ల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలయ్యేందుకు, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషిచేయాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ డా.తెల్లం వెంకటరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు భద్రాచలం చేరుకున్న ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రతినిధి బృందం మంగళవారం ఎంఎల్‌ఎను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా విద్యార్థులు పీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదలలో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, తద్వారా చదువులు సాగే పరిస్థితి లేకుండా పోయిందని మండిపడ్డారు. బకాయిల కోసం కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుంటే విజిలెన్స్ దాడులు నిర్వహిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో పాలకులు ఆటలాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని, ఇలాంటి చర్యలను ఎఐఎస్ఎఫ్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇచ్చిన వినతి పత్రంపై ఎంఎల్‌ఎ స్పందించారని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఇనపల్లి పవన్‌సాయి, జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు, నాయకులు రమణ, పవన్, ఉదయ్, మానస్ తదితరులు పాల్గొన్నారు.

## 15న ప్రత్యేక లోక్ అదాలత్

### న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్




**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసులు, బ్యాంకర్లు, చిట్ ఫండ్ ప్రతినిధులు తదితరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్ పట్ల గ్రామీణ ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. సమావేశంలో మొదటి అదనపు న్యాయమూర్తి ఉమాదేవి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్ధవంతంగా ఉండాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అమృత్ 2.0 పథకం కింద జిఎస్ఐ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్ధవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఇందు కోసం అవసరమైన ఖచ్చితమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు సమయానికి అందించాలని ఆయన ఆదేశించారు. మంగళవారం ఐడిఒసి కార్యాలయ సమావేశ మందిరంలో డిటిసిపి ప్రాజెకు డైరెక్టర్ అశ్విని ఆధ్వర్యంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన మొదటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రూపొందించడం, భవిష్యత్ పట్టణాభివృద్ధికి మార్గదర్శకం. అందువల్ల ప్రతి శాఖ ఖచ్చితమైన తాజా సమాచారాన్ని అందించాలని సూచించారు. రెవెన్యూశాఖ నుండి లభించే సర్వే నెంబర్లు, వాటి పరిధులు, భూమి వినియోగం వివరాలు కీలకమని, అవి మాస్టర్ ప్లాన్‌కు ఆధారంగా ఉంటాయని తెలిపారు. తాగనీటి సరఫరా అంశంపై ప్రజారోగ్య, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో సమగ్ర సమాచారం అందించాలని సూచించారు. ఆర్అండ్‌బి అధికారులు ప్రస్తుత రహదారులతో పాటు బైపాస్ రహదారుల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను సూచించాలని ఆదేశించారు.

## ఎక్సైజ్ సిఐ వేధింపులు.. మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

### నివేదిక ఆధారంగా చర్యలు : సూపరింటెండెంట్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎక్సైజ్ శాఖ సిఐ జయశ్రీ వేధింపులు తాళలేక అదేశాఖలో పనిచేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ అఖిల ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. ఈ మేరకు మంగళవారం బాధిత కానిస్టేబుల్ అఖిల కుటుంబీకులు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపడంతో విషయం వెలుగులోనికి వచ్చింది. వివరాల ప్రకారం, ఎక్సైజ్ సిఐ జయశ్రీ సిబ్బందితో దురుసుగా ప్రవరిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తారని, ఏదైనా అడిగినా, చెబుదామన్న కసురుకుంటూ చిన్నచూపు చూస్తుంటుందని తెలుస్తోంది. ఇదేక్రమంలో మంగళవారం అఖిల అనే కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవరిస్తూ కించపరిచినట్లు మాట్లాడింది. దీంతో మనస్తాపానికి గురైన అఖిల శనివారం విధులు ముగించుకున్న అనంతరం మాత్రలు మింగి ఇంటికి చేరుకుంది. ఈ క్రమంలో ఆమె ఇంటి వద్ద కళ్లు తిరిగి పడిపోవడంతో కుటుంబీకులు హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించగా మాత్రలు మింగినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో అఖిల ఆరోగ్య పరిస్థితి కాస్త కుదుటపడిన అనంతరం మంగళవారం కుటుంబీకులు అఖిలను వెంటబెట్టుకుని ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. దీంతో అక్కడే ఉన్న సిబ్బంది కూడా నిరసనలో పాల్గొని సిఐ పనితీరు, వ్యవహార శైలిపై మండిపడి విధులు బహిష్కరించారు. ఆమె తీరు అందరితోనూ ఇలానే ఉంటుందని, క్రింది స్థాయి సిబ్బందిని చాలా చులకన భావంతో చూస్తుందని సిబ్బంది చెప్పడం గమనార్హం. అఖిల, ఆమె కుటుంబ సభ్యులు, సిబ్బంది చేస్తున్న నిరసనకు కుల సంఘాలు సైతం మద్దతు ప్రకటించారు. సిబ్బంది విధులు బహిష్కరించడంతో రంగంలోనికి దిగిన ఉద్యోగ సంఘాలు చర్చలు జరుపుతున్నాయి. జరిగిన ఘటనపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్యను వివరణ కోరగా, దీనిపై విచారణ చేపట్టి నివేదిక తెప్పిస్తామని, ఆ నివేదికను కమిషనర్‌కు పంపిస్తామని చెప్పారు.

# పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం

### కలెక్టర్ జితేష్ వి పాటిల్






**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం సుజాతనగర్ జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించి సమీక్షించారు. స్వచ్ఛత క్యాంపైన్ 5.0 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పరిశుభ్రతా చర్యలగురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ప్రతీ విద్యా కార్యక్రమాన్ని పాఠశాల స్థాయి ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థుల భాగస్వామ్యంతో, తల్లిదండ్రుల సహకారంతో అమలు చేసినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి అనేది పలు అంశాలతో కూడిన సమగ్ర నిర్వహణ అని, అది కేవలం ప్రధానోపాధ్యాయులతో మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, ఇవన్నీ ప్రధానోపాధ్యాయుని దిశానిర్దేశంపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. పాఠశాల మరుగుదొడ్లు కొన్ని తాళం వేసి ఉండటాన్ని గమనించిన కలెక్టర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం అన్ని వసతులను సద్వినియోగం చేసుకోవాలని, వెంటనే మరుగుదొడ్లు తెరిచి మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని సూచించారు. తాగునీటి సదుపాయం సరిగా లేని విషయాన్ని గమనించిన కలెక్టర్ నూతన బోర్ వేసేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని మిషన్ భగీరథ ఇఇని ఆదేశించారు. విద్యార్థులకు నిరంతరం పరిశుభ్రమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పిఎం శ్రీ పాఠశాల కావడంతో ఆటస్థల అభివృద్ధి నిధులు సక్రమంగా వినియోగించి విద్యార్థుల క్రీడా ప్రతిభను పెంపొందించేలా అన్ని ఆటలకు సంబంధించిన కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీర, మానసిక దృఢత్వం పెంపొందుతుందని, క్రమశిక్షణతో పాటు సమాన భావన కూడా పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం భవిత కేంద్రాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎన్.సతీష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### జిన్నింగ్ మిల్లులు యధావిధిగా కొనసాగించాలి

జిన్నింగ్ మిల్లులు యధావిధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐడిఒసి కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యజమాన్య ప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, సిసిఐ ప్రతినిధులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 6 నుండి రాష్ట్ర వ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులు బంద్ చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్నాయని, కానీ జిల్లాలోని మిల్లులు బంద్ చేయరాదని చెప్పారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మిల్లులు నడపాలనే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎల్1,2,3 రకాల సమస్యలు లేకపోవడంతో బంద్ అవసరం ఉండదని, ఇప్పటికే జిల్లాలో రైతులు వర్షాల కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పత్తి కొనుగోలు, ప్రాసెసింగ్ ప్రక్రియలో అంతరాయం వాటిల్లకుండా అన్ని మిల్లులు నిరాటంకంగా పనిచేయాలని ఆదేశించారు.
పత్తి తేమ 12శాతానికి మించకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, దీనిపై మార్కెటింగ్ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మార్కెటింగ్ యార్డుల్లో పత్తి ఆరబెట్టేందుకు తగిన సౌకర్యాలు కల్పించి పత్తిలో తడిచేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు సమయానికి పత్తిని తీసుకురావడంతో పాటు మిల్లులు నిటాంకంగా కొనుగోలు చేయడం ద్వారా జిల్లా వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థ సజావుగా కొనసాగుతుందని ఆయన నమ్మక వ్యక్తం చేశారు.
ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి, సిసిఐ బయ్యర్లు, జిల్లా మార్కెటింగ్ కమిటీల కార్యదర్శులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## చేప పిల్లల విడుదలకు పక్కా కార్యాచరణ

### నవంబర్ ఆరు నాటికి కమిటీలను నియమించాలి

### చేప పిల్లల పంపిణీపై అదనపు కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నీటి వనరులలో చేప పిల్లల విడుదలకు సంబంధించి పక్కా కార్యాచరణ అమలు చేయాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ డా॥ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం చేప పిల్లల పంపిణీపై మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కలెక్టర్ డా॥ పి.శ్రీజ సంబంధిత మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ చేప పిల్లల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి మండలంలో ఉన్న నీటి వనరులలో చేప పిల్లల పంపిణీ విడుదల పక్కాగా జరిగేలా చూడాలన్నారు. కాలుష్యం అధికంగా ఉన్న నీటి వనరులలో, వరద అధికంగా వస్తూ ఓవర్ ఫ్లో అవుతున్న నీటి వనరులలో చేప పిల్లలను వెంటనే విడుదల చేయవద్దన్నారు.
ఖమ్మం జిల్లాలో ఉన్న 882 చెరువులలో ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 35 నుంచి 40ఎంఎం, 80 నుంచి 100ఎంఎం సైజు గల పిల్లలు నీటి వనరుల ఆధారంగా విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఎంపిడిఒ, ఇరిగేషన్ ఎఇ, మండల వ్యవసాయ అధికారి, ఫిషరీస్ కో ఆపరేటివ్, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, మత్స్యకార సంఘాల సభ్యులతో మండల స్థాయి కమిటీలు, పంచాయతీ కార్యదర్శి ఎఇఒ, ఫిషరీస్ కోఆపరేటివ్ సభ్యులతో గ్రామ కమిటీలను గురువారం నాటికి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ఉన్న నీటి వనరులలో వేసే చేప పిల్లల పంపిణీ వివరాలు టీ మత్స్య యాప్‌లో నమోదు చేయాలన్నారు. నిర్దిష్ట సంఖ్య, సైజులో చేప పిల్లలు విడుదల చేసేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలన్నారు. నీటి వనరులలో చేప పిల్లలు విడుదల చేసే సమయంలో కమిటీ సభ్యులు, మత్స్యకారులు అందుబాటులో ఉండాలన్నారు.
ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. 15 రోజుల్లో చేప పిల్లల విడుదల పూర్తయ్యేలా చూడాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు చేప పిల్లల విడుదలకు సంబంధించి నివేదిక రూపొందించాలన్నారు.
ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖాధికారి శివప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, వ్యవసాయ శాఖ ఎడిఎలు, నీటి పారుదల శాఖాధికారులు, ఎంపిడిఒలు, మత్స్యశాఖ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేయండి

### కలెక్టర్‌ను కలిసిన చైర్మన్ వీరబాబు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా కేంద్ర గ్రంథాలయాభివృద్ధితో పాటు జిల్లాలో ఉన్న పలు గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, గ్రంథాలయ కార్యదర్శి కె.కరుణకుమారి మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలో అనేక మౌలిక సదుపాయాల అవసరం ఉందని, ఆదేవిధంగా జిల్లాలో ఉన్న పలు గ్రంథాలయాల అభివృద్ధికి స్థల సేకరణ అవసరం ఉందని అన్నారు. గ్రంథాలయాలను అభివృద్ధిపర్చడం ద్వారా అనేక మంది పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి, పాఠకులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆ వినతి పత్రంలో కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించారని గ్రంథాలయాల అభివృద్ధి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసి వారిలో అఫీస్ ఇన్‌చార్జి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్ర స్థాయి పోటీలకు 'గురుదేవ్' విద్యార్థులు ఎంపిక

**పజాపక్షం/చర్ల :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో స్థానిక గురుదేవ్ విద్యాలయానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 9వ తరగతి చదువుతున్న నందగోపాల్, సుశాంత్‌లు హ్యాండ్ బాల్ పోటీల్లో తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు హెచ్.జి.వి.ప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్ ఎంవి.సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాస్ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు కృషిచేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

## వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా...

### విద్యార్థుల హాజరు శాతంపై దృష్టిపెట్టాలి

### ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ డా.పి.శ్రీజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు రాబోయే పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేవిధంగా పనిచేయాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల పనితీరుపై ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శ్రీజ సంబంధిత శాఖల అధికారులు, కెజిబివి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్స్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్‌లు, ఎంఇఒలతో మంగళవారం సమీక్షించారు. ఎఫ్ఆర్ఎస్, అపార్, ఆధార్ కార్డు, పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత తదితర అంశాలపై ఆమె సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు చాలా కీలకమన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల నుంచి పదవ తరగతి, ఇంటర్ చదివే పిల్లలు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వారానికి రెండు సార్లు ఫోన్ చేసి పిల్లల చదువుపై ఫాలోఅప్ చేయాలన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనకబడి ఉన్నారో పరిశీలించి, అందులో వారికి అవసరమైన మేర అదనపు శిక్షణ అందించాలన్నారు. ముఖ్యమైన పాఠ్యాంశాలను అనేకసార్లు బోధిస్తూ పాస్ అయ్యేవిధంగా ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఎఫ్ఆర్ఎస్‌లో వంద శాతం నమోదై, హాజరు వేయాలని, విద్యార్థుల హాజరు శాతంపై శ్రద్ధపెట్టాలన్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థులను ఫాలోఅప్ చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ నెంబర్ ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. యుడైస్ పోర్టల్‌లో నమోదైన ప్రతి విద్యార్థి వివరాలు నమోదు చేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు సమర్థవంతంగా పర్యవేక్షణ చేయాలన్నారు. మండల వారీగా, విద్యా సంస్థల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతం సమీక్ష చేసి హాజరు శాతం 90 శాతానికి ఎక్కువగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెడ్ మాస్టర్ల హ్యాండ్ బుక్‌ను ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయల, మండల విద్యాశాఖాధికారులు, కెజిబివి ప్రత్యేకాధికారులు, కళాశాల ప్రిన్సిపాల్స్, విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 6న స్లాట్ బుక్ చేసుకోవద్దు

### గురువారం మార్కెట్‌కు పత్తి తీసుకురావద్దు

### పత్తి కొనుగోళ్లలో అదనపు కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నవంబర్ ఆరున పత్తి కొనుగోళ్లు స్లాట్ బుక్ చేసుకోవద్దని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం పత్తి కొనుగోలుపై మార్కెట్ కమిటీ చైర్మెన్లు, జిన్నింగ్ మిల్లు యాజమాన్యం, సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 242 మంది రైతుల నుంచి 478 మెట్రిక్ టన్నుల పత్తిని ఇప్పటి వరకు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. నాణ్యమైన పత్తిని మద్దతు ధరపై కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు నవంబర్ ఆరున (గురువారం) బంద్ పాటిస్తున్న నేపథ్యంలో రైతులు పత్తి విక్రయానికి సంబంధించి గురువారం సిసిఐ కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకోవద్దన్నారు.అదేవిధంగా ఖమ్మం, ఏన్కూరు మార్కెట్ యార్డులకు పత్తిని తీసుకురావద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఎ.అలీమ్, మద్దులపల్లి, మధిర, వైరా మార్కెట్ కమిటీ చైర్మన్లు హరినాథ్ బాబు, బి.గంగారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీలు, కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు, సిసిఐ ప్రతినిధులు, వ్యవసాయ శాఖాధికారులు, జిన్నింగ్ మిల్లుల యాజమానులు పాల్గొన్నారు.

**లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు**

ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా డబుల్ బెడ్‌రూం ఇండ్లను పారదర్శకంగా లబ్ధిదారులకు కేటాయించామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామంలో లబ్ధిదారులకు లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అలాట్‌మెంట్ చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. చిమ్మపుడి గ్రామంలో నిర్మించిన 48 డబుల్ బెడ్‌రూం ఇండ్లకు గతంలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశామని, ప్రస్తుతం ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు జరుగుతుందన్నారు.
ఏ లబ్ధిదారునికి ఏ నెంబర్ ఇంటిని కేటాయించాలనే అంశం పూర్తి పారదర్శకంగా ఎటువంటి పైరవీలు లేకుండా ఆన్‌లైన్ ద్వారా కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహిద్, ఇడిఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం తథ్యం

### ఎమ్మెల్యే మట్టా రాగమయి



**ప్రజాపక్షం/కల్లూరు :** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నిక తథ్యం అని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కల్లూరులోని చంద్రుపట్ల రోడ్డు ఎదురుగా కాఫీ హోటల్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శాసన సభ్యురాలు మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో 1000 కోట్లతో ఇప్పటివరకు అభివృద్ధి చేశానని, రాబోయే రోజుల్లో ఇంకా అభివృద్ధి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కల్లూరులోని నూతనంగా నిర్మించిన సిహెచ్‌సి ఆసుపత్రిని త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఆకర్షితులవుతూ ఉన్నారని బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇది ప్రజాప్రభుత్వం అని, అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసే ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుమర్తి చంద్రరావు, విజయరావు, దుర్గాప్రసాద్, భూక్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్టీసి కండక్టర్‌కు తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/ మధిర :** ఎదురెదురుగా లారీ, బైకు ఢీకొన్న ప్రమాదంలో రిటైర్డ్ ఆర్టీసి కండక్టర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధిర ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బైకుపై వెళ్తున్న రిటైర్డ్ ఆర్టీసి కండక్టర్ నంబూరు రామారావును ఎదురుగా వస్తున్న లారీ ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న రామారావు రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిఎం విశ్వకర్మ లబ్ధిదారులకు అవగాహన

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలోని పిఎం విశ్వకర్మ లబ్ధిదారులకు ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ ఫెసిలిటేషన్ ద్వారా లబ్ధిదారులకు రాయల్ ఫ్యాంక్షన్‌లో మంగళవారం అవగాహన నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ ఆఫీస్, ఎంఎస్ఎంఇ మంత్రిత్వశాఖ, డిఐసి, ములుగుతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. పిఎం విశ్వకర్మ లబ్ధిదారులు అంటే 3వ దశ ధ్రువీకరణ పూర్తి చేసిన లబ్ధిదారులు, వివిధ దశలలో ధ్రువీకరణ కోసం పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వ్యవస్థాపకత అభివృద్ధి, ధరల వ్యూహాలు, మార్కెట్ ధోరణులను అర్థం చేసుకోవడం, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, అమ్మకాల వ్యూహాలు, ఉత్పత్తి ప్యాకేజింగ్, లేబులింగ్, డిజైనింగ్, ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్రాముఖ్యత, ఈ కామర్స్ ఆన్ బోర్డింగ్ వంటి వివిధ అంశాలపై నైపుణ్యం పొందడానికి ఆహ్వానించబడ్డారు. ఎంఎస్ఎంఇలకు, వివిధ సంస్థల విలువ గొలుసుతో వారి సంబంధాలను మెరుగుపరచడానికి నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కేంద్రంలో 125 మంది లబ్ధిదారులు హాజరయ్యారు.

## పంటలను పరిశీలించిన అధికారులు

**ప్రజాపక్షం/ఖానాపూర్:** మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలోని వేపచెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలో నష్టపోయిన పంటలను ఎఇఓ అంకుష్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోతు రాజు నాయక్, మూడు దేవేందర్, ఇస్లావత్ వాగ్య, గ్రామ రైతులు కలిసి పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంటలను నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసుకొని ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుండి పంట నష్టపరిహారాన్ని అందేవిధంగా చూస్తామన్నారు.



## భద్రకాళి చెరువు కట్టను పరిశీలించిన మేయర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నగర మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులను పరామర్శించి స్థానికంగా ఉన్న నాలా స్థితిగతులు, భద్రకాళి చెరువు కట్ట పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. గతంలో చెరువు కట్ట తెగిన దృష్ట్యా అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు పటిష్ట చర్యలు తీసుకోవాలని మేయర్ ఇంజనీరింగ్ శాఖ బల్దియా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ స్థానికంగా ఉన్న లోతట్టు ప్రాంతాలను నేరుగా పరిశీలించి బాధితులతో మాట్లాడి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా భరోసా కల్పిస్తూ వరద రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అక్కడే అధికారులతో మాట్లాడి వరద ముంపుకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మేయర్ తెలిపారు. అనంతరం పోతననగర్ నుండి ప్రవహించే నాలా స్థితిగతులను భౌతికంగా నగర మేయర్ కమిషనర్‌లు పరిశీలించారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, సిఎంహెచ్ఓ సురేందర్, డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్, రాడేకర్ ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈ రవికుమార్, ఇరిగేషన్ అధికారులు, సానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం: ఎమ్మెల్యే రేవూరి



**ప్రజాపక్షం/సంగెం:** ముంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని అధికారులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం సంగెం మండలం బిక్కోజీనాయక్‌తండా గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న రోడ్లను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గ్రామస్థులు, ఐటీడీఏ సంబంధిత అధికారులతో కలిసి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఐటీడీఏ ఈఈ వీరభద్రం, ఏఈ శ్రీనివాస్, సంగెం తహసీల్దారు రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్,పిఆర్ ఏఈ అభిరామ్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పరకాల అధికార ప్రతినిధి రమేశ్, మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు రమేశ్, నరహరి, పాషా, కిషోర్, అవినాష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టియు పోరాటాలతోనే టీచర్ల సమస్యల పరిష్కారం



**ప్రజాపక్షం/తొర్రూరు :** ఎస్‌టీయూ అలుపెరగని పోరాటాలతోనే టీచర్ల సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథుడి రవి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని హైస్కూల్‌లో ఎస్‌టియు టిఎస్ మహబూబాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఎన్నికల అధికారిగా నాగరాజు, పరిశీలకుడిగా సుధాకర్‌రెడ్డిలు పా ల్గొన్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా గన్నోజు ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొరవి సుధాకరాచారి, ఆర్థిక కార్యదర్శిగా రమేశ్, అసోసియేట్ అధ్యక్షుడిగా యాకూబ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా యాకయ్య, శ్రీరాములు, కార్యదర్శిగా సంపత్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలుగా శకుంతల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారుఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఏళ్ల మధుసూధన్, సతీశ్‌కుమార్, చంద్రమౌళి, జి.శ్రీనివాస్, హరికృష్ణ,వెంకన్న, ఏకాంబ్రాచారి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య బిసి ఉద్యమ వేదిక ఆవిర్భావం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తాడిత పీడిత ప్రజల విముక్తి కోసం త్యాగపూరిత పోరాటాలు చేసిన వారు దగాపడ్డ బి.సి. ప్రజల విముక్తి కోసం పోరాటం చేయాల్సిన చారిత్రిక అవసరం ఏర్పడిందని, దానిలో భాగంగానే ప్రజాస్వామ్య బి.సి ఉద్యమ వేదిక ఆవిర్భావం చేశామని ఆ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గాలీబు అమరేందర్ తెలిపారు. హనుమకొండ జిల్లా కేంద్రం బీమారంలో జరిగిన త్యాగధనుల సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బి.సి ఉద్యమం కీలక దశకు చేరుకుంటున్న సందర్భంలో రాజ్యాదికార లక్ష్యం చేరుకోవడానికి జరిగే ఉద్యమాలు మూస ధోరణితో నడుస్తున్న తరుణంలో గత 40 ఏండ్లుగా వివిధ ప్రగతిశీల పోరాటాల్లో కీలకంగా పనిచేసిన వారి నాయకత్వంలో ప్రజాస్వామ్య బి.సి ఉద్యమ వేదిక ఆవిర్భావం చేసినట్లు అమరేందర్ తెలిపారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రగతిశీలవాధులతో ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన సమావేశంలో భారతదేశంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో బి.సి ల స్థితిగతులు, రాజకీయ వాటా, రాజ్యాధికారం గురించి నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, వైస్ చైర్మన్లు పటేల్ వనజ, వెలుగు వనిత, హిందూ బి.సి మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర్లు, తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఛైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, కన్వీనర్ సోమ రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు

# భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలు

పరిశీలించిన హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్





**ప్రజాపక్షం/హనుమకొండ:** భారీ వర్షాలతో దెబ్బతిన్న వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలకు పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు త్వరగా నమోదు చేసి నివేదికను అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, రోడ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ధర్మసాగర్ దేవునూరు ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు, వంతెన, వరి పంటలు దెబ్బతినగా కలెక్టర్ నడుచుకుంటూ వెళ్లి అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. రోడ్ల మరమ్మతు పనుల గురించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. గ్రామంలో పంట నష్టం, రోడ్ల నష్టం పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ సుమారుగా అర కిలో మీటరు మేర నడుచుకుంటూ వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అదేవిధంగా గ్రామంలో వేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ఎంత మేరకు నష్టం జరిగిందని వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులకు చెందిన పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్న వరి పంటను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించి జరిగిన పంటల నష్టం గురించిన వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో దెబ్బతిన్న పంటల వివరాల నమోదు చేస్తున్న సమాచారాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను సర్వే నంబర్లు, రైతుల వారీగా వివరాల ను నమోదు చేయాలన్నారు. వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారానికి నివేదిక అందించాల్సి ఉండగా వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనా వివరాలను త్వరగా అందజేయాలన్నారు. అక్కడినుండి ముప్పారం గ్రామానికి చేరుకొని గ్రామంలో దెబ్బతిన్న పం టలు, రోడ్లను పరిశీలించారు. గ్రామంలో తీవ్రమైన వరద ధాటికి రోడ్లు బాగా దెబ్బతినగా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వరదలతో పశు సంపదకు జరిగిన నష్టం గురించిన వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. వరద తాకిడికి సుమారు 450 క్వింటాళ్ల వరి ధాన్యం కొట్టుకుపోయిన వివరాలను తెలియజేశారు. స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడి వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలకు జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. స్థానిక చెరువు నుండి వచ్చిన వరద నీటితో దెబ్బతిన్న రోడ్లను, పంట నష్టాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదిత అంచనాల నివేదికను అందజేయాలని పంచాయతీరా జ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధర్మసాగర్ రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ కు ఎంత ఇన్ ఫ్లో వస్తుందని, రిజర్వాయర్ కెపాసిటీ, అవుట్ ఫ్లో గురించి నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత నెల 29వ తేదీన రిజర్వాయర్‌లో ఉన్న నీటి సామర్థ్యం, ఇతర వివరాలను కలెక్టర్‌కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, డిఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం, ఎంపిడిఒ అనిల్ కుమార్, ఏవో రాజేష్ పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులోని ఐకెపి సెంటర్‌ను ఎత్తేయొద్దు

జనగామ మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి



**ప్రజాపక్షం / జనగామ :** రైతుల ధాన్యం కొనుగోలు చేయడం కోసం వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ఐకెపి సెంటర్‌న మార్చి వేరే చోట ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జనగామ మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి కోరారు. మంగళవారం జనగామ అదనపు కలెక్టర్ బెన్‌షాలోంను కలిసి వినతిప్రతం సమర్పించారు. జనగామ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని యదావిదిగా కొనసాగించాలన్నారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడుస్తుందని కొనుగోలు కేంద్రాన్ని మార్చేలనే ఆలోచన సరియైంది కాదన్నారు. ఐకెపి సెంటర్‌ను మార్కెట్ బయట పెట్టడం వలన రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందనానరు. గతంలో గ్యాస్ గోదాం పక్కన ధాన్యం కొనుగోలు కేంద్రం సహకార సంఘం, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా పెద్ద ఎత్తున దొంగతనాలు జరిగాయన్నారు. కేసులు సైతం నమోదు కావడం, పందుల సమస్య, లారీలో సకాలం రాకపోవడం, బస్తాల కింద విష పాములు, తేళ్లు ఉండడం, రాత్రి పూట విద్యుత్ దీపాలు లేకపోవడం, కళ్లం పూర్తిగా మట్టి, దిబ్బతో ఉండడం వలన అనేక సమస్యలు తలెత్తాయన్నారు. మార్కెట్ యార్డులో ఎలాంటి సమస్యలు ఉండవని, సెక్యూరిటి కూడా ఉంటుందన్నారు. ఐకెపి కేంద్రాన్ని యదావిధిగా కొనసాగించి రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందునాయక్, తెలంగాణ రైతు సమితి జిల్లా కార్యదర్శి సొప్పరి సోమయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, మమాలి యూనియన్ అధ్యక్షులు గుండెల్లి రాజు, వీరస్వామి, ఐలయ్య, కూరాకుల శ్రీనివాస్, యాకయ్య, మల్లేశం పాల్గొన్నారు.

## ఘనంగా యువజనోత్సవాలు



**ప్రజాపక్షం / జనగామ :** యువత సాంస్కృతిక కళా రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. జిల్లాలో యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం జూబ్లీ గార్డెన్‌లో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు జరగగా జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. కళారంగంలో అంది వచ్చిన అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. ఉద్యోగ అవకాశాల్లోనే కాకుండా సాఫ్ట్‌వేర్ రంగంలోని వీరికి ప్రధాన్యత ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలోనూ ప్రత్యేక అంశంగా వీటిని తీసుకుంటారని, విద్యార్థులు, యువత ఈ విషయం గమణించాలన్నారు. కళల్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, కళా రంగాల్లోనూ వచ్చే అవకాశాలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనబర్చాలని, ఉత్సాహంగా పాల్గొని తన నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. ఈ పోటీలలో జానపద గేయాలు, జానపద నృత్యాలు, కథ రచన, ఉపన్యాసం, కవిత్వం, సైన్స్ మేళ నిర్వయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి కోదండరాములు, జిల్లా సైన్ అధికారి సిహెచ్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కోతులను అరికట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలం

సిపిఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ పరిధి లో కోతులను కుక్కలను అరికట్టడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం చెందారని సిపిఐ జిల్లా నాయకులు సోతుకు ప్రవీణ్ కుమార్, గురీజపెల్లి సుధాకర్ రెడ్డి, కోరిమి సుగుణ లు అన్నారు. కోతుల కుక్కల బెడదను నివారించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలో కోతులు,కుక్కల సమస్య విపరీతంగా ఉంద ని వాటిని నివారించడంలో అధికారుల వైఫల్యం ఉందన్నారు. పట్టణ కేంద్రంలో 30 వార్డులలో కోతులు చాలా మంది మహిళలను,పిల్లలను తీవ్రంగా ఎన్నోసార్లు గాయపర్చడం జరిగిందన్నారు. ఈ విషయంపై అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. పట్టణంలోని హనుమాన్ నగర్‌లో 80లక్షల రూపాయలతో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ప్రభుత్వం నుండి ఏర్పాటు చేయడం జరిగిందని, రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు వాటి నివారణకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ నిర్వహించకపోవడం వల్ల కోతులు,కుక్కల సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. కోతులు కుక్కల పట్టడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నప్పటికీ అధికారులు నిధులను దుర్వినియోగం చేస్తూ న్నారని వారు ఆరోపించారు. అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు.సింగరేణి యాజమాన్యం కలిసి కోతుల పట్టే బోన్ లను తీసుకొచ్చి నాలుగు నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు వాటిని వాడకపోవడం చాలా సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు వెంటనే కోతుల కుక్కల బెడదను అరికట్టకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. అనంతరం కమిషనర్ కువినతి పత్రం ఇవ్వడం కోసమే అధికారులు నిరాకరించటంతో మున్సిపల్ కార్యాలయంలో అధికారులు ఎవరూ లేకపోవడంతో సిపిఐ నాయకులు ఆఫీస్ గేట్ ను నెట్టుకొని లోపటికి పోయే ప్రయత్నం చేయగా పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు నూకల చంద్రమౌళి, మాతంగి రామ్ చందర్,పల్లె కృష్ణ,నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, గోలి లావణ్య, సదానందం, గణగల జోగేష్, లోకిని రమేష్, గంప రాజు, పెద మాముల్ సంధ్య శ్రీలత స్వప్న సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పొంగిన చిటకోడూరు వాగు



**ప్రజాపక్షం / జనగామ :** జనగామ మండలంలోని చిటకోడూరు వాగు ఉప్పొంగింది. చిటకోడూరు రిజ్వాన్ గేట్లు ఎత్తడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీనితో చిటకోడూరు, చౌడారం, మరిగడి గ్రామాలకు పూర్తి గా రాకపోకలు నిలిచిపోయాయి. చౌడారంలోని కస్తూరిభా గాంధీ విద్యాలయం, మో డల్ స్కూల్‌కు వెళ్లడానికి సైతం దారి లేదు. దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల కోసం నిడిగొండ, ఇబ్రహీంపూర్ నుండి బస్సు నడిపిస్తామని ముందుగా ఆర్‌టిసి అధికారులు ప్రకటించి తరువాత నడిపించలేదు. దీనితో విద్యార్థులు బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఇక చిటకోడూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని గతం కొంత కాలంగా ఆయా గ్రామాల ప్రజలు పట్టుబడుతున్నా స్పందించలేదు. నిధులు మంజూరు చేయలేదు. దీనితో మంగళవారం చిటకోడూరు, చౌడారం, మరిగడి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్, సిఐ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ హుస్సేన్‌లు అక్కడే ఉండి ప్రజలకు నచ్చజెప్పారు. వాగులోకి ఎవరు వెళ్లకుండా పోలీసులను పెట్టారు. గేట్లు తీయ డం వలనే నీరు కిందకు వెళ్తుండడంతో ఆయా గ్రామాల రైతులు నీటి ప్రవాహం తగ్గే విధంగా ఒకటి, రెండు గేట్లు మాత్రమే తీయాలని కోరారు. గేట్లు ఎత్తకుంటు రిజర్వాయర్‌కే ప్రమాదం ఉండనుందని ఆయా గ్రామాల ప్రజలకు నచ్చజెప్పారు.

## మాకుల చెరువు ఆధునీకరణ పనుల పరిశీలన

జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



**ప్రజాపక్షం/ మరిపెడ:** మాకులచెరువు, కట్ట ఆధునీకరణ, సుందరీకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మరిపెడ మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్, ప్రాథమిక మండల పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని మాకుల చెరువు ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళుతుందని అందులో భాగంగానే మరిపెడ పట్టణంలోని మాకులచెరువు అభివృద్ధి పనులు నిమిత్తం సుమారు రెండు కోట్ల నిధులతో సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందని ఆ పనులను వెంటనే పూర్తి చేసి పట్టణ అభివృద్ధికి ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని విద్యాసంస్థలలో చదువుతున్న పిల్లలకు హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థిని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ వైద్య పరీక్షలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, అత్యాధునిక పరిజ్ఞానంతో విద్యా బోధనలు ప్రతి సబ్జెక్టు పై పట్టు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వ అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని నెలవారి షెడ్యూల్ ప్రకారం ప్రతి ఒక్కరికి అందించాలని చిన్న పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్యను అందించాలని, కేంద్రం పరిధిలోని గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు సామ్, మామ్, ఆరోగ్య వివరాలను నిత్యం క్షేత్రస్థాయిలో గమనిస్తూ వారికి కావలసిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.విద్యార్థుల యొక్క విద్యాసామర్థ్యాలను స్వయంగా కలెక్టర్ పిల్లలను అడిగి తెలుసుకున్నారు.జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజా పరిషత్, పాఠశాలలు, ట్రైబల్ వెల్ఫేర్, అంగన్వాడీ కేంద్రాలలోని కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్ స్టడీ రూమ్స్ తరగతి గదులు స్టోర్ రూమ్ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ క్రిష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ ఆర్. విజయాఆనంద్, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ధ్యేయం

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** నియోజకవర్గ ప్రజలకు మెరుగైన పరిపాలన, వైద్య సేవలు అందించడమే ధ్యేయమని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్మాణమవుతున్న ఇంటిగ్రేటెడ్ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్, 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన పరిపాలన, వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. నవంబరు 2026 నాటికి నిర్మాణాలు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. భవనాలు నిర్మించడమే కాదు అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. 100 పడకల ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, మెడికల్, నాన్ మెడికల్ సిబ్బంది, ఇతర అవసరాలకు సంబంధించిన జాబితా సిద్ధం చేయాలన్నారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే నాటికి అన్ని వసతులు, సౌకర్యాలు కలిగి ఉండాలన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు ఎలాంటి జాప్యం లేకుండా త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలపై ఉన్న ప్రేమతో అడిగిన వెంటనే కాదనకుండా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి రూ. 1400 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరయ్యాయని అందులో వివిధ పనులు ప్రారంభమై పనులు కొనసాగుతున్నాయన్నారు. రూ. 1400 కోట్ల అభివృద్ధి పనులను 18 నెలల్లో పూర్తి చేసే దిశగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను అనుమతులు వచ్చాయని, ఇంకా వేలేరు, చిల్పూరులో మండల కార్యాలయాలు, కొన్ని రోడ్లకు అనుమతులు రావాల్సి ఉందని త్వరలో మంజూరు తీసుకవస్తానన్నారు. కొంత మంది అభివృద్ధి పనులకు అడ్డు తగిలే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిలో కలిసి రావాలని, సహకారం అందించాలన్నారు. కేటీఆర్ అధికారం కోల్పోయినా అహంకారం కోల్పోలేదని అందుకే సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కేటీఆర్ అహంభావంతో మాట్లాడటం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ లావణ్య శిరీష్‌రెడ్డి, ఆర్డీవో డీఎస్ వెంకన్న, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్అండ్‌బీ అధికారులు, ఇతర శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు ఇబ్బంది కలగొద్దు

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం / జనగామ :** పత్తి రైతులకు ఎట్టి పరిస్థితిలోనూ ఇబ్బంది కలగొద్దని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ సిసిఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు వ్యాపారులకు హెచ్చరించారు. పత్తి విక్రయించడానికి వచ్చిన రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో పత్తి కొనుగోళ్లపై వ్యవసాయ, మార్కెటింగ్, జిన్నింగ్ మిల్ వ్యాపారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, తేమ శాతం వంటి కారణాలతో పత్తి కొనుగోలు చయకుండా ఇబ్బందులు పెట్టొదన్నారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు పరిశీలించాలన్నారు. ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైన సెంటర్లు ఎత్తేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్షలోం, డిసిపి రాజమహేంద్రనాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జీవన్‌కుమార్, సిసిఐ అధికారులు, జిల్లా ఫైర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

# క్రీడ

## కప్ చేజారినా నెం.1 ర్యాంక్

### తొలిసారి టాప్-10లో జెమీమా..!




ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్‌లో మెరిసిన క్రికెటర్లు ర్యాంకింగ్స్‌లో సత్తా చాటారు. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై అజేయ శతకంతో జట్టును గెలిపించిన జెమీమా రోడ్రిగ్స్‌తొలిసారి టాప్–10లోకి దూసుకొచ్చింది. అయితే.. భారత ఓపెనర్ స్మృతి మంధానకు మాత్రం దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వొల్వార్ట్ షాకిచ్చింది. పదమూడో సీజన్ ప్రపంచకప్‌లో సఫారీలకు కప్ అందించలేకపోయిన లారా వ్యక్తిగతంగా మైలురాయికి చేరుకుంది. కెరీర్‌లోనే అత్యుత్తమంగా 814 రేటింగ్ పాయింట్స్‌తో నంబర్ 1 ర్యాంక్ కైవసం చేసుకుంది. వరల్డ్ కప్ ముందు నుంచి టాప్‌లో ఉన్న మంధాన టోర్నీ ముగిసే ఒక ర్యాంక్ కోల్పోయింది. స్వదేశంలో జరిగిన మెగా టోర్నీలో శుభారంభాలు ఇస్తూ ఒక సెంచరీ, ఒక అర్ధ శతకంతో టీమిండియా విజయంలో కీలకమైన తను రెండో ర్యాంక్‌లో కొనసాగుతోంది. ప్రపంచ కప్‌లో సూపర్ ఫామ్ కొనసాగించి వరుసగా రెండు శతకాలు బాదిన లారా వన్డేల్లో ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. అదిరే బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికాను ముందుండి నడిపించిన ఆమె ఫైనల్లోనూ 101 రన్స్‌తో పోరాడిన జట్టును గెలిపించలేకపోయింది. అయితే.. టోర్నీలో 571 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచిన లారా టీమిండియా వైస్ కెప్టెన్ మంధానను రెండో స్థానానికి నెట్టేసింది. ప్రస్తుతం మంధాన ఖాతాలో 811 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. టీ–20 బ్యాటర్ల జాబితాలోనూ ఆమె రెండో స్థానంలోనే కొనసాగుతోంది.

**ఆ సెంచరీతో టాప్‌లోకి..** వరల్డ్ కప్ నాకౌట్ పోరులో ఆస్ట్రేలియాపై చిరస్మరణీయ సెంచరీ జెమీమా రోడ్రిగ్స్‌కు ప్లస్ అయింది. పటిష్టమైన ఆసీస్ పేస్ దళాన్ని ఎదుర్కొని 127 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును ఫైనల్ చేర్చిన జెమ్మీ.. ఏకంగా తొమ్మిది స్థానాలు మెరుగుపరచుకొని మొదటిసారి వన్డే ర్యాంకిగ్స్‌లో టాప్–10లోకి దూసుకొచ్చింది. సెమీస్‌లో భారత్‌పై సెంచరీతో మెరిసిన ఫొబె లిచ్‌ఫీల్డ్ 13 స్థానాలు మెరుగుపడి.. 13వ స్థానం సాధించింది. 215 పరుగులు, 22 వికెట్లతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికైన దీప్తి శర్మ ఆల్‌రౌండర్ల విభాగంలో నాలుగో ర్యాంక్‌కు ఎగబాకింది.

## ఇక సఫారీ బౌలర్లకు చుక్కలే..

### భారీ శతకంతో విరుచుకుపడిన యశస్వీ




టెస్టు క్రికెట్‌లో సంచలనంగా పేరొందిన యశస్వీ జైస్వాల్ పరుగుల వరద పారించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈమధ్యే వెస్టిండీస్‌పై శతక గర్జన చేసిన విధ్వంసక ప్లేయర్.. దక్షిణాఫ్రికా సిరీస్‌కు ముందే సెంచరీతో హెచ్చరికలు పంపాడు. సఫారీలతో మ్యాచ్ సన్నద్ధతగా దేశవాళీలో ఆడుతున్న యశస్వీ.. భారీ శతకంతో ఫామ్ చాటుకున్నాడు. రంజీ ట్రోఫీలో ముంబై ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ కుర్రాడు రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోసి భారీ శతకం సాధించాడు. చిన్న వయసులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో రికార్డులు నెలకొల్పుతున్న యశస్వీ జైస్వాల్ రంజీల్లోనూ తన బ్యాట్ పవర్ చూపించాడు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ బౌలర్లకు దడపుట్టించాడీ లెఫ్ట్ హ్యాండర్. తొలి ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ(67)తోనే సరిపెట్టుకున్న రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కసిదీరా కొట్టాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 254కే కుప్పకూలిన జట్టును ఓటమి నుంచి తప్పించేందుకు శతకం(156)తో వీరవిహారం చేశాడు యశస్వీ. ప్రత్యర్థి బౌలర్లను ఉతికేస్తూ 18 బౌండరీలతో సూపర్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఈ పెద్ద ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికాతో జరుగుబోయే టెస్టు సిరీస్‌లో తాను సెంచరీలో మెరవడం ఖాయమని చాటాడీ చిచ్చరపిడుగు. అతడి ఫామ్ చూస్తుంటే సఫారీ బౌలర్లకు కూడా పట్టపగలే చుక్కలు కనిపించేలా ఉన్నాయి. యశస్వీ మెరుపు సెంచరీకి, ముషీర్ ఖాన్ అర్ధ శతకం తోడవ్వగా ముంబై, రాజస్థాన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

**14న ఈడెన్ గార్డెన్స్‌లో..**

మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం దక్షిణాఫ్రికా నవంబర్ రెండో వారంలో భారత పర్యటనకు రానుంది. నవంబర్ 14న ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్టులో టీమిండియాతో సఫారీ టీమ్ తలపడనుంది. గువాహటిలో నవంబర్ 22 నుంచి రెండో టెస్టు షురూ కానుంది. అనంతరం నవంబర్ 30 నుంచి మూడు వన్డేల సిరీస్.. ఆపై డిసెంబర్ 9 నుంచి ఇరుజట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్ మొదలవ్వనుంది.

## పవర హిట్టర్ బెయిర్‌స్టోకు షాక్..

### యువకెరటాలకు సెంట్రల్ కాంట్రాక్ట్!

యాషెస్ సిరీస్ సమీపిస్తున్న వేళ ఆటగాళ్లలో ఉత్సాహం నింపింది ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు. జాతీయ జట్టు విజయాల్లో కీలకం అవుతున్న క్రికెటర్లకు బోర్డు మంగళవారం సెంట్రల్ కాంట్రాక్ట్‌లు ప్రకటించింది. సీనియర్లకు పెద్ద పీట వేసిన ఇసిబి ఈ మధ్య అంతర్జాతీయంగా సత్తా చాటిన యువకెరటాలకు కూడా కాంట్రాక్ట్‌లో చోటు కల్పించింది. టెస్టు సారథి బెన్ స్టోక్స్‌తో పాటు మూడు ఫార్మాట్లలో కీలకమైన ఆటగాళ్లలో పలువురికి రెండేళ్ల క్రాంట్రాక్ లభించింది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి 2026 సెప్టెంబర్ వరకూ ఇంగ్లాండ్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్‌లను ఇచ్చింది. షాకింగ్ న్యూస్ ఏంటంటే.. పవర్ హిట్టర్లు అయిన జానీ బెయిర్‌స్టో, లియాం లివింగ్‌స్టోన్‌లు మాత్రం ఈ జాబితాలో లేరు. నిరుడు భారత పర్యటనలో రాణించిన స్పిన్నర్ జాక్ లీచ్, పేసర్ ఓలీ స్టోన్‌లకు కూడా కాంట్రాక్ట్‌లో చుక్కెదురైంది. పేసర్ మార్క్ వుడ్‌తో పాటు జూనియర్లకు ఏడాది కాలానికే కాంట్రాక్ట్ ఇస్తున్నట్టు ఇసిబి వెల్లడించింది. ఇటీవల 'ది హండ్రెడ్ లీగ్'లో మెరిసిన యువ పేసర్ సోనీ బేకర్‌కు ప్రోత్సాహకంగా తొలిసారి కాంట్రాక్ట్ ఇచ్చారు. స్పిన్ ఆల్‌రౌండర్ డాసన్, సాకిబ్ మహమూమద్, పొడగరి పేసర్ జేమీ ఓవర్టన్‌లకు కూడా మొదటిసారి ఈసీబీ నుంచి జీతం అందుకోనున్నారు.



రెండేళ్ల కాంట్రాక్ట్ : బెన్ స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, జోస్ బట్లర్, బ్రైడన్ కార్సే, సామ్ కరన్, బెన్ డకెట్ విల్ జాక్స్, ఆదిల్ రషీద్, జో రూట్, జేమీ స్మిత్, జోష్ టంగ్.

**ఏడాది కాంట్రాక్ట్ :** రెహ్మాన్ అహ్మద్, సోనీ బేకర్, షోయబ్ బషీర్, జాక్ క్రాలే, లియాం డాసన్, సకీబ్ మహమూద్, జేమీ ఓవర్టన్, ఓలీ పోప్, మాథ్యూ పాట్స్, ఓలీ పోప్, ఫిల్ సాల్ట్, మార్క్ వుడ్ ల్యూక్ వుడ్

**వీళ్లపై వేటు :** జానీ బెయిర్‌స్టో, జాక్ లీచ్, లివింగ్‌స్టోన్, రీసే టాప్లే, జాన్ టర్నర్.

డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ : జోష్ హల్, ఎడ్డీ జాక్, టామ్ లావెస్, మిచెల్ స్టాన్లీ.


# ఫోకస్ మహిళ

## దెబ్బతింటున్న హార్మోన్ల సమతుల్యత



ఇటీవల కాలంలో హార్మోన్ల సమతుల్యం దెబ్బతింటున్నది. ఈ కారణంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మన శరీరంలో హార్మోన్లు అనే రసాయన పదార్థాలు ఉంటాయి. ఇవి మెదడు, థైరాయిడ్, అడ్రినల్, ప్యాంక్రియాస్, అండాశయాలు వంటి గ్రంధుల ద్వారా ఉత్పత్తి అవుతాయి. ఈ హార్మోన్లు శరీరంలోని పీరియడ్స్, బరువు నియంత్రణ, నిద్ర, భావోద్వేగాలు, చర్మ ఆరోగ్యం, జుట్టు బలంగా ఉండడం, శక్తి స్థాయి వంటి అనేక పనులను నియంత్రిస్తాయి. ఈ హార్మోన్లు సమతుల్యంగా లేదా సమపాళ్లలో ఉంటే ఆరోగ్యం బాగా ఉంటుంది. ఒకవేళ ఇవి సంతులనం కోల్పోతే, ఆ పరిస్థితిని హార్మోన్ల అసమతుల్యతగా పేర్కొంటారు. హార్మోన్లు సమతుల్యతను కోల్పోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిలో ఒత్తిడి ప్రధానం. దీర్ఘకాలిక ఒత్తిడి హార్మోన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. తగినంత నిద్ర లేకపోవడం, అధిక చక్కెర, ఫాస్ట్ ఫుడ్, కెఫైన్ వంటి అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం లేదాఅతిగా వ్యాయామం చేయడం, పర్యావరణ కాలుష్యం, రసాయనాల ప్రభావం, థైరాయిడ్ సమస్యలు, పోలిసైస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఓఎస్), మెనోపాజ్ వంటి పలు అంశాలు మహిళల్లో హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. శరీరంలో కనిపించే పలు లక్షణాలతో హార్మోన్ల సమతుల్యం దెబ్బతిన్నదని గుర్తించవచ్చు. పీరియడ్స్ అసమయంగా రావడం లేదా ఆగిపోవడం, అధికంగా మొటిమలు, ముఖం లేదా శరీరంపై అనవసరమైన రోమాలు పెరగడం, హఠాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం, అలసట, నిద్రలేమి, క్షణక్షణానికీ మూడ్ మారిపోవడం (దీనినే మూడ్ స్వింగ్ అంటారు), ఆందోళన, డిప్రెషన్, జుట్టు రాలడం లేదా చర్మం పొడిగా మారడం, గర్భధారణలో సమస్యలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే హార్మోన్లు సరైన మోతాదుల్లో లేవని అర్థం చేసుకోవాలి. ఈ సమస్య ఎదురైనప్పుడు తప్పనిసరిగా నివారణ చర్యలు తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, ప్రోటీన్స్ ఉన్న సమతుల ఆహారం తీసుకోవాలి. ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరి. యోగా, నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయాలి. తగినంత నిద్ర కూడా అవసరమే. గంటకు 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. ధ్యానం, శ్వాసాభ్యాసం వంటి పద్ధతుతో ఒత్తిడిని తగ్గించుకోవాలి. జంక్ ఫుడ్, అధిక చక్కెర, సోడా పానీయాలు పూర్తిగా మానివేస్తే మంచిది. కనీసం వాటి వాడకాన్ని గణనీయంగా తగ్గించాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఎప్పటికప్పుడు, థైరాయిడ్, పిసిఓఎస్, హార్మోన్ టెస్టులు చేయించుకోవాలి. సొంత వైద్యం అసలు పనికిరాదు. వైద్య నిపుణుల సూచనలు పాటించాలి. వారు సూచించిన మందులు లేదా హార్మోన్ సప్లిమెంట్స్‌ను మాత్రమే వాడాలి. మార్కెట్లో లభిస్తున్నాయి కదా అని ఇష్టానుసారంగా సప్లిమెంట్లను వాడడం మంచిది కాదు. అందరి శరీర తత్వం ఒకటిగా ఉండదు. అందరికీ ఒకే విధానం సరిపడదు. ఏ రకంగా చూసినా, హార్మోన్ల అసమతుల్యతను నిర్లక్ష్యం చేయకూడదు. ఇది ప్రారంభ దశలో గుర్తిస్తే సులభంగా నియంత్రించవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల ఆహారం, మానసిక ప్రశాంతత అనేవి ప్రధాన పరిష్కారాలు. వైద్య పరీక్షలు, నిపుణుల సూచనలు శిరోధార్యాలు.

## మార్గదర్శకురాలు బ్యూవోయిర్



ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో మహిళల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారంటే, అందుకు సైమోన్ డి బ్యూవోయిర్ వంటి ప్రతిభావంతులే కారణం. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో 1908 జనవరి 9న జన్మించిన బ్యూవోయిర్ 1928లో, కేవలం 20 సంవత్సరాల వయసులోనే తత్వశాస్త్రంలో పట్టా తీసుకోవడం అప్పట్లో సంచలనం రేపింది. ఆ రోజుల్లో మహిళలు అత్యధికంగా వివాహ సంబంధాలకు పరిమితం కావాల్సి వచ్చేది. కానీ, బ్యూవోయిర్ నాటి సంప్రదాయాలను ఎదిరించింది. మహిళలు వంటింటికే అంకితం కావాలనే భావనలను ధిక్కరించింది. తన కలలు నెరవేర్చుకోవాలంటే, చదువుకోవడమే సరైన మార్గమని నమ్మించింది. అసాధారణ ప్రతిభ, అంతకు మించిన అస్తిత్వవాద భావన ఆమె సొంతం. తన జీవిత భాగస్వామి, ప్రఖ్యాత తత్వవేత్త, రచయిత జీన్‌పాల్ సార్త్రేతో కలిసి అనేక చర్చావేదికలపై కనిపించింది. వాదనల్లో పాల్గొంది. 1949లో ప్రచురితమైన 'ది సెకండ్ సెక్స్' పుస్తకం ప్రకంపనలు సృష్టించింది. 'స్త్రీగా జన్మించరు.. అస్తీగా మారుతారు' అనే అత్యంత ప్రసిద్ధమైన కొటేషన్‌తో తన అస్తిత్వాన్ని చాటిచెప్పింది. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు, వారి దుస్థితికి, అత్యంత హీనమైన స్థానానికి సమాజమే కారణమన్నది ఆమె భావన. ఈ అభిప్రాయాన్ని ఆమె విస్తృతంగా ప్రచారం చేసింది. పుట్టినప్పుడు స్త్రీపురుషులకు తేడాలేదని, అయితే, మహిళల దుస్థితిని సమాజమే శాసిస్తున్నదని ఆమె చేసిన వాదన ఇప్పటికీ నిత్యనూతనమే. ఆమె సిద్ధాంతం ఆధునిక స్త్రీవాదానికి పునాదిని వేసింది. ఆమె స్వేచ్ఛ కోసం, ఇతర మహిళల స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడింది. ఆమె తత్వవేత్త మాత్రమే కాదు. వ్యాసకర్త... రచయిత్రి.. ఉపన్యాసకురాలు. ప్రతి ఒక్కరూ తమతమ జీవితాలను సొంతంగానే నిర్మించుకోవాలని ఆమె కోరుకుంది. మహిళలు సంప్రదాయబద్ధతను దాటి, నిజాయితీగా బతికే ఉద్యమాన్ని ఆమె తన రచనల ద్వారా ప్రేరేపించింది. అంతేగాక, ప్రత్యక్షంగానే ఉద్యమాలను నడిపించింది. 'సమాజం ఏ జీవితం అప్పగిస్తుందో దాన్ని ఒప్పుకోకండి, సొంత మార్గాన్ని ఎంచుకోండి. జీవితాన్ని స్ఫూర్తిమంతంగా తీర్చిదిద్దుకోండి. సవాళ్లను అధిగమించండి' అని 1986 ఆగస్టు 14వ తేదీన తుదిశ్వాస విడిచే కొద్ది రోజుల ముందు ఆమె చేసిన ప్రకటన ఇప్పటికీ ప్రపంచమంతా మారుమోగుతునే ఉంది. సామాజిక కట్టుబాట్లు, మత విశ్వాసాలకు కట్టుబడి, జీవితాలను నాశనం చేసుకుంటున్న లక్షలాది మంది మహిళలకు ఆమె సిద్ధాంతం ప్రేరణ కావాలి.

## ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి పరిమితిని ఎత్తేయాలి : నెల్లికంటి సత్యం




ప్రజాపక్షం/నల్లగొండ : మొంథా తుఫాన్ ప్రభావంతో పత్తి,వరి పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ప్రభుత్వాలను కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్ లో మంగళవారం జరిగిన నల్లగొండ నియోజకవర్గ మండల కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. తడిసినటువంటి వరిధాన్యం,పత్తిని షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోనే కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి ఎకరాకు రూ.40వేలు పత్తికి ఎకరాకు రూ. 60 వేలు చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.కపాస్ కిసాన్ యాప్‌లో ఎకరాకు ఏడు క్వింటాల పరిమితిని ఎత్తివేసి యధావిధిగా12 క్వింటాలు పత్తిని దిగుమతి చేసుకునేలా సడలింపు చేయాలని కేంద్ర ప్ర భుత్వానికి సూచించారు. డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభకు వేలాదిగా తరలిరవాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభ ప్రచారజాత ఈ నెల 17న నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో చేరుకొని జిల్లాలో దేవరకొండ,మునుగోడు,నకిరేకల్,నల్లగొండ,మిర్యాలగూడ,నియోజకవర్గాల మీదుగా సాగుతుందని, జాతాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్గూరి నరసింహా అధ్యక్షత వహించగా జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,నల్లగొండ పట్టణ కార్యదర్శి కెవిఎస్ రెడ్డి,సహాయ కార్యదర్శి వి.లెనిన్,కనగల్ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ,సహాయ కార్యదర్శి దొటి పండరి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.రామ్ కోటి,నాయకులు జిల్లా యాదగిరి,జోగు సురేందర్,కట్ట వెంకన్న,కట్ట యాదయ్య,ముండ్ల ముత్యాలు, యూసుఫ్, మదర్, కౌసల్య, విజయ, నాగమ్మ, లక్ష్మి, నందన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లపై ఆంక్షలొద్దు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు



ప్రజాపక్షం/ఏన్కూరు : తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యు లు భాగం హేమంతరావు కోరారు. మంగళవారం ఏన్కూర్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలతో పత్తి పంటలకు పూర్తిగా నష్టం జరిగిందని, మార్కెట్లో రైతులు అమ్మే పత్తి విషయంలో ఆనేక ఆంక్షలు విధిస్తున్నారని, 11 క్వింటల్ల నుండి 7 క్వింటల్ల పత్తి వరకే అమ్మాలనే నిబంధనను ఎత్తివేయాలన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా డిసెంబర్‌లో ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, జిల్లా సమితి సబ్యులు అమారనేని వీరభద్రం, మండల సహాయ కార్యదర్శి బాణోత్ రాంబాబు, మదినేని వెంకన్న, బొగినబోయిన నాగేశ్వరావు పాల్గొన్నారు.

## రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనున్న బిహార్ ఎన్నికలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

### సిపిఐ శతాబ్ధి ఉత్సవాలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/పెద్దపల్లి : సిపిఐ శతాబ్ధి ఉత్సవాలను జయప్రదంచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశం కామ్రేడ్ కే కనకరాజు అధ్యక్షతన స్థానిక భాస్కరరావు భవన్లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడారు. పేద ప్రజల కోసం స్వాతంత్ర సాధన కోసం పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అని,ఈ సంవత్సరం డిసెంబర్ 26న శత వసంతాలు నిండుతున్న సందర్భంగా ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. శతాబ్ది ఉత్సవాల జీపూ జాత ఆదిలాబాద్ జోడేఘాట్ నుండి ప్రారంభమై రాష్ట్రమంతా నిర్వహిస్తామని, నవంబర్ 16న గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్‌లకు చేరుకుంటుందన్నారు.ప్రజాసంఘాల నాయకులు,పార్టీసానుభూతిపరులు, కార్మికులు జాతాను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకుఊడిగం చేస్తున్న మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థల్లో నిధులను అదానీ , అంబానీలకు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ల జేబు సంస్థలుగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీహార్ ఎన్నికలు దేశరాజకీయచిత్రాన్నిమారుస్తాయని అభిప్రాయపడ్డారు. కరీంనగర్, పెద్దపల్లి సిపిఐ జిల్లా కార్యదర్శులు తాండ్ర సదానందం,పంజాలశ్రీనివాస్,రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోష్కమోహన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి సునీల్, తాళ్లపల్లి మల్లయ్య, మద్దె ఎల్లయ్య, మార్కపురి సూర్య, తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వైవి రావు, మాటేటి శంకర్, రామచందర్,జిగురు రవీందర్ , ఆరేపల్లి మానస్ కుమార్, బాలసాని లెనిన్, రేణికుంట్ల ప్రీతం, కల్లెపల్లి నవీన్,చంద్రశేఖర్, రంగు శ్రీనివాస్, తొడుపునూరి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో ఫీజు బకాయి విడుదల

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్




ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా ప్రభుత్వం చెప్పే మాటలకి, చేతలకి పొంతనలేదనిప్రజాపాలన అంటే కళాశాలలు బంద్ అనా? విద్యార్థులు ఇంటి వద్ద ఉండడమా? ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే సిఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని, ప్రభుత్వం రెండు రోజుల్లో ఫీజు బకాయిలు విడుదల చేయకపోతేమంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తామని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా 14వ మహాసభను సుబోధ్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ పతాకాన్ని కసిరెడ్డి మణికంఠ రెడ్డిఎగురవేశారు.ఆయనమాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం 23 నెలల పాలనలో అందాల పోటీలకు ఇచ్చిన నిధులు విద్యార్థుల చదువులకై ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయి 8 వేల కోట్లు విడుదలకు నిధులులేవు కానీ హెలికాప్టర్లలో మంత్రులు దుబారాగా తిరగడానికి, అందాల పోటీలకు నిదులు వస్తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలోవిద్యారంగానికిప్రత్యేక మంత్రి లేకపోవడం ద్వారా నే సమస్యలు పేరుకుపోయాయని, ప్రభుత్వానికి మద్యం ద్వారా వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ వి ద్యార్థుల సంక్షేమంపై, ప్రత్యేక మంత్రి నియామకంపై లేదన్నారు.రెండురోజుల్లో విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సుదాకర్, ఏఐఎస్‌ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం, జిల్లా నాయకులు భరత్, కార్తీక్, కుషాల్, చోటు, అబ్దుల్, శశికాంత్, నవీన్, కృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్ష



### ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి

ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ : ప్రభుత్వం విద్యార్థుల బోధన రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మంజిల్లాసమితిఆధ్వర్యంలోపెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఖమ్మంలో ప్రదర్శన నిర్వహించి ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి కార్యాలయ ముట్టడికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడేవిద్యార్థులు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేండ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు.



ప్రభుత్వం మారినా పాలన మాత్రం మారలేదని, విద్యార్థుల పట్ల వివక్ష చూపిస్తున్నారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఎనిమిది వేల కోట్ల రూపాయలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యలు బంద్‌లు పాటిస్తున్నాయని దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగులమీరా, మధు, శివ, వంశీ, మనోజ్, జిల్లా నాయకులు ఉస్మాన్, ఉపేందర్, గోపి, వెంకట్, నవీన్, చైతన్య పాల్గొన్నారు.




## చరిత్ర సృష్టించిన సిపిఐ : కలవేన శంకర్

ప్రజాపక్షం / రెబ్బెన/ ఆసిఫాబాద్ : భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుంటున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చరిత్రలో అనేక పోరాటాలకు, త్యాగాలకు నెలవు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ఉద్ఘాటించారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని ఆయన స్పష్టం చేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సమితి సమావేశం గోలేటి టౌన్ లోని కామ్రేడ్ మహేంద్ర భవన్ లో మంగళవారం జరిగింది. ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగాకలవేన శంకర్ మాట్లాడారు. దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. సిపిఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ బద్రి సత్యనారాయణ, మంచిర్యాల జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రామడుగు లక్ష్మన్, సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయి కుమార్, జిల్లా సమితి సభ్యులు ఆత్మకూరి చిరంజీవి, భోగే ఉపేందర్, రాయిల్లా నర్సయ్య, ఆత్రం సీతారాం, గోగుల మల్లికార్జున్, తుంరం అంబా రావు తదితరులు పాల్గొన్నారు.

## అందని ద్రాక్షగా డబుల్‌బెడ్రూం ఇళ్లు

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా




ప్రజాపక్షం/ఖిలా వరంగల్: సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నాయకుడు పంప్ జంక్షన్ గణపతి నగర్‌లో ఖిలా వరంగల్ మండల సమితి సమావేశం తాళ్లపల్లి జాన్‌పాల్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ తెలంగాణ వచ్చినప్పటి నుండి పేద ప్రజలకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందని ద్రాక్ష లాగా ఉన్నాయన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లను పంచకుంటే ఉద్యమం చేసి పేద ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్,సంగి ఏలేందర్,మండలసహాయకార్యదర్శిఓర్సు రాజు, మండల కార్యవర్గ సభ్యులు ఎండి అక్బర్ పాషా, సుంకరి భవాని, యాకాంబ్ర చారి, నల్లతీగలకుమార్, జన్ను రాజు, గజవెల్లి చిరంజీవి, యాకూబ్, ఉప్పుల రవి, రాచర్ల రాజేందర్,వనం సౌందర్య, జెట్టి విజయలక్ష్మి , పద్మ కుమార్ పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## సిఎంఆర్ఎఫ్ ఎల్‌ఒసి అందజేసిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/సోన్ :** సోన్ మండలంలోని గాంధీ నగర్ గ్రామానికి చెందిన అటక్ లాలాబాయి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.ఆమెకు మెరుగైన చికిత్స నిమిత్తం రూ.2.75 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ చెక్కును మంగళవారం కుటుంబ సభ్యులకు బీజేఎల్పీ నేత,ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అందజేసారు.ఎల్ఓసీ మం జూరు చేయించిన ఎమ్మెల్యేకు లబ్ధిదారు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఇందులో మం డల అధ్యక్షుడు మార గంగా రెడ్డి,బీజేపీ నాయకులున్నారు.

## మంచిర్యాల జిల్లాలో 223.93 లక్షల ఉచిత చేప పిల్లల పంపిణీ

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / లక్షెట్టిపేట :** మత్స్యకారుల సంక్షేమంలో భాగంగా వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం లక్షెట్టిపేట మండలం గుల్లకోట ప్రాంతంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మత్స్యశాఖ అధికారి అవినాష్, మండల తహసిల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. 2025, 26 సంవత్సరానికి గాను జిల్లాలో 223.93 లక్షల చేప పిల్లలు పెంచేందుకు ప్రతిపాదన సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 380 చెరువులు, రిజర్వాయర్లలో 369 సీజనల్ చెరువుల్లో 115.65 లక్షల చేప పిల్లలను, మిగతా రిజర్వాయర్లలో 108.28 లక్షల పెద్ద సైజు చేప పిల్లలను వదలడానికి నిర్ణయించినట్లు చెప్పారు. మంచిర్యాల నియోజకవర్గంలో 51.58 లక్షల ఉచిత చేప పిల్లలు పంపిణీ చేస్తామని, 15 నుంచి 20 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గుల్లకోట ప్రాంతంలో మంగళవారం 24 లక్షల 42 వేల చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి, మార్చి 2026 నాటికి చేపలు వృద్ధి చెంది, దాదాపు 1 వేయి మందికి ఉపాధి లభిస్తుందని, ప్రణాళిక ప్రకారం సకాలంలో పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సంబంధిత శాఖల అధికారులు, మత్స్యకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రోగులు, విద్యార్థులకు పండ్లు పంపిణీ



**ప్రజాపక్షం / కేరిమేరి :** సాకడ (శ్యాంరావు గూడ) గ్రామ పెద్దలు కీ.శే. పెందోర్ శ్యాంరావు పటేల్ మూడవ వర్ధంతి సందర్భంగా మంగళవారం కెరమెరి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, సాకడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో పండ్లు, ఫ్రూటీ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కేరిమేరి ఎస్ఐ మధుకర్ హాజరై మాట్లాడుతూ సేవా సమితి చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని, యువత సమాజ సేవ కొరకు ముందుకు రావాలని సూచించారు. పెం దోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి వ్యవస్థాపకులు పెందోర్ శ్రీనివాస్, మాజీ ఎంపిపి పెందోర్ మోతిరాం, మాజీ ఎంపిటిసి ఇఫ్తెకర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనందరావు, బిజెపి మండల అధ్యక్షుడు తుకారాం, సిఐటియు కన్వీనర్ ఆనందరావు, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు వెంకటేశ్, సేవా సమితి సభ్యులు కుంరం దేవేందర్, కుంరం దిందర్, రాంచందర్, ప్రకాష్ వాసకే, ముజ్జు, రాందాష్, రాజేష్, ప్రభాస్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## బాసర,తానూర్ ఆలయాల వద్ద భారీ బందోబస్తు

### కార్తీక పౌర్ణమికి నిర్మల్ పోలీస్ అలర్ట్..!



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, నిర్మల్ పోలీస్‌మీ పోలీస్ పేరుతో అత్యంత పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు.ఈ శుభ సందర్భంగా వేలాదిగా భక్తులు ఆలయాలకు విచ్చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో,భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు, భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆమె స్పష్టం చేశారు.అంతేకాకుండా, మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించడంతో పాటు,ఆలయ పరిసరాలను నిరంతరం సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంచుతారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించడానికి ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలియజేశారు.నిర్మల్ జిల్లాలో కార్తీక పౌర్ణమి వేడుకలు ప్రశాంతంగా,భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని ఆమెక స్పష్టం చేశారు.

## గుంతలను పూడ్చివేస్తున్న ఆర్అండ్‌బి శాఖ సిబ్బంది




**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** గతనెల 31న 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురితమైన 63వ నెంబర్ జాతీయ రహదారి కథనంపై అధికారులు స్పందించి కమ్మర్‌పల్లి నుండి మెట్‌పల్లి వెళ్లే జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టారు. రోడ్డంతా గుంతలమయమై రోడ్డు చుట్టుపక్కల చెట్ల కొమ్మలతో కమ్ముకుని ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడక అనేక ప్రమాదాలు సంభవిస్తున్న ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోకుండా ఉండటంతో ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. ఈ విషయంపై ప్రజాపక్షంలో అక్టోబర్ 31న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మంగళవారం మరమ్మతులు చేపట్టారు. జెసిబితో రోడ్డుకిరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించి రహదారిని బాగు చేశారు. ప్రజాపక్షలో వచ్చిన వార్తకు చైతన్యవంతమైన కమ్మర్‌పల్లి గారమస్తులు రోడ్డుపై ధర్నాకు దిగుతామని ఆర్అండ్‌బి శాఖకు తెలుపటంతో వారు రోడ్డు బాగు చేయింటానికి ముందుకొచ్చారు. ప్రజా సమస్యలపై అనునిత్యం వార్తలు ప్రచురిస్తున్న పత్రికకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నర్సయ్య, రామస్వామి, రాజశేఖర్, మల్లయ్య, రాజకుమార్, నరేష్, ప్రవీన్, నర్సయ్య, గంగారాం, నరేందర్, ధోని, ప్రజలు, యువత పాల్గొన్నారు.

## పది సంవత్సరాల కృషి వల్లే

# పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు

### పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి




**ప్రజాపక్షం/ పటాన్‌చెరు :** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పటాన్చెరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దిశా నిర్దేశం చేసారు. ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్చెరు లో మెరుగైన ఉపాధి అవకాశాల కోసం పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని గత 12 సంవత్సరాలుగా కృషి చేయడం మూలంగానే నేడు కళాశాల ఏర్పాటు అయ్యిందని తెలిపారు. నూతనంగా ఏర్పాటైన కళాశాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫర్నిచర్ ,కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు సరిపడా సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. కళాశాలకు శాశ్వత ప్రతిపాదికన భవనం ఏర్పాటు చే సేందుకు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పో చారం పరిధిలోన 10 ఎకరాల స్థలాన్ని కేటాయి ంచబోతున్నట్లు తెలిపారు. భవిష్యతులో ఇంజనీరింగ్ కళాశాల సైతం ఏర్పాటు చేసేలా భవనాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నమ్ము చేయకుండా లక్ష్యసిద్ధితో చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాలు బెట్టింగ్ తదితర సామాజిక రుగ్మతలను తరమికొట్టడంలో విద్యార్థులు కీలక భూమిక పో షించాలని కోరారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, పిఎస్ఎస్ ట్రస్ట్ ప్రతినిధి శ్రీనివాస్ మార్కెటట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ ,నాగరాజు, బాబావలి,వెంకటేష్ ,భోజ య్య, అశోక్, రాజు షకీల్, రామిశెట్టి, కళాశాల ఉపాధ్యాయులు ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలల నిర్వహణ మెరుగుపడాలి

### విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వపాఠశాలల నిర్వహణ తీరు మరింతగా మెరుగుపడేలా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిసూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోమంగళవారం అన్ని మండలాల ఎంఈఓలతో విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్ష జరిపి మాట్లాడారు. ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. పాఠశాలల్లో మంజూరయ్యే అభివృద్ధి, మరమ్మతు పనులకు సంబంధించిన పూర్తి వివరాలు ఎంఈఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకుతెలిసి ఉండాలన్నారు. ఆయా పాఠశాలల్లో పెండింగ్‌లో ఉండిపోయిన పనులను వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలన్నారు. యూడైస్‌లో వివరాలను నమోదు చేయటంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ పద్ధతిన శతశాతం అమలు చేయాలని సూచించారు.లైబ్రరీ, కిచెన్ గార్డెన్ వంటి వాటిని ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ బడులతో పాటు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లోనూ అందరూ విద్యార్థులకు సంబంధించి అపార్ జనరేట్ అయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాలు గణనీయంగా చేపట్టారని, అదే స్ఫూర్తితో పాఠశాలల్లో కూడా పూర్తిస్థాయిలో అడ్మిషన్స్ జరిగేలా కృషి చేయాలన్నారు. ఖాళీలను భర్తీ చేస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించేలా కృషి చేయాలన్నారు. ఎక్కడైనా లోపాలు నెలకొంటే వాటిని సవరించుకుని జిల్లాలోని అన్ని పాఠశాలల నిర్వహణ మెరుగుపడేలా కృషి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ అంకిత్, డీఐఈఓ రవికుమార్, డీఈఓ అశోక్, అన్ని మండలాల ఎంఈఓలు, కాంప్లెక్స్ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## పాక్సో కేసులో సంచలన తీర్పు

### నింధితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష !

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** బాలికల పై అఘాయిత్యాలకు పాల్పడేవారికి చట్టం గట్టి గుణపాఠం నేర్పింది.2020 సంవత్సరంaలో కడెం మండలంలోని చిన్న క్యాంపు కన్నాపూర్ గ్రామానికి చెందిన 09 ఏళ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించి,అత్యాచార యత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టుపోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు ఇచ్చాంది. పోలీసులు సమర్పించిన సాక్ష్యాలు,ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత,నేరం రుజువు కావడంతో నిందితుడు గట్టు గంగారంకు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 5000/ జరిమానా విధించారు. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ మాట్లాడుతూ, ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకోలేరని స్ప ష్టం చేశారు. వారు వ్యూహంతో కూడిన న్యాయ విచారణ,న్యాయ నిరూపణ జరిపి,నేరస్తులకు ఖచ్చితంగా శిక్ష పడేలా చూస్తారు,అని ఆమె సూచించారు.నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.వినోద్ రావు, విచారణ అధికారులు(ఉపేందర్ రెడ్డి,రాజ్ కుమార్), డ్యూటీ ఆఫీసర్స్ (ఏఎస్ఐడల్లు సింగ్,ప్రభాకర్ హెచ్‌సీ)లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందాం

### ఎమ్మెల్యే రోహిత్ రావు వెల్లడి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మెదక్ నియోజకవర్గాన్ని నిజాంపేట మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మండల కేంద్రం లోని రైతు వేదిక వద్ద కళ్యాణ లక్ష్మి చెక్కులను, సీఎంఆర్ఎఫ్ చెక్కులను, రైతులకు మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గాన్ని, నిజాంపేట మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని, మొత్తం 22 లక్షల రూపాయల కళ్యాణ లక్ష్మి చెక్కులను మహిళా సోదరిమణులకు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రజలందరూ గమనించాలన్న రూ. మండల కేంద్రంలో జూనియర్ కాలేజ్, ఫీడర్ ఛానల్, (డ్రైనేజీ), తహసిల్దార్ భవనం, పోలీస్ స్టేషన్ పక్క భవనాన్ని మంజూరు చేసి కట్టించాలని, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేయడం జరిగింది. తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజిరెడ్డి, వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రీతి, హిమాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, గ్రామ అధ్యక్షులు కొమ్మాటబాబు, మహేందర్, నసీరుద్దీన్, దేశెట్టి సిద్ధ రాములు, నాతిలక్ష్మాగౌడ్,మధుసూదన్ రెడ్డి, దేశెట్టి లింగం, నీల కనకరాజు, కొమ్మాట సుధాకర్, గర్గుల శ్రీనివాస్, వినోద్, అందే స్వామి, భాస్కర్ గౌడ్, నాగరాజు, శ్రీశైలం, లక్ష్మణ్ గౌడ్, పాల్గొన్నారు.

## యువత ఉద్యోగం కోసం కాదు,ఇచ్చే స్థాయికి ఎదగాలి

### అదనపు కలెక్టర్ చంద్రశేఖర్




**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** యువత ఉద్యోగం కోసం కాదు, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని అన్నారు. కలెక్టరేట్లో ఘనంగా జరిగిన యువజన ఉత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ,యువత మంచి ఉద్యోగాలు సాధించాలన్న ఏకైక లక్ష్యంతో పని చేస్తున్నారని శ్రమిస్తున్నారని ఉద్యోగాల సాదనకు కాదు, ఉద్యోగాల కల్పన కోసం శ్రమించాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జిల్లా యువజన సంక్షేమ క్రీడల శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్లో జరిగిన జిల్లా యువజన ఉత్సవాలు సైన్స్ ఫెయిర్ 2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. స్వామి వివేకానంద స్ఫూర్తి ని భవిష్యత్తు తరాలకు అందజేయడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులు ,యువత సంక్షేమం కోసం అనేక రకాల కార్యక్రమాలు చేపట్టిందన్నారు. విద్యార్థులు యువతలో చైతన్యం నింపేందుకు కోసం యువజన ఉత్సవాలలో భాగం యువజన ఉత్సవాలలో భాగంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో బాగంగా విద్యార్థులకు వ్యాసరచన ,కవిత పోటీలు నిర్వహించడం ఇట్టి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కవిత్వానికి ,నాట్యానికి కళలకు మనిషిని కదించే శక్తి ఉంటుందన్నారు. యువత నూతనోత్సవం భాగంగా వివిధ కళా పోటీలతో పాటు సైన్స్ ఫెయిర్ నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి ఉన్నత స్థాయికి ఎదిగేలా చేయడం కోసం ప్రభుత్వం యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ అధికారి మొహమ్మద్ ఖాసీం ,రాష్ట్ర యువజన సంఘాల నాయకుడు కూన వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతలు సేంద్రియ వ్యవసాయ విధానంపై దృష్టి పెట్టాలి

### రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్:** రైతులు వ్యవసాయ సాగులో సేంద్రియ వ్యవసాయ విధానంపై దృష్టి పెట్టాలని, అధిక రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వినియోగంతో ఆరోగ్యం దెబ్బతింటున్నట్లు రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా తునికి ఖల్సా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అగ్రి ఎక్స్ పో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పాలకుల పాపం, యంత్రాంగ అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిందని అన్నారు. రైతుల హక్కులు పూర్తిగా హరించబడగా, పూర్వం రైతులు తాము పండించిన మంచి విత్తనాలను ఇంట్లో భద్రపర్చుకునేవారని గుర్తు చేశారు. అయితే నేటి తరం రైతులు పూర్తిగా విత్తన కంపెనీలపై ఆధారపడుతుండడంతో ఆర్థికంగా నష్టపోతూ దిగుబడి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, దీనికి ప్రభుత్వం సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మనీ లాండరింగ్, ప్రైవేట్ అప్పుల బారిన పడి ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల పరిస్థితి ఆందోళనకరమని, ఈ క్రమంలో జరుగుతున్న అక్రమాలపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్



**ప్రజాపక్షం / రెబ్బెన :** రెండవ ఎఎన్ఎంల పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రిషికకు యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని, ఏడు నెలల పిఆర్‌సి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంహెచ్ఎస్ఆర్‌బి ఇటీవల నిర్వహించిన ఎంహెచ్ఎడబ్ల్యు (ఎఫ్), ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్స్ ఫలితాలను వెంటనే వెల్లడించాలని కోరారు. ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని, వంద శాతం గ్రాస్ శాలరీని అమలు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కుమురం భీం జిల్లా రెండవ ఎఎన్ఎంల యూనియన్ (ఎఐటియుసి) జిల్లా జాయింట్ సెక్రటరీ ప్రమీల, రెండవ ఎఎన్ఎంలు సునీత, వనిత, పద్మ, తులసి, విజయలక్ష్మి , మండల్, రేణుక పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

### జిల్లా వ్యవసాయాధికారి సురేఖ



**ప్రజాపక్షం / హాజీపూర్ :** రైతులు సేంద్రీయ సాగుపై దృష్టి సారించి భూ సా రం పెంపొందించే చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ అన్నారు. మండలంలోని గుడిపేట్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేసి, భూసార పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సమగ్ర ఎరువుల యజమాన్యం ద్వారా భూమిలో స్థూల సూక్ష్మ పోషకాల సమతుల్యతను కా పాడుకోవాలని, భూమిలో తేమ నిల్వ ఉండాలంటే సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, వాన పాముల ఎరువులు వాడటం అవసరమని సూచించారు. పచ్చి రొట్ట, జీవన ఎరువుల వాడకాన్ని పెంచితే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు.


## సెల్లార్ వైద్యం,చీకట్లో ప్రాణాలా వ్యాపారం..!

### నిబంధనలు చిత్తు.. చీకట్లో చికిత్స..!

### అధికారులు నిద్రలో,ప్రజలు ప్రమాదంలో..!

### కార్పొరేట్ హాస్పిటల్స్ వెనుక దాగిన చీకటి నిజాలు..!

**ప్రజాపక్షం/నిర్మల్ :** రోగుల ప్రాణరక్షణ పేరుతో లాభాల వేట కొనసాగుతోంది.నిర్మల్ పట్టణంలో పలు ప్రైవేట్ హాస్పిటల్స్ చట్టాన్ని పక్కనబెట్టి భవనాల సెల్లార్లలో వైద్య సేవలు అందిస్తున్నాయి.చీకటిగా,గాలి రాకుం డా, తేమతో నిండిపోయే గదుల్లో రోగులను ఉం చడం మానవత్వానికే అవమా నం.వర్షాకాలంలో నీటి లీకేజ్, తేమ,విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు ఎ ప్పుడైనా సంభవించే అవకాశం ఉండగా,అధికారులు మాత్రం మూగవైపు చూ స్తున్నారు. పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాల్లోనే చికిత్స గదులు ఏ ర్పాటు చేయడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. అంబులెన్స్‌లు కూడా ఆసుపత్రి వద్దకు చేరలేని పరిస్థితి నెలకొని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ప్రజల ఆరోగ్య భద్రతను పట్టించుకోని వైద్య అధికారులు,సంబంధిత శాఖల నిర్లక్ష్యం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్పొరేట్ ఆసుపత్రులు 24 గంటల అత్యవసర సేవలు, అర్హత గల వై ద్యులు, నర్సులు ,ల్యాబ్ టెక్నీషియన్లు, ఐసీయూ,ఆపరేషన్ థియేటర్, ఎక్స్రే, ల్యాబ్,ఫార్మసీ వంటి సదుపాయాలు కలిగి ఉండాలి,ఆసుపత్రి భవనం గాలి ప్రవాహం వెలుగు,అగ్ని భద్రతా పరికరాలు,వికలాంగుల సౌకర్యాలు ఉండేలా నిర్మించాలి, రోగుల ఫీజులు,సిబ్బంది అర్హతలు,మౌలిక వసతుల వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలి.అయితే నిర్మల్,బైంసా,ఖానాపూర్ పట్టణాల్లో ఉన్న పలు ఆసుపత్రులు ఈ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నాయి. కొంతమంది వైద్యులు కార్పొరేట్ వైద్యం పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని దోచుకుంటున్నారు.రోగులకు లేని వ్యాధులు ఉన్నట్టు చూపించి టెస్టులు, స్కానింగ్ పేర్లతో వేలకు వేలు వసూలు చేస్తున్నారు.అర్హత లేని సిబ్బంది చేత రోగులకు సేవలు అందించడం కూడా విస్తృతంగా జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.సెల్లార్లలో ఆసుపత్రు లు నడపడం వలన గర్భిణీలు,వృద్ధులు,అత్యవసర రోగులు మెట్లు ఎక్కి దిగడానికే ఇబ్బందులు పడుతున్నారు.వెంటిలేషన్ లేకపోవడం వల్ల శ్వాసకోశ సమస్యలు,తేమతో కూడిన వాతావరణం వల్ల ఇన్ఫెక్షన్లు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది?అనే ప్రశ్నతో ప్రజలు మండిపడుతున్నారు.ప్రతి సంవత్సరం ఆసుపత్రుల తనిఖీలు జరుగుతున్నాయన్నా,అవి కేవలం నామమాత్రంగానే మిగిలిపోయాయి. వైద్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందాలు కాగితాలపై రిపోర్టులు సమర్పిం చి మౌనంగా వెళ్లిపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.చట్టవిరుద్ధంగా నడుస్తున్న ఈ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని,రోగుల ప్రాణాలతో ఆటపట్టే ఈ వ్యవస్థను కట్టడి చేయాలని ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కొనుగోలులో జాప్యం.. రైతుల్లో ఆందోళన



ప్రజాపక్షం /మల్లాపూర్: ఆరుగాలం కష్టపడి పండించిన రైతంగానికి అడుగడుగునా ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో జాప్యం జరుగుతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. వర్ష భావంతో ధాన్యం తడిస్తే తమ పరిస్థితి ఏంటనీ వెనువెంటనే ధాన్యాన్ని తూకం వేసి కొనుగోలు చేయాలని ధర్నా చేపట్టారు. స్పందించిన అధికార యంత్రాంగం నిర్వాహకులు వెంటనే రైతుల ధాన్యాన్ని తేమశాతం పరిశీలించి జాప్యం లేకుండా చూస్తామన్నారు. పాల్గొన్న వారిలో మొక్కజొన్న రైతులు తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ సతిమణి మనాలి ఠాకూర్ మంగళవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్ధతు ధరను పొందాలన్నారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కేంద్రాల్లో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. సకాలంలో కొనుగోళ్లు చేపట్టడంతోపాటు విక్రయ డబ్బులు అందే లా చూడాలన్నారు. రైతు కృషి తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు మూలస్తంభమని, ప్రభుత్వం ఎల్లవేళలా రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, నాయకులు పర్శవేని శ్రీనివాస్, గాదె సుధాకర్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో ముందస్తు కార్తీక పౌర్ణమి వేడుకలు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల ఆల్ఫోర్స్ పాఠశాలలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ము ం దస్తు వేడుకలు ఘన ంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై ప్రాంగణంలో దీపాలను వెలిగించి శివుని చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ మాసంలో ప్రతి దినం చాలా పవిత్రమైనదని, ప్రతిరోజు కార్తీక పురాణాన్ని చాలా ప్రాంతాల్లో పఠించడం జరుగుతుందన్నారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాం స్కృతిక కార్యక్రమాలు ఆలోచింపజేసాయి. ప్రాంగణాన్ని చక్కగా వివిధ రకాల పూలతో అలంకరించి పండుగ శోభను రెట్టింపు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రక్కన ఉన్న బావులకు గోడలు ఏర్పాటు



ప్రజాపక్షం/హుస్నాబాద్: హుస్నాబాద్ మండల పరిదిలోని హుస్నాబాద్ నుండి పొట్లపెల్లి వెళ్లు రహదారి ప్రక్కన ఉన్న కొలు బావికి వెంటనేగోడ కట్టాలని బిఅర్ ఎస్ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్‌గౌడ్ అధికారులను కొరారు. మంళవారం ఆయనవిలేకరితో మాట్లాడుతూ హుస్నాబా ద్ చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు నిత్యం పొట్లపెల్లిలోని స్వయం భూ రా జరాజేశ్వర దేవాస్థానంకు అధిక సంఖ్యంలో భక్తులు తరలి వస్తారని రోడ్డుప్రక్కనే మలుపు వద్ద ఉన్న కొలు బావి ప్రమాదకారకంగా ఉండటంతో రా త్రి వేళల్లో బాట సారులకు ప్రమాదం ఉన్నందున వెంటనే గోడ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రెండు నెలల క్రితం హుస్నాబాద్ నుండి పొట్లపెల్లికి రోడ్డు విస్తరించడంతో పాటు తారు రోడ్డు వేయగా రోడ్డు విస్తర న వ ల్ల వ్యవసాయ బావి రోడ్డుకు ప్రక్కకు ఏర్పడింది . గత వారం రోజుల ను ండి కురిస్తున్న భారీ వర్షాల వల్ల రోడ్ల పక్కన ఉన్న వ్యవసాయ బావులు కోతకు గురై ప్రమాదకరంగా మారయని అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

## బస్సు ప్రమాదంలో 15 మంది ప్రయాణికులకు గాయాలు



ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ శివారులో మంగళవారం తెల్లవారుజామున మరో భయానక రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న మెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్‌టిసిఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంతో ముందుగా వెళ్తున్న ధాన్యం లోడుతో ఉన్న ట్రాక్టర్ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాంలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ సైతం తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న ఎల్ఎండి కాలనీ పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అధిక వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగానిర్ధారించారు.కేసునమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన కరీంనగర్ అర్బన్ బ్యాంకు పాలకవర్గం



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు చైర్మన్, పాలకవర్గ సభ్యులు మంగళవారం మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్బంగా చైర్మన్ కర్ర రాజశేఖర్‌తో పాటు సభ్యులకు శాలువా కప్పి సత్కరించి వారిని ఎమ్మెల్యే అభినందించారు. బ్యాంకు అభివృద్ధితో పాటు ఖాతాదారులకు మంచి సేవలను అందించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యేగంగులతోపాటుఅర్బన్‌బ్యాంకు చైర్మన్ , సభ్యులు పాల్గొన్నారు.

## గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### కలెక్టర్ పమేలా సత్పతి




ప్రజాపక్షం/కరీంనగర్: శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ఈ నెల 7న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిధిగా హాజరుకానున్న నేపథ్యంలో అవసరమైన పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, నగర పాలక కమిషనర్ ప్రపుల్ దేశాయ్, పోలీసు, వైద్య, విద్యుత్, తదితర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సంధర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ పర్యటనలో ప్రోటోకాల్ పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు కార్యక్రమాలకు సమయపాలన పాటించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను మెడికల్ టీం, 108,104, ప్రత్యేక డాక్టర్ల బృందం ఏర్పాటు చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, డయాస్ ఇతర ఏర్పాట్లు ఆర్అండ్‌బి అధికారులు చూడాలని, తాగునీరు, శానిటేషన్,ఫాగింగ్ వంటి ఏర్పాట్లు చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సంధర్బంగా ఏర్పాటు చేసే స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల గురించి పలు సూచనలు చేశారు. యూనివర్సిటీలో పూర్తిస్థాయి భద్రత ఉంటుందని, ఐడెంటిటీ కార్డులు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతి ఇస్తామన్నారు. గేటు వద్ద తనిఖీ కోసం యూనివర్సిటీ తరపున సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. గవర్నర్ కార్యక్రమానికి హాజరయ్యే వారి పేర్ల జాబితాను ముందే సమర్పించాలన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ గవర్నర్‌తో పాటు మరో అతిధి ప్రొఫెసర్ బిజె రావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్, పిహెచ్‌డి పట్టాలు ప్రదానం చేస్తారన్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగం ఉంటుందన్నారు. పలు కార్యక్రమాల అనంతరం సెమినార్ హాలు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమం సవ్యంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డిసిపి వెంకటరామిరెడ్డి, ఏసిపిలు పోలీసు, వైద్య, విద్య, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగిన విద్యార్థులు

### యాజమాన్యానికి మద్దతుగా అధికార యంత్రాంగం

### బిఆర్ఎస్‌వి రాష్ట్ర నాయకుడు ఆవుల తిరుపతి యాదవ్



ప్రజాపక్షం/జమ్మికుంట:జమ్మికుంట పట్టణంలోని స్వామి వివేకానంద పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు హాస్టల్ నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తెచ్చుకుని ఆత్మహత్యకు పాల్పడడం సంచలనం రేపింది. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపించాలని అధికారులను కోరగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని బిఆర్ఎస్‌వి రాష్ట్ర నాయకుడు ఆవుల తిరుపతి యాదవ్ ఆరోపించారు. యాజమాన్యం పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలంటే ధన దాహం తప్ప విద్యార్థులకు ఉన్నత విలువలను విద్యను అందించడంలో, మనోధైర్యాన్ని కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందని మండిపడ్డారు. ఒక విద్యార్థి హాస్టల్ నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తెచ్చుకుని ఆత్మహత్యకు పాల్పడడం రాష్ట్రంలోని విద్యారంగ పరిస్థితి, అధికారుల పనితీరు అద్దం పడుతోందన్నారు. ఈ విషయంపై బహిరంగ విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను కోరారు. పాఠశాల యాజమాన్యంపై మండల విద్యాధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఫీజు బకాయిలు చెల్లించాలని పోస్టు ద్వారా లేఖ

### సిఎం రేవంత్‌రెడ్డికి పంపిన ఎఐఎస్ఎఫ్ జిల్లా శాఖ



ప్రజాపక్షం/కరీంనగర్‌సి టీ: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యార్థుల చదువులను రోడ్డు న పడేసిందని ఎఐఎస్ ఎఫ్ జి ల్లా అధ్యక్షుడు రామారపు వెం కటేష్ అన్నారు. పెండి ంగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెం ట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ కరీంనగర్‌లోని పో స్టు ఆఫీసులో ఎఐఎస్ఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టు ద్వారా లేఖను పంపినట్లు పేర్కొన్నారు. ఈ సంధర్బంగా వెంకటే ష్ మాట్లాడుతూ గతంలో కళాశాలల బంద్ చేస్తే ద సరా, దీపావళి లోపు రూ.1200 కోట్లు విడుదల చే స్తామని చెప్పి మాట తప్పి కేవలం రూ.300 కోట్లు విడుదల చేశారన్నారు. కళాశాలల బంద్ చేస్తామ ని యాజమాన్యాలు ప్రకటించి పది రోజులు గడుస్తున్నా ప్రభుత్వం వారితో చర్చించి బకాయిలు ఇ వ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల చదువులతో చెలగాట మాడుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.8వేల కోట్ల బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఫీజు బకాయిలు విడుదల లేక విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు అప్పులు చేసి ఫీజులు కట్టే పరిస్థితి వచ్చిందన్నారు. కళాశాలలు బంద్ చేయడంతో విద్యార్థుల చదువులకు పూర్తిగా ఆటంకం కలుగుతుందన్నారు. యాజమాన్యాలు కళాశాలల నిర్వహణ, సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉ న్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి బంద్ విరమింపజేసి పెండింగ్‌లో ఉన్న మొత్తం ఫీజు బకాయిలు విడుద ల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కా ంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తామ ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు కేషబోయిన రాము యాదవ్, నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, శివ, రాజు, మల్లిఖార్జున్, మణి, వరుణ్, శ్రీకాంత్‌లు న్నారు.

## సిసిఐ కేంద్రాలకు పత్తి తీసుకొని రావద్దు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : రాబోయే 3 రోజుల పాటు జిల్లాలోని మార్కెట్ యార్డులు, సిసిఐ కేంద్రాలకు పత్తి తీసుకొని రావద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పత్తి జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ వారు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిన్నింగ్ మిల్స్, సిసిఐ, ప్రైవేటు కొనుగోలు నిలిపి వేస్తున్నామని అసోసియేషన్ వారు తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు రైతులు మార్కెట్‌కు గాని లేదా జిన్నింగ్ మిల్ వద్దకు పత్తి తీసుకొని రావద్దని అన్నారు.సిసిఐ విధించిన నిబంధనలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 విధానం,పక్క జిల్లాల రైతులను అనుమతించడం, పత్తి రైతు ఎకరానికి 7 క్వింటాలు అమ్ముకునే వీలు కల్పించడం విషయంలో సిసిఐ వారు కఠినంగా ఉన్నందున వెంటనే ఈ విషయంలో వెసులుబాటు కల్పించేంత వరకు పత్తి కొనుగోలు నిలిపేస్తున్నామని జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ వారు ప్రకటించడం జరిగిందని అన్నారు. ఈ అంశాలను రైతులు గమనించి రాబోయే మూడు రోజుల వరకు పత్తిని మార్కెట్ యార్డ్ , తీసుకు రాకూడదని, తదుపరి కొనుగోలు తేదీలను మరల ప్రకటించడం జరుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, కాటన్ మార్కెట్ కమిటీ కార్యదర్శులు,పోలీస్ శాఖ రవాణా శాఖ ఫైర్ శాఖ అగ్నిమాపక శాఖ సిసిఐ అధికారులు ,జిన్నింగ్ మిల్లు ఓనర్లు పాల్గొన్నారు.

**పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీ 8 నాటికి పూర్తి చేయాలి**

2024–25 ఖరీఫ్ సీజన్ సంబంధించి పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీ నవంబర్ 8 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో 2024–25 ఖరీఫ్ పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీపై అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల యాజమాన్యంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ 2024 సీజన్ సంబంధించి 99.5 శాతం సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేసి సిఎంఆర్ డెలీవరిలో రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని , దీనికి కృషి చేసిన మిల్లర్లకు, అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.జిల్లాలోని 11 రైస్ మిల్లుల పరిధిలో మరో 29 ఎసికే రైస్ సరఫరా పెండింగ్ ఉందని, పెండింగ్ రైస్ డెలివరీ కూడా గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. రబీకి సంబంధించి రైస్ డెలివరీ కూడా గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కేటాయింపుకు బ్యాంకు గ్యారంటీ అందించడం తప్పనిసరిగా ఉందని కలెక్టర్ తెలిపారు. మిల్లర్లందరు తప్పనిసరిగా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో చట్టం అమలులో పాఠశాలల పాత్ర కీలకం

### న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేష్



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించే పోక్సో చట్టం, ఇతర కీలక చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశా రు. మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయ సహకారంతో పోక్సో ఇతర చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సంధర్బంగా వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత, భరోసా కల్పించాల్సిన నైతిక చట్టపరమైన బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులు వచ్చినప్పుడు పాటించాల్సిన విధి విధానాలు, బాధితులకు తక్షణ న్యాయ సహాయం అందించే ప్రక్రియ, ఫిర్యాదుల గోప్యతను కాపాడడం వంటి కీలక అంశాలపై ఆయన సమగ్రంగా అవగాహన కల్పించారు. జువైనల్ జస్టిస్ చట్టం 2015 గు రించి ప్రస్తావించి చట్టంతో సంఘర్షణకు గురైన పిల్లల (నేరా లు చేసిన పిల్లలు) విచారణలో జువైనల్ జస్టిస్ బోర్డు పాత్ర చాలా ముఖ్యమైనదని తెలిపారు. పోక్సో కేసులలో నేరానికి పాల్పడిన వ్యక్తి 18 ఏళ్ల లోపు వారైతే వారిని పిల్లల స్నేహపూర్వక వాతావరణంలో విచారించే విషయంలో జెజెబికి పాఠశాలలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. సైబర్ క్రై మ్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్‌లు, లైంగిక వేధింపులు, నకిలీ ప్రొఫైల్ మోసాల వంటి వాటిపై క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి న్యాయ సలహా, సహాయం అవసరమైనా టోల్ ఫ్రీ నెంబర్ 15100ను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఇఒ శ్రీరాం మొండయ్య, లీగల్ ఎయిడ్ డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్ తణుకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు ఎ.కిరణ్ కు మార్, డిసిఇబి సెక్రటరీ భగవంతయ్య, ప్లానింగ్ కో ఆర్డినేటర్ మిలుకూరి శ్రీనివాస్, క్వాలిటీ కో ఆర్డినేటర్ కర్ర అశోక్‌రెడ్డి, జి ఇసిఒ కృపారాణి, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, డిఎస్ఒజయపాల్‌రెడ్డి, మండల విద్యాధికారులు, ప్రభుత్వ పా ఠశాలల ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్, కెజిబివి సంస్థల అధికారులు పాల్గొన్నారు.

## కుళ్లి పోయిన గుడ్లు పంపిణీ చేస్తున్న అంగన్ వాడీ కేంద్రాలు

### పర్యవేక్షణ లేని ఐసిడిఎస్ అధికారులు



ప్రజాపక్షం/హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గర్భి ణి మహిళల కోసం , చిన్నపిల్లల కోసం అంగన్ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం , గు డ్ల పంపిణీలో కాంట్రాక్టర్‌లు వారి నుండి సబ్‌కా ంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. గుడ్ల సరఫరాలో గాని పౌష్టికాహారంలో గాని నాణ్యత లేక పో వడం, అధికారుల పర్యవేక్ష ణ లేక పోవడంతో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గుడ్ల సై జు తగ్గించి పంపిణీ చేయడం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేం ద్రాల నుండి గ్రుడ్లు, పౌష్టికాహారం పక్క దారులు పడుతున్నాయి. అందులో గ్రుడ్లను సకాలంలో ప ంపిణీ చేయక పోవడంతో కుళ్లిపోయి వస్తు న్నాయని, వాటిని చూడకుండానే గర్భిణీ స్త్రీలకు అంగన్ వాడి కేంద్రాలకు వచ్చే పిల్లకు పంపిణీ చేస్తున్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఓ అంగ న్ వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీ తీసుకుపోయి ఉడక బెట్టిన గుడ్లు కుళ్లి పోవడంతో వెంటనే బిఎస్ పి , బిజెపి నాయకులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులపై చర్యలు తీ సుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైన అధికారులు పర్యవేక్షణ చేసి నాణ్యమైన వాటిని పంపినీ చేయాలని వారు అధికారులను కోరారు.

## అలింకో ఉపకరణాలు, సహాయక పరికరాలతో మేలు

### దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలి

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్





ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : అలింకో, ఎడిఐపి, ఆర్‌వివై ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాల పంపిణీకి నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. అలింకో, ఎడిఐపి, ఆర్‌వివైఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, వృద్ధులకు ఎంపిక కోసం చేస్తున్న ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు, వయో వృద్ధులు ఉపకరణాలు, సహాయక పరికరాల గుర్తింపు కోసము క్యాంపులు నిర్వహిస్తున్నారని వివరించారు. అర్హులందరూ పాల్గొనాలని సూచించారు. దివ్యాంగులు యుడిఐడి కార్డ్ కోసం మొబైల్ లేదా మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు కేటాయించిన తేదీల్లో దవాఖానకు వెళ్లాలని, అక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులపై వివక్ష చూపవద్దని, అందరితో సమానంగా గౌరవించాలని పేర్కొన్నారు. అర్హులకు పరికరాలు అందిస్తున్న అలింకో బాధ్యులను అభినందించారు. శిబిరాల్లో అర్హత సాధించిన వారికి చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ళు, రోలెటర్స్, ఎంఎస్ ఐ ఇడికిట్ / ఎం ఆర్ కిట్, స్మార్ట్ కేన్, అంధుల చేతి కర్ర, ఎల్ బో క్రచ్చేస్, అంధ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు సహాయక పరికరములు అందిస్తారని వెల్లడించారు. ట్రై పాడ్, టెట్రా ప్యాడ్,చేతి కర్రలు, వీల్ చైర్, వాకర్స్, వాష్ రూమ్ వీల్ చైర్, నడుం పట్టి, మెడ పట్టి, వినికిడి యంత్రాలు, ఫూట్ కేర్ యూనిట్, వాకింగ్ స్టిక్ విత్ సీట్, చంక కర్రలు, ఫోమ్ కుషన్, మోకాళ్ళ పట్టీలు, సహాయక పరికరములు ఇస్తారని తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు కావల్సిన పత్రాలు వెంట తీసుకుని రావాలని సూచించారు. ఈ నెల 6వ తేదీ గురువారం చందుర్తి రైతు వేదికలో, 7 వ తేదీన శుక్రవారం వేములవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయముల సముదాయంలో, 10వ తేదీన సోమవారం ముస్తాబాద్ రైతు వేదికలో, 11 వ తేదీన మంగళవారం సిరిసిల్ల సి.నా.రె. కళామందిరంలో శిబిరాలు నిర్వహిస్తారని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. శిబిరంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, ఎంపిడిఒ శశికళ, తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర..**

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర అందుతుందని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో నిర్వహిస్తున్న ఐకెపి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు, కొనుగోళ్లు పరిశీలించారు. రైతులకు అన్ని వసతులు కల్పించాలని, తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేసి తరలించాలని అధికారులకు సూచించారు.

**ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలి..**

అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఆర్థిక సాయాన్ని వినియోగించుకొని నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో లబ్ధిదారులు తమ కలల ఇంటిని పూర్తి చేసుకోవాలని సూచించారు. సందర్శనలో గృహ నిర్మాణ శాఖ పిడి శంకర్, ఎంపిడిఒ శశికళ, తదితరులు ఉన్నారు.

# రీల్

## మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్



యువ సామ్రాట్ నాగ చైతన్య తండేల్ బ్లాక్ బస్టర్ సక్సెస్ తర్వాత ఇప్పుడు నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ #NC24 చేస్తున్నారు. ఈ చిత్రానికి విరూపాక్షతో సంచలన విజయాన్ని అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ ఎల్ పీ, సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మక బ్యానర్లపై బివిఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. బాపినీడు సమర్పిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆమె పాత్ర దక్షగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ అదిరిపోయింది.

## ఉత్తమ నటుడిగా మమ్ముట్టి



మలయాళ సినిమాకు ఇది ఒక అద్భుతమైన క్షణం. మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించిన 'భ్రమయుగం' గతేడాది అత్యధిక ప్రశంసలు అందుకున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఈ చిత్రం.. తాజాగా 55వ కేరళ రాష్ట్ర సినిమా అవార్డుల్లో సత్తా చాటింది. నాలుగు ప్రతిష్ఠాత్మక విభాగాల్లో అవార్డులను సాధించింది. కొత్త తరహా కథాకథనాలు, అద్భుతమైన సాంకేతికతతో ఈ చిత్రం మలయాళ సినీప్రపంచంలో కొత్త మైలురాయిని సృష్టించింది. 55వ కేరళ రాష్ట్ర చలన చిత్ర పురస్కారాలలో 'భ్రమయుగం' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా మమ్ముట్టి, ఉత్తమ సహాయ నటుడిగా సిద్ధార్థ్ భరతన్, ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా క్రిస్టో జేవియర్, ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా రోనెక్స్ జేవియర్ అవార్డులు గెలుపొందారు. నిర్మాతలు రామచంద్ర చక్రవర్తి (నైట్ షిఫ్ట్ స్టూడియోస్), ఎస్. శశికాంత్ (వైనాట్ స్టూడియోస్) తమ సినిమా సృజనాత్మక దృష్టిని గుర్తించినందుకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం, జ్యూరీ, విమర్శకులు, మీడియా మరియు ప్రేక్షకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డులు ప్రయోగాత్మక కథలపై మా నమ్మకాన్ని మరింత బలపరిచాయి. మరిన్ని ప్రయోగాత్మక సినిమాలు చేయడానికి, కేరళ సినిమాకు కొత్త దారులు చూపే ప్రయత్నాలను కొనసాగించడానికి ఇవి మాకు ప్రేరణగా నిలుస్తాయి. మా దర్శకుడు, నటీనటులు, సాంకేతిక బృందం మరియు ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. అంటూ నిర్మాతలు తమ ఆనందాన్ని పంచుకున్నారు.



## చిన్న చిత్రాలను ఆదరించండి

### కె-ర్యాంప్ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

కె–ర్యాంప్ లాంటి చిన్న చిత్రాలను ఆదరించాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. చిన్న చిత్రాలను ఆదరించినప్పుడే సినిమా పరిశ్రమ మనుగడకు ప్రమాదం ఉండదని ఆయన పేర్కొన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'కె–ర్యాంప్' సినిమా సక్సెస్ సెలబ్రేషన్ ఘనంగా జరిగాయి. ఈ సెలబ్రేషన్‌కు ముఖ్య అతిధిగా హాజరైన తెలంగాణా స్పీకర్ గడ్డం ప్రసాద్ సినిమా యూనిట్ సభ్యులందరికి షీల్‌లను అందజేశారు. చిన్న చిత్రాలు ఆడటం వల్లే ఎంతో మందికి ఉపాధి దొరుకుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నిర్మాత బండ్ల గణేష్ అతిథులుగా హాజరై అతిథుల చేతుల మీదుగా మూవీ టీమ్‌కు జ్ఞాపికలు అందించారు. హీరో కిరణ్ అబ్బవరం నటించిన 'కే–ర్యాంప్' మూవీ హౌస్ ఫుల్ షోస్‌తో పెరుగుతున్న కలెక్షన్స్‌తో బ్లాక్ బస్టర్ విజయం దిశగా పరుగులు తీస్తోంది. ఈ సినిమా సక్సెస్ ఫుల్‌గా థర్డ్ వీక్ ప్రదర్శితమవుతూ 40 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను సాధించి దీపావళి బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచిందిని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్ ఛోటా కె ప్రసాద్, డీవోపీ సతీష్ రెడ్డి మాసం, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్, నటుడు మురళీధర్ గౌడ్, డైరెక్టర్ జైన్స్ నాని, ఫైట్ మాస్టర్ పృథ్వీ, ప్రొడ్యూసర్ రాజేశ్ దండ, హీరో కిరణ్ అబ్బవరం తదితరులు పాల్గొన్నారు.



## 'రాజా సాబ్' ఆగేది లేదు..

రెబెల్ స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్' పూర్తి స్థాయిలో పోస్ట్‌ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని, ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో జనవరి 9న విడుదలకు సిద్ధంగా ఉంది. రెబెల్ స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం జనవరి 9, 2026న సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదల కానుంది. ఇటీవల, ఈ సినిమా విడుదల మరోసారి వాయిదా పడిందని సోషల్ మీడియాలో కొన్ని నకిలీ పుకార్లు వ్యాపించాయి. రాజా సాబ్ ప్రకటించిన విధంగానే జనవరి 9న ఎటువంటి ఆలస్యం లేకుండా విడుదల అవుతుందని నిర్మాతలు స్పష్టం చేశారు. ప్రస్తుతం విఎఫ్ఎక్స్ ఇతర పోస్ట్‌ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

## 7న 'ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్' విడుదల

కామిక్ కాన్ యాక్షన్ సైఫై కలగలిసిన యుద్ధభూమిగా మారింది. 'ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్' విడుదలకు సిద్ధమైంది. అందులో అత్యధిక ఉత్సాహాన్ని తెచ్చింది ప్రెడేటర్ హంటర్ టెక్ సర్క్యూట్ చల్లేంజ్‌లో పాల్గొన్నవారు మెటల్ సర్క్యూట్‌పై కంట్రోల్ వాండ్ని నడపాలి ఒక్క చిన్న పొరపాటు చేసినా వెంటనే రెడ్ అలర్ట్ వస్తుంది. ఈ టాస్క్ గేమింగ్ థ్రిల్, సస్పెన్స్ రెండింటినీ మిళితం చేసి, ప్రతి ఒక్కరినీ ఆడకముందే టెన్షన్లోకి నెట్టేసింది. అదే సమయంలో ప్రెడేటర్ కాస్ ప్లేయర్లు తమ యాక్షన్ మూవీస్‌తో ఫ్లోర్ మొత్తం ఆక్రమించేశారు. ఈ అనుభవం మొత్తం కామిక్ కాన్లో అత్యంత ఆకర్షణగా నిలిచింది. ప్రేక్షకుల ఉత్సాహం, సోషల్ మీడియాలో వైరల్ కంటెంట్‌తో దూసుకుపోతోంది. దీంతో సినిమా ప్రమోషన్‌కు మరింతగా ఆసక్తి కలిగించింది. ఇల్లే ఫెన్నింగ్, డైమిట్రోయిస్, కోలో మాటంగి ప్రధాన పత్రాలు పోషించిన ఈ సినిమాను 20 సెంచరీ స్టూడియోస్ నిర్మించింది. ఈనెల 7న తెలుగు, హిందీ, తమిళం, ఇంగ్లీష్ భాషలలో విడుదల కానుంది.





## ఆషికాతో రవితేజ డ్యూయెట్



రవితేజ హీరోగా, కిషోర్ తిరుమల దర్శకత్వంలో నిర్మిస్తున్న ఆర్ 76 రెగ్యులర్‌గా షూటింగ్ జరుపుకుంటోంది. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. హీరో రవి తేజ, హీరోయిన్ ఆషికా రంగనాథ్‌పై ఒక పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాట కోసం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రత్యేకమైన సెట్ వేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందుతున్న ఈ పాట అదిరిపోయే డ్యాన్స్‌తో ప్రేక్షకులను అలరించనుంది. ఎనర్జీతో ప్రేక్షకులను అలరించే రవితేజ ఈ సినిమాలో న్యూ స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారు. ఇది హ్యూమర్, ఎమోషన్, రవితేజ మాస్ ఎలిమెంట్స్‌తో ఫుల్‌ప్లెడ్జ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతోంది. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు.

## 'ఫీనిక్స్' ప్రీరిలీజ్

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా పరిచయమైన చిత్రం ఫీనిక్స్. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహించారు. ఏకే బ్రేవ్మ్యాన్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజలక్ష్మి 'అన్ల్' అరసు ఈ సినిమాని నిర్మించారు. ఇప్పటికే తమిళ్‌లో విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ చిత్రం తెలుగులో నవంబర్ 7 రిలీజ్ కానుంది. ఈ సందర్భం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. నేను జవాన్ సినిమా చేస్తున్నప్పుడు అనల్ అరసు మాస్టర్‌ని కలిసాను. అప్పుడు ఈ కథ చెప్పారు. మా అబ్బాయి ఇందులో నటించాలని అన్నారు. మీ ఇద్దరు మాట్లాడుకోండి అని చెప్పాను. ఆ తర్వాత నాకు ఏమీ తెలియదు. వాళ్ళిద్దరే మాట్లాడుకున్నారు. సినిమా చేశారు. నేను సినిమా చూశాను. నాకు చాలా నచ్చింది. ఇది మా అబ్బాయికి చాలా మంచి ఆరంభం. ఒక తండ్రిగా నేను చాలా ఆనందంగా ఉన్నాను. తనకు చిన్నప్పటి నుంచి యాక్షన్ సినిమా చేయాలని ఉండేది. తనకి యాక్షన్ చాలా ఇష్టం. నన్ను యాక్షన్ సినిమాలు చేయమని చెప్తుండేవాడు. యాక్షన్ సినిమాని చాలా బాగా సెలబ్రేట్ చేసుకుంటాడు. అలాంటి సినిమాలు చేయడం తన కల. తను యాక్టర్ కావాలి అని చెప్పాడు. అలా చెప్పిన ఏడాదిలోనే సినిమా చేశాడు. అదంతా డైరెక్టర్ అనల్ అరసు మాస్టర్, నిర్మాత రాజ్యలక్ష్మి మేడం వలన సాధ్యపడిందన్నారు. ఈనెల 7న సినిమా రిలీజ్ అవుతుంది. అందరం థియేటర్స్‌లో కలుద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమాలో డైరెక్టర్ గోపీచంద్ మలినేని, హీరో సూర్య సేతుపతి, నటి వరలక్ష్మి శరత్ కుమార్, డైరెక్టర్ అనల్ అరసు, రచయిత భాష్యశ్రీ, నిర్మాత రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



# పెన్షనర్లకు మోదీ సర్కారు తీరని ద్రోహం

### 8వ వేతన సంఘం పరిధిలో చేర్చకపోవడం అన్యాయం
### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్
### కార్మిక సంఘాలు ఉద్యమించాలని పిలుపు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల పట్ల కేంద్రంలోని మోడీ సర్కారు ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఎఐటియుసి తీవ్రంగా ఖండించింది. ఎనిమిదవ కేంద్ర వేతన సంఘం పరిధి నుండి 69లక్షల మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లను దూరం పెట్టడం ద్వారా మోడీ సర్కారు వారికి తీరని ద్రోహం చేసిందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మండిపడ్డారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పెన్షనర్ల విధి విధానాలు నిర్ణయించడానికి ఆర్థిక బిల్లు ద్వారా పార్లమెంటు నుంచి పొందిన క్రమబద్ధీకరణ అధికారాన్ని ప్రభుత్వం ఉపయోగించుకుంటోంది. 8వ కేంద్ర వేతన సంఘానికి ఇచ్చిన నిబంధనల (టీఓఆర్) పత్రం... కార్మిక వర్గం, వద్ధాప్య పెన్షనర్ల పట్ల ప్రభుత్వ ఉదాసీనతకు నిదర్శనం. 8వ కేంద్ర వేతన సంఘం ఉద్యోగుల జీవన అవసరాలకు తగినట్లుగా మంచి వేతనం సిఫార్సు చేయలేదు. కాంట్రిబ్యూటరీ ఎన్‌పిఎస్, యూపిఎస్ స్థానంలో నాన్‌కంట్రిబ్యూటరీ పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించడం గురించి నిబంధనలలో ఎటువంటి ప్రస్తావన లేదు. పార్లమెంట్‌లో ఆర్థిక బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఇప్పటికే ఉన్న 69లక్షలకు పైగా పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లను 8వ వేతనసంఘం పరిధి నుండి కేంద్రం దూరంగా ఉంచింది. అంటే 0101 2026 నుండి పెన్షన్‌లో ఎటువంటి సవరణ ఉండదు. ఇది దేశ సేవ కోసం తమ చెమటను, రక్తాన్ని ధారపోసిన సీనియర్ సిటిజన్లకు చేసిన ద్రోహమే కాకుండా తీవ్ర అన్యాయం అని కౌర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ సర్కారు ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగి, పెన్షనర్ వ్యతిరేక విధానాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తోందని ఆమె తెలిపారు. 8వ సిపిసికి ప్రభుత్వం టీఓఆర్‌లో ఈ క్రింది వాటిని చేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కుటుంబ సభ్యుల సంఖ్యను కనీసం 5 మందిగా పరిగణించి... నేటి జీవనశైలికి తగినట్లుగా పోషక, పరిశుభ్ర ఆహారం తదితర రోజువారీ అవసరాలు, విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం, తాగునీరు, రవాణా మొదలైన వాటిపై ఖర్చులకు కనీసం 25శాతం వ్యయం అవసరం వంటి అంశాలను చేర్చాలి. కాంట్రిబ్యూటరీ ఎన్‌పిఎస్, సిపిఎస్ స్థానంలో నాన్‌కంట్రిబ్యూటరీ ఓల్డ్ పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలన్న 26 లక్షలకు పైగా ఎన్‌పీఎస్ ఉద్యోగుల డిమాండ్‌ను పరిశీలించాలి. పెన్షన్ నిర్మాణం, సవరణ, 11సంవత్సరాల తర్వాత పెన్షన్ విలువ పునరుద్ధరణ వంటి ఇతర సంబంధిత విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. అలాగే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసిన విధంగా పదవీ విరమణ తేదీ నుండి ప్రతి 5 సంవత్సరాలకు 5శాతం పెన్షన్ పెంచాలి. 112026 నుండి ఉద్యోగులు, పెన్షనర్లకు 8వ సిపిసి సిఫార్సుల్ని అమలు చేయాలి. వేతనాలు, పెన్షన్ సవరణ పదేళ్లకొకసారి మాత్రమే జరుగుతుంది కాబట్టి, మోదీ సర్కారు ఉద్యోగ, పెన్షనర్ వ్యతిరేక వైఖరికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి ట్రేడ్ యూనియన్లు వెంటనే నిరసన తెలపాలని, డిమాండ్ల సాధనకు కార్యాచరణ కార్యక్రమాలను రూపొందించాలని ఎఐటియుసి పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చేపట్టే పోరాటానికి ఎఐటియుసి అండగా ఉంటుందని కౌర్ స్పష్టం చేశారు.






# ఫిబ్రవరిలో ఐజెయు ప్లీనరీ

### విజయవాడలో నిర్వహించాలని ఎపియుడబ్ల్యుజె నిర్ణయం

**అమరావతి** : ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజెయు) ప్లీనరీ సమావేశాలను ఫిబ్రవరి నెల మొదటివారంలో విజయవాడలో నిర్వహించాలని ఎపియుడబ్ల్యుజె నిర్ణయించింది. యూనియన్ అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో యూనియన్ రాష్ట్ర విస్తత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఐ.జే.యూ. జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్, చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలతోపాటు, ఐజెయు ప్లీనరీ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఐజెయు ఆవిర్భావం తర్వాత 1992లో రెండో ప్లీనరీ విజయవాడలో ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఐజెయు 11వ ప్లీనరీని నిర్వహించే అవకాశం మరోసారి ఎపియుడబ్ల్యుజెకు వచ్చిందని, ప్లీనరీని విజయవాడలోనే నిర్వహించాలని యూనియన్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. మూడు రోజులపాటు జరిగే సమావేశాల్లో జర్నలిస్టు సమస్యలు, వత్తి విలువల రక్షణకై తీసుకోవల్సిన చర్యలు, జర్నలిస్టుల భద్రత, మీడియా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మహాసభలకు దేశం నలుమూలల నుండి దాదాపు 350 మంది ప్రతినిధులు హాజరవుతారని, ప్లీనరీని విజయవంతం చేయడానికి ప్రజాస్వామ్యవాదులంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐజెయు ప్లీనరీ నిర్వహణకు మొత్తం తొమ్మిది కమిటీలు ఏర్పాటు చేయాలని కార్యవర్గ విస్తత సమావేశం నిర్ణయించింది. అలాగే ఐజెయు ప్లీనరీని పురస్కరించుకుని మంచి వ్యాసాలతో సావనీర్‌ను విడుదల చేయాలని సమావేశం తీర్మానించింది. ఎపియుడబ్ల్యుజె డిప్యూటీ జనరల్ సెక్రటరీగా విజయనగరానికి చెందిన పి.ఎస్.ఎస్.వి. ప్రసాదరావును కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్ బాబును యూనియన్ క్రమశిక్షణ, అర్హతల కమిటీ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఇవిగాక ప్లీనరీ ఏర్పాట్ల కోసం వివిధ ఉప కమిటీలను త్వరలో ఏర్పాటు చేయాలని, ఎపి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్, సామ్నా రాష్ట్ర సమావేశాలను నిర్వహించాలని విస్తత కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధానకార్యదర్శి కంచల జయరాజ్ యూనియన్ ఇటీవల కాలంలో నిర్వహించిన కార్యకలాపాలపై నివేదిక సమర్పించగా, మాజీ ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్, ఐజెయు జాతీయ కార్యవర్గసభ్యులు నల్లి ధర్మారావు, డా.ఎం.ప్రసాద్ ప్రసంగించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 26 జిల్లా శాఖల అధ్యక్ష కార్యదర్శులు, కన్వీనర్లు సమావేశంలో పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా అవకతవకలపై ఇసి చర్యలు

### మహారాష్ట్ర కాంగ్రెస్ డిమాండ్

**ముంబయి** : స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలలో 'అవకతవకలను' సరిదిద్దాలనే ప్రతిపక్ష పార్టీల డిమాండ్‌ను ఎన్నికల కమిషన్ వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని మహారాష్ట్ర కాంగ్రెస్ మంగళవారం కోరింది. పాలక వర్గం నాయకులు కూడా ఇలాంటి వాదనలు చేశారని ఉటంకించారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన భాగమని, అవి లేకుండా ఎన్నికల ప్రక్రియ అసంపూర్ణమని మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ సావంత్ అన్నారు. 'అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి పారదర్శక, తప్పులు లేని ఓటర్ల జాబితాను డిమాండ్ చేస్తున్నప్పుడు చర్య తీసుకోవడం ఇసి విధి. ఇప్పుడు ముఖ్యమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులేతో సహా అధికార పార్టీ నాయకులు కూడా ఓటర్ల జాబితాను రద్దు చేయాలని చెప్పారు. అధికార పార్టీ కూడా అదే చెబుతుంటే, ఇప్పుడు సమస్య ఏమిటి?' అని సావంత్ 'ఎక్స్' పోస్ట్‌లో ప్రశ్నించారు. మహారాష్ట్ర మంత్రి అశిష్ షెలార్ సోమవారం మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ సిబ్బందిపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ ఠాక్రే బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఓటర్ల జాబితా గురించి విపక్షం తప్పుడు ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. కాగా బిజెపి నాయకుల ప్రకటనలను సావంత్ ప్రస్తావిస్తూ, 'అంతకుముందు, అనురాగ్ ఠాకూర్, ఇప్పుడు అశిష్ షెలార్ ఓట్ల దొంగతనాన్ని అంగీకరించారని అన్నారు. మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి... షెలార్‌ను ఒక అఫిడవిట్ సమర్పించాలని అడుగుతారా?' అని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 'ఓటు దొంగతనం'కు బిజెపి బ్రాండ్‌గా నిలిచిందని అన్నారు.

## ప్రచారానికి తెర

(మొదటి పేజీ తరువాయి)

121 నియోజక వర్గాల్లో తొలి విడత పోలింగ్ జరగనుంది. ఈ విడతలో ఆర్‌జెడి అగ్రనేత, మహాఘడ్‌బంధన్ సిఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్, ఆయన సోదరుడు తేజ్‌ప్రతాప్ యాదవ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, జానపద గాయకురాలు మైతిలీ ఠాకూర్ సహా 1,314మంది అదృష్టం పరీక్షించుకుంటున్నారు. మిగితా 122 సీట్లకు ఈనెల 11న రెండో విడతలో ఓటింగ్ జరగనుంది.

### మాజీమంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ బరిలో

రాఘోపూర్ నియోజకవర్గం స్థానం నుంచి తేజస్వీ యాదవ్ పోటీ చేస్తున్నారు. ఎన్‌డిఎ తరపున బిజెపికి చెందిన సతీశ్‌కుమార్, జన్‌సురాజ్ పార్టీ నుంచి చంచల్‌కుమార్ ఆయనతో తలపడుతున్నారు. వైశాలి జిల్లాలోని మహువా స్థానం నుంచి లాలు పెద్దకుమారుడు, మాజీమంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ బరిలో ఉన్నారు. ఆర్‌జెడి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే ముకేశ్ కుమార్, ఎల్‌జెపి నుంచి సంజయ్ సింగ్ పోటీచేస్తున్నారు. ముంగర్ జిల్లా తారాపుర్ నుంచి బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. మహాఘట్‌బంధన్ తరపున ఆర్‌జెడికి చెందిన అరుణ్‌షా ఆయనతో తలపడుతున్నారు. దర్భంగా జిల్లా అలీనగర్ నుంచి జానపద గాయకురాలు, బిజెపికి చెందిన మైతిలీ ఠాకూర్ ఎన్‌డిఎ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. ఆర్‌జెడి నుంచి బినోద్ మిశ్రా, జన సురాజ్ పార్టీ తరపున విప్లవ్‌కుమార్ చౌదరీ పోటీ చేస్తున్నారు.

## ప్రభుత్వ పతనం ఖాయం (మొదటి పేజీ తరువాయి)

తప్పించి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో సవరణ డ్రైవ్‌ను ఎంపిక చేసుకుని నిర్వహిస్తున్నారని ఎన్నికల సంఘం (ఇసి)పై మండిపడ్డారు. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఇసి ఎస్ఐఆర్ నిర్వహిస్తోందని, కానీ, బిజెపి పాలిత అసోంలో ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. ఈ నాలుగు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 'బిజెపి పాలిత అసోం, త్రిపుర, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో ఎస్ఐఆర్ ఎందుకు చేపట్టడం లేదో ఎన్నికల సంఘం కూడా సమాధానం చెప్పాలని అని ఆమె డిమాండ్ చేశారు. ఈ చర్యను కేంద్రంలో అధికార పార్టీకి సహాయం చేయడానికి ఉద్దేశించిన స్పష్టమైన వివక్ష అని ఆమె పేర్కొన్నారు. 2002లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన చివరి సర్ పూర్తి కావడానికి కనీసం రెండు సంవత్సరాలు పట్టిందని ఆమె అన్నారు. ఈసారి దానిని కేవలం ఒక నెలలోనే పూర్తి చేయడానికి ఇసి ఎందుకు తొందరపడుతుందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిని రాజకీయ ప్రేరేపిత చర్యగా ఆమె అభివర్ణించారు. అర్హత కలిగిన ఒక్క ఓటరును అయినా ఓటర్ల జాబితా నుండి తొలగిస్తే ఈ బిజెపి ప్రభుత్వం పతనమవుతుందని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో అక్రమ ఓటర్లు ఉన్నారని బిజెపి పదే పదే చేస్తున్న వాదనలను మమతా బెనర్జీ తిప్పికొట్టారు. సర్ తర్వాత బీహార్‌లో ఎంత మంది రోహింగ్యాలు లేదా బంగ్లాదేశీయులు కనిపించారని ప్రశ్నించారు. బెంగాలీలో మాట్లాడటం వల్ల ఎవరైనా బంగ్లాదేశీయులుగా మారరని ఆమె నొక్కిచెప్పారు. కాషాయ పార్టీ బెంగాలీలను కించపరిచేలా నకిలీ వార్తలు, మత ప్రచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. బిజెపి ఓట్ల ఆధారంగా కాదు, నోట్ల బలం ఆధారంగా గెలవాలని చూస్తోందని, ఈ ఓటర్ల జాబితాలు నకిలీ అయితే, అదే జాబితా ఆధారంగా జరిగిన మునుపటి ఎన్నికల్లో బిజెపి ఎలా గెలిచిందని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ 'నిశ్శబ్ద, అదృశ్య రిగ్గింగ్' అని అన్నారు. ఓటర్లలో భయాన్ని కలిగించడానికి బిజెపి దీనిని ఉపయోగిస్తోందని మండిపడ్డారు. 'ఈ భూమిలో పుట్టి పెరిగిన తర్వాత బిజెపి ముందు మన పౌరసత్వాన్ని నిరూపించుకోవాలా? ప్రజలను ప్రశ్నించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com